www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం
గురువారం 19-12-2024 | హైదరాబాద్ ప్రచురణ | Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | సంపుటి : 09, సంచిక : 88 పేజీలు : 8, వెల: రూ.5.00

గార్ల ఎస్ఐగా రియాజ్ పాషా బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - గార్ల : గార్ల మండల పోలిస్‌స్టేషన్‌లో నూతన ఎస్‌ఐగా ఎస్‌కె. రియాజ్ పాషా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు బాధ్యతలు నిర్వర్తించిన ఎస్ఐ జీనత్ కుమార్ మహబూబాబాద్‌కి బదిలీ అయ్యారు. నూతన ఎస్ఐ రియాజ్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా గట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నేరాలను అదుపులో ఉంచడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. పేకాట, కోడిపందాలు, గంజాయి వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.

పార్కులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతాం

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న పార్కులను ఆహ్లాదకరంగా తీర్చి దిద్దుతామని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజు తెలిపారు. రామవరంలోని అంబేద్కర్ పార్క్‌ను ఆయన బుధవారం సందర్శించారు. పార్కులోని సమస్యలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు వాకింగ్ ట్రాక్‌తో పాటు ఇతర సమస్యలను జీఎం దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన జీఎం వెంటనే పూర్తి చేయాలని తన వెంట వున్న ఏజీఎం (సివిల్) రామకృష్ణకు సూచించారు. త్వరలో ఈ పార్క్‌లో కావలసిన సౌకర్యాలు కల్పిస్తామని ఏజీఎం రామకృష్ణ అన్నారు. సింగరేణి కార్మిక ప్రాంతాలలో పార్కులను ఎంతో సుందరంగా వారి కుటుంబాల కోసం అభివృద్ధి చేస్తున్నామన్నారు. అన్ని పార్కులను ఆహ్లాదకరమైన అంగులతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్థానిక ప్రజలు అభ్యర్థన మేరకే ఈ పార్కును సందర్శించడం జరిగిందన్నారు. టాయిలెట్లు వాకింగ్ ట్రాక్‌ను పార్కులోని సమస్యలన్నీటిని పూర్తి చేసి సందర్శకులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజనీర్ రాజారాం, స్థానిక నాయకులు కనక రాజ్, తోగరు రాజశేఖర్, షేక్ షరీఫ్, దిలీప్ రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య ప్రాంతాల్లో పోలీస్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

విశాలాంధ్ర - ఇల్లందు : పట్టణంలో ప్రవేశించే భారీ వాహనాలు, బొగ్గు టిప్పర్లు సమయపాలన పాటించాలని ఇల్లందు టౌన్ పోలీసులు హెచ్చరికలు జారిచేసారు. బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక కరెంట్ ఆఫీస్ ఏరియా, జగదాంబ సెంటర్, గోవింద్ సెంటర్, కారేపల్లి ఎక్స్ రోడ్ ప్రదేశంలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగింది. పట్టణంలోకి భారీ వాహనాలు ఉదయం 8 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు పట్టణంలోనికి ప్రవేశించేందుకు వీలు లేదన్నారు. బొగ్గులు లోడ్ ద్వారా వచ్చే వెహికల్స్ అన్నీ కరెంట్ ఆఫీస్ మీదుగా లలితాపురం - ఓసి క్రాస్ రోడ్ నుంచి డి బ్లాక్ ద్వారా సి ఎస్ పి చేరుకొని బొగ్గు అన్లోడ్ చేయలన్నారు. మళ్లీ అదే మార్గం ద్వారా తిరిగి ఆ లారీలు వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బొగ్గు టిప్పర్లు టౌన్ లోకి రావడానికి ఎల్లవేళలా అనుమతి లేదన్నారు. వాహన యజమానులు, టిప్పర్లు నడిపే డ్రైవర్లు ఈ విషయాలు గమనించాలన్నారు.

ప్రభుత్వ సూచనల మేరకు ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : ప్రభుత్వ సూచనల మేరకు ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అద్వైత కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ గూడూరు మండలం, బొద్దుగొండ గ్రామంలో జరుగు తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం సర్వేను, ధాన్యం కొనుగోలు కేంద్రాలను, ఆశ్రమ హై స్కూల్, టీటీడబ్ల్యు ఆర్ఎస్జెసిలలో మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ప్రకారం సిబ్బంది సర్వే నిర్వహించాలని, పక్క సమాచారం సేకరించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాక్సిన్లు వేయాలి

విశాలాంధ్ర - కారేపల్లి : సమయానుకూలంగా చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాక్సిన్లు వేయాలని జిల్లా వైద్యాధికారి బి కళావతి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి సూచించారు. బుధవారం జిల్లా వైద్యశాఖ అధికారి బి.కళావతి సింగరేణి మండల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా చిన్న పిల్లలకు ఇస్తున్న వ్యాక్సినేషన్ను పరిశీలించారు. అనంతరం వ్యాక్సిన్ ఇతర మందులు నిల్వ ఉంచే గదిని పర్యవేక్షించారు. ప్రాథమిక వైద్యశాలలో ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలను గురించి మండల వైద్యాధికారి జి సురేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలందించాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : మండల పరిధిలోని గుర్రపు తండా గ్రామపంచాయతీ పరిధిలోని దర్గా తండాలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేశారు. ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారు ఫోటో, ఇల్లు ఫోటోలు తీయాలని, ఎవరైనా గతంలో దరఖాస్తు చేసుకోనట్లయితే ప్రస్తుతం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజా పాలన మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుదారు అందుబాటులో లేనట్లయితే వారికి సంబంధించిన ధ్రువపత్రాలను అప్లోడ్ చేయాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్, కొండమల్లేపల్లి ఎంపీడీవో బాలరాజు రెడ్డి పాల్గొన్నారు.

భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : జిల్లాలో చేపడుతున్న వివిధ ప్రాజెక్ట్‌ల భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో అధికారులతో వివిధ ప్రాజెక్టు భూసేకరణ పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. నేషనల్ హైవే 365 బిజీ ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్‌కు ప్యాకేజి-1,2,3 లకు సంబంధించి 1358.1650 ఎకరాల భూ సేకరణకు గాను 1292.1825 ఎకరాలకు అవార్డ్ పూర్తి చేసినట్లు, నేషనల్ హైవే ద్వారా రూ. 362.17 కోట్లు పరిహారాన్ని డిపాజిట్ చేసినట్లు ఆయన అన్నారు. రూ.355.85 కోట్ల నష్ట పరిహారం రైతుల ఖాతాలకు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ధాంసలాపురం వద్ద ఎంట్రీ, ఎక్జిట్ కి కావాల్సిన భూ సేకరణ ప్రక్రియ త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టుల వారిగా చేయాల్సిన భూసేకరణ, పూర్తి చేసినది, ఇంకనూ చేయాల్సినది, కోర్టు కేసులో వున్నది తదితర అంశాలపై కలెక్టర్ అధికారులకు సూచనలు చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకం ఏన్కూరు లింక్ కాల్వ మిగులు భూసేకరణ పూర్తిపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న పనుల భూసేకరణ కు రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. భూసేకరణ చేసిన ప్రాజెక్టులకు సంబంధించి పనులు అంతరాయం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, నేషనల్ హైవే పిడి రామాంజనేయ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఇ హేమలత, ఆర్డీవోలు నర్సింహారావు, రాజేందర్, ఇర్రిగేషన్, నేషనల్ హైవే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

26న సీపీఐ ఆవిర్భావ దినోత్సవ సభ జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26న ఖమ్మంలో ఆవిర్భావ సభను "నిర్వహిస్తున్నామని సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ విజ్ఞప్తి చేశారు. సిపిఐ ప్రజాసంఘాల సంయుక్త సమావేశం యర్రబాబు అధ్యక్షతన బుధవారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో జరిగింది. సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ డిసెంబర్ 26కు పార్టీ ఆవిర్భావించి 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా కోలాట, డప్పు దళాలు, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలతో ప్రదర్శన సాగుతుందని సురేష్ తెలిపారు. భక్తరామదాసు కళాక్షేత్రం వరకు ప్రదర్శన సాగుతుందని, అనంతరం సభ జరుగుతుందన్నారు. ఈ సభకు సిపిఐ జాతీయ నాయకులు హాజరుకానున్నారని సురేష్ తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ సుదీర్ఘ ఉద్యమ చరిత్రలో ప్రతి పల్లె పాలు పంచుకుందని కమ్యూనిస్టు పార్టీ చరితలో ప్రతి పల్లెకు ఓ స్థానం ఉందని సురేష్ తెలిపారు. ఆవిర్భావ దినోత్సవాలు ఏడాది పొడవునా నిర్వహించి ప్రతి ఘట్టాన్ని నేటి తరానికి తెలియజేయడంతో పాటు కార్యకర్తలను భవిష్యత్తు పోరాటాలకు సంసిద్ధం చేయాలన్నారు. ప్రజా సంఘాలు ఈ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని సురేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి భాగం హేమంతరావు, ప్రజా సంఘాల నాయకులు కొండపర్తి గోవిందరావు, మహ్మద్ సలాం, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రామాంజనేయులు, పగడాల మల్లేష్, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ పాల్గొన్నారు.

సమ్మెలో హార్ట్ ఎటాక్‌తో సమగ్ర శిక్ష ఉద్యోగిని మృతి

విశాలాంధ్ర - ఖమ్మం : సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు గత తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్నారు. సమగ్ర శిక్ష అభియాన్ పరిధిలోని వివిధ శాఖల్లో పని చేసే కాంట్రాక్టు ఉద్యోగులు కేజీబీవీలో పనిచేస్తున్న టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది తమను రెగ్యులర్ చేయాలని తక్షణం బేసిక్ పే అమలుచేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్‌తో సమ్మె చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కే హైమావతి అనే ఉద్యోగిని తీవ్ర ఒత్తిడికి లోనై హార్ట్ ఎటాక్‌తో మృతి చెందారు. దాదాపు 15 ఏళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగిగా ఎటువంటి ఉద్యోగ భద్రత లేకుండా కనీస వేతనం కూడా లేకుండా పనిచేసిన ఆమె హఠాత్తుగా మృతి చెందడంతో ప్రభుత్వం నుంచి ఎటువంటి బెనిఫిట్స్ కూడా ఆ ఉద్యోగికి అంది అవకాశం లేదు కావున ప్రభుత్వం వెంటనే స్పందించి ఆమెకు 15 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భారీ ఊరేగింపు నిర్వహించారు కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు షేక్ మహబూబ్ పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య, టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడితూ ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ పే స్కేల్‌ను వెంటనే అమలు చేయాలని, హైమావతి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వీర స్వామి, రాష్ట్ర మాజీ అధ్యక్షులు కనకయ్య, విజయ లక్ష్మి అనిల్, ఇస్మాయిల్, మదార్ సైదులు, సాంబశివరావు, సురేష్, జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

విశాలాంధ్ర బ్యూరో - కొమరం భీం : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. బుధవారం జిల్లాలోని సిర్పూర్- టి మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలోని వార్డును, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పారిశుద్ధ్య నిర్వహణ, రోగులకు అందించే భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి పరిసరాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. రోగులతో మాట్లాడుతూ వారికి అందిస్తున్న వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు.

హ్యుందాయ్ మోటర్ ఇండియా ఫౌండేషన్ 'ఆర్ట్ ఫర్ హోప్' 2025 గ్రాంటీల జాబితా ఖరారు

ముంబయి: 50 మంది కళాకారులు, ఆర్ట్ కలెక్టివ్‌లకు మద్దతునిస్తోన్న హ్యుందాయ్ మోటర్ ఇండియా ఫౌండేషన్, 'ఆర్ట్ ఫర్ హోప్' 2025 గ్రాంటీలను ప్రకటించింది. సమగ్ర స్క్రీనింగ్ ప్రక్రియ తర్వాత, ప్రత్యేక అవసరాలు ఉన్న కళాకారుల కోసం 5 గ్రాంట్లు సహా 50 మంది కళాకారులు, ఆర్ట్ కలెక్టివ్‌లకు వారి ప్రాజెక్ట్‌లకు జీవం పోయడానికి గ్రాంట్లు అందజేస్తారు. 'ఆర్ట్ ఫర్ హోప్' 2025 ద్వారా, హ్యుందాయ్ మోటర్ ఇండియా ఫౌండేషన్ 60 లక్షల రూపాయల సమీకృత గ్రాంట్ మద్దతును అందిస్తుంది. 50 మంది గ్రాంటీలు 15 రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు, డిజిటల్, ఫంక్షనల్, పెర్ఫార్మెన్స్, సాంప్రదాయ, విజువల్, మల్టీ డిసిప్లినరీ థీమ్‌లతో సహా విభిన్న కళారూపాలను విస్తరించినట్లు హ్యుందాయ్ మోటర్ ఇండియా లిమిటెడ్ (హెచ్‌ఎంఐఎల్) సీఎస్ఆర్ విభాగం ప్రకటించింది.

నైపుణ్య-ఆధారిత శిక్షణకు వీఐయూతో కైనెటిక్ గ్రీన్

పూణే: కైనెటిక్ గ్రీన్ ఎనర్జీ అండ్ పవర్ సొల్యూషన్స్ లిమిటెడ్, భారతదేశపు ప్రముఖ ఎలక్ట్రిక్ టూ , త్రీవీలర్ తయారీదారు, విశ్వకర్మ ఇన్‌స్టిట్యూట్స్ అండ్ యూనివర్శిటీ (వీఐయూ)తో కాన్సెప్ట్ డెవలప్‌మెంట్, నైపుణ్య-ఆధారిత శిక్షణ, అత్యాధునిక పరిశోధన, విద్యను అభివృద్ధి చేయడంలో దీర్ఘకాలిక భాగస్వామ్యం కోసం అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. ఈ సహకారం అకాడెమియా, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడానికి ఒక ముఖ్యమైన దశను సూచిస్తుంది, అదే సమయంలో భవిష్యత్తులో సిద్ధంగా ఉన్న ప్రతిభను అభివృద్ధి చేస్తుంది. ఈ భాగస్వామ్యం ద్వారా, కైనెటిక్ గ్రీన్ విద్యార్థులకు, అధ్యాపకులకు విలువైన వాస్తవ-ప్రపంచ అనుభవాన్ని అందిస్తూ దాని ల్యాబ్‌లు, వర్క్‌షాప్‌లు, పారిశ్రామిక సైట్‌లకు ప్రయోగాత్మక శిక్షణ, ప్రాక్టికల్ ఎక్స్‌పోజర్, యాక్సెస్‌ను అందిస్తుంది. ప్రతిగా, వీఐయూ దాని పాఠ్యాంశాలను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా మారుస్తుంది, విద్యార్థులు తమ కెరీర్‌లకు బాగా సిద్ధమయ్యారని నిర్ధారిస్తుంది.

వికాస్ ఎకోటెక్‌కు సీఐఐ ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అవార్డ్

విశాలాంధ్ర - హైదరాబాద్: వికాస్ ఎకోటెక్ లిమిటెడ్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీలో టాప్ 75 'ఇన్నోవేటివ్ కంపెనీల'లో ఒకటిగా అవార్డు పొందినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అవార్డ్స్ 2024 వేడుకలో కంపెనీ ప్రతిష్టాత్మక అవార్డుతో సత్కరించిందన్నారు. అవార్డు గ్రహీత ప్రతినిధులకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖ ప్రముఖులు, ఆవిష్కరణ పరిశ్రమ నాయకత్వానికి కంపెనీ అందించిన ముఖ్యమైన సహకారాన్ని గుర్తిస్తున్నారన్నారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డు వికాస్ ఎకోటెక్ లిమిటెడ్ అసాధారణమైన పనితీరు, ఆవిష్కరణల పట్ల తిరుగులేని నిబద్ధత, వృద్ధిని ప్రోత్సహించడంలో పరిశోధన, అభివృద్ధిని పెంపొందించడంలో గణనీయమైన విజయాలను ధృవీకరిస్తుందన్నారు. ప్రత్యేకించి, ఇది నానోకంపోజిట్స్, వేస్ట్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రో మాగ్నెటిక్ ప్రేరిత షీల్డింగ్ ఆధారంగా ఇంటెలిజెంట్ కోటింగ్‌ల రంగంలో కంపెనీ మార్గదర్శక పనిని గుర్తించి, హైలైట్ చేస్తుందన్నారు.

వలస ఆదివాసీలకు అండగా ఉంటాం : సీఐ, ఎస్ఐ

విశాలాంధ్ర - పినపాక : వలస ఆదివాసీలకు పోలీస్ శాఖ ఎప్పుడు అండగా ఉంటుందని అసాంఘిక శక్తులతో కలిసినట్లు తెలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఏడూళ్ల బయ్యారం సిఐ వెంకటేశ్వరరావు, ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం పినపాక మండలం పిట్టతోగు వలస ఆదివాసి గ్రామ ప్రజలకు ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ సహాయంతో దోమతెరలను సిఐ, ఎస్ఐల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలస ఆదివాసీల అభివృద్ధికి ఇతర ప్రభుత్వ శాఖలతో పోలీసులు కలిసి సమన్వయంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. పిల్లలను పాఠశాలలకు పంపించి బాగా చదివించాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా క్రమశిక్షణతో మెలగాలని ఆదివాసీలకు సూచించారు. గ్రామాల్లోకి అజ్ఞాత వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మావోయిస్టులకు ఎలాంటి సహాయ సహాయకారాలు అందించవద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాణిక్ హీలింగ్ సభ్యులు ఎస్.కె సొందు పాషా పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : నల్లగొండ జిల్లా పరిధి లోని జున్నాయి చింత గ్రామంలో సర్వే నిర్వహి స్తున్న ఇండ్లకు వెళ్లి దరఖాస్తుదారు పేర్లు, ఇప్పటివరకు గ్రామంలో నిర్వహించిన సర్వే వివరాలు, తదితర వివరాలు పంచాయతీ సెక్రటరీ స్వీటీ, ఎంపీడీవో మంజుల ద్వారా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ అడిగి తెలుసుకున్నారు. జిన్నాయి చింత గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 177 మంది దరఖాస్తు చేసుకోగా, ఇప్పటి వరకు 77 దరఖాస్తుల వివరాలను తనిఖీ చేసి అప్లోడ్ చేయడం జరిగిందని, తక్కినవి అప్లోడ్ చేయడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. పూర్తి వివరాలు అప్లోడ్ చేసిన తర్వాతే యాప్‌లో సబ్మిట్ చేయాలని, లేనట్లయితే ఇబ్బందులు తలెత్తుతాయని సూచించారు. దరఖాస్తుదారుకు సంబంధించిన ఫోటోతో సహా ఇంటి ధ్రువపత్రాలు, ఒక వేళ కొత్తగా ఇల్లు నిర్మించుకునేలా ఉంటే కొత్త ఇంటి స్థలానికి సంబంధించిన వివరాలను అప్లోడ్ చేయాలని చెప్పారు. దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, గృహనిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, ఎంపీ ఓ పద్మ తదితరులు ఉన్నారు.

వావ్ స్కిన్ సైన్స్‌తో మీషో భాగస్వామ్యం

విశాలాంధ్ర-హైదరాబాద్: వావ్ స్కిన్ సైన్స్, మీషోతో తన వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా భారతదేశపు టైర్ 2+ మార్కెట్‌లలో తన ఉనికిని విస్తరిస్తోందనీ సంస్థ ప్రతినిధులు తెలిపారు. గత సంవత్సరంలో, మీషోతో వావ్ స్కిన్ సైన్స్ భాగస్వామ్యం టైర్ 2+ ప్రాంతాల నుండి 1 మిలియన్ కొత్త కస్టమర్‌లను తీసుకువచ్చిందన్నారు. ఈ అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌లలో దాని విశ్వసనీయ సహజ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను హైలైట్ చేస్తుందన్నారు. తదుపరి 12 నెలల్లో, వావ్ స్కిన్ సైన్స్ మీషోపై వార్షిక రికరింగ్ రెవెన్యూ (ఎఆర్‌ఆర్)లో 5 ఎక్స్ వృద్ధిని లక్ష్యంగా చేసుకుందన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా, పెర్ఫ్యూమ్‌లు, ఫేస్‌వాష్, సీరమ్‌లు, క్రీములు, సన్‌స్క్రీన్‌లు, షాంపూలు, హెయిర్ ఆయిల్‌లు, అలోవెరా జెల్, హెల్త్ డ్రింక్స్ వంటి వర్గాలలో బలమైన డిమాండ్ కారణంగా వావ్ స్కిన్ సైన్స్ టైర్ 2+ మార్కెట్‌ల నుండి ఆర్డర్‌లలో 10 ఎక్స్ వృద్ధిని సాధించిందన్నారు. నాణ్యత, ప్రభావానికి బ్రాండ్ నిబద్ధత చిన్న పట్టణాల్లోని వినియోగదారులతో ప్రతిధ్వనించింది. అందం, సంరక్షణ స్థలంలో వావ్‌ను ప్రాధాన్య ఎంపికగా ఉంచిందన్నారు.

లక్ష వాహనాల రోల్ అవుట్‌తో ఇసుజు మోటార్స్ ఇండియా రికార్డు స్థాయి ఉత్పత్తి

ముంబయి: ఇసుజు మోటార్స్ ఇండియా, శ్రీ సిటీ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న తన అధునాతన తయారీ సదుపాయము (ఫెసిలిటీ) నుండి ఒక లక్ష వాహనాల రోల్ అవుట్ సాధించిన మైలురాయిని ప్రకటించింది. ఈ ముఖ్యమైన విజయము భారతీయ మార్కెట్ పట్ల ఇసుజు నిబద్ధతను నొక్కి ఉద్ఘాటిస్తుంది. దేశంలోని ఆటోమోటివ్ మార్కెట్‌లో పెరుగుతున్న తన ఉనికిని ప్రతిబింబిస్తుంది. ఒక లక్ష వాహనాల మైలురాయి సాధించడం అనేది తన మన్నిక, విశ్వసనీయత కొరకు నమ్మకం, గుర్తింపు ఉన్న ప్రముఖ ఇసుజు డి-మ్యాక్స్ వి-క్రాస్ మోడల్ రోల్ అవుట్‌తో గుర్తించబడింది. పరిశ్రమలు, వాణిజ్య, ఆహార ప్రక్రియ విభాగం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సెక్రెటరీ డా.ఎన్.యువరాజ్ ఈ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొనగా, శ్రీ సిటీ వ్యవస్థాపకుడు, ఎండి డా.రవీంద్ర సన్నారెడ్డి, శ్రీ సిటీ జపనీస్ కంపెనీ గ్రూప్ చైర్మన్ మకోటో సాడో ఈ వేడుకలో గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఇసుజు మోటార్స్ ఇండియా తన కార్యకలాపాలను 2016లో శ్రీ సిటీలో తన తయారీ సదుపాయాన్ని స్థాపించడం ద్వారా ప్రారంభించింది.

విద్యా సంస్థల్లో సిసిటివి స్టోరేజ్‌ల నిర్వహణకు వెస్టరెన్ డిజిటల్

హైదరాబాద్: సిసిటివి సిస్టమ్‌లు విద్య సంస్థలో మెరుగైన సంరక్షణని, భద్రతని అందించడంలో ముఖ్యపాత్రని పోషిస్తాయి. సమర్ధవంతమైన స్టోరేజ్ పరిష్కారాలు ఎలాంటి అవాంతరాలు లేని రికార్డింగ్‌ని అందించడంలో, సమాచారాన్ని చక్కగా నిర్వహించడంలో, ఫూటేజ్‌ని త్వరగా వీక్షించడంలో ముఖ్యంగా ఎక్కువ కెమెరా సర్విలెన్స్ ఉండే ప్రాంగణాల్లో ముఖ్య పాత్రని పోషిస్తాయి. డబ్ల్యుడి (వెస్టరెన్ డిజిటల్) పర్పుల్ ప్రో హెచ్‌డిడిలు 24/7 రికార్డింగ్ అవసరాలకు తగ్గట్టు తయారు చేయబడింది. అవి అత్యధిక సామర్థ్యాన్ని, మన్నికని అందిస్తాయి. ఆల్ ఫ్రేమ్ టెక్నాలజీతో తయారు చేయబడినప్పటికీ కూడా ఈ డ్రైవ్స్ వీడియో ప్లే బ్యాక్‌లను మెరుగుపరచగలవు. ఫ్రేమ్ నష్టాన్ని తగ్గించగలవు. అవి ఏ ఇబ్బందిలేని పనితీరుని కూడా అందించగలవు. బయట పెట్టే కెమెరాలు వాతావరణ పరిస్థితులకు ఎక్కువగా ప్రభావితం అవుతాయి కాబట్టి డబ్ల్యుడి పర్పుల్ ఎస్‌సి అల్ట్రా ఎండ్యూరెన్స్ మైక్రో ఎస్‌డి కార్డ్ లాంటి మన్నికైన పరిష్కారాలను అందించడంతో పాటు మెరుగైన పనితీరుని, తక్కువ నిర్వహణ అవసరాలను తీరుస్తాయి.

క్రిప్టో ఇన్వెస్ట్‌మెంట్‌లో నాలుగో ర్యాంక్‌లో హైదరాబాద్

హైదరాబాద్: భారతదేశంలో అతిపెద్ద క్రిప్టో ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ అనగానే అందరికి గుర్తుకు వచ్చేది కాయిన్ స్విచ్. ఇప్పటికే ఎంతోమంది వినియోగదారులకు దగ్గరైన కాయిన్ స్విచ్.. తాజాగా తమ వార్షిక పెట్టుబడిదారుల నివేదిక మూడో ఎడిషన్‌ను ప్రకటించింది. ఇండియాస్ క్రిప్టో పోర్ట్ ఫోలియో 2024-ఇండియా ఇన్వెస్ట్ పేరుతో ప్రకటించిన ఈ నివేదిక ప్రకారం.. భారతదేశం విభిన్న క్రిప్టో పర్యావరణ వ్యవస్థలో మరింతగా దూసుకుపోతోంది. అంతేకాకుండా డిజిటల్ ఆస్తులతో దేశం పెరుగుతున్న ఎంగేజ్‌మెంట్‌ను ఇది హైలైట్ చేస్తుంది. ఈ ఏడాది బిట్ కాయిన్ చరిత్ర సృష్టించింది. 100,000 డాలర్ల మార్క్‌ని దాటింది. దీంతో భారతీయ పెట్టుబడి దారులు మీమ్ కాయిన్స్‌పై పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. అత్యధికంగా పెట్టుబడి పెట్టబడిన నాణేల జాబితాలో డోగేకాయిన్ అగ్రస్థానంలో ఉండగా, అత్యధికంగా ట్రేడ్ చేయబడిన నాణేల విషయంలో ఎస్‌హెచ్‌ఐబీ అగ్రస్థానంలో ఉంది. పెపె 2024లో 1300శాతం పైకి వెళ్లి... టాప్-పెర్ఫార్మింగ్ అసెట్‌గా ఆవిర్భవించింది. నివేదిక ప్రకారం, 2024లో క్రిప్టో పెట్టుబడులకు హైదరాబాద్ నాలుగో అతిపెద్ద కంట్రిబ్యూటర్‌గా ఉంది.

ఆండ్రాయిడ్ 15 ద్వారా నథింగ్ ఓఎస్3.0 ప్రారంభం

న్యూఢిల్లీ: ఆండ్రాయిడ్ 15 ద్వారా మద్దతు చేయబడిన నథింగ్ ఓఎస్ 3.0(ఎన్‌ఓఎస్)ను లండన్‌కి చెందిన వినియోగదారు టెక్ బ్రాండ్ నథింగ్ బుధవారం ప్రకటించింది. నథింగ్ సిగ్నేచర్ గుర్తింపుకు చిహ్నంగా రూపొందించబడిన ఎన్‌ఓఎస్ 3.0 మరింత అనుకూలమైన, భాగస్వామ పరస్పర ప్రతిచర్యల కోసం మార్గాన్ని ఏర్పరుస్తూ యూజర్ అనుభవాన్ని పెంచడానికి గాను కొత్త ఫీచర్లు, మెరుగుదలలను పరిచయం చేసింది. వినూత్నమైన ఫీచర్లతో నిండిన ఎన్‌ఓఎస్ 3.0 ఆధునిక సెర్చ్ ఫంక్షన్, విస్తరించబడిన ఎడిటింగ్ సాధనాలైన ఫిల్టర్స్, మార్క్ అప్స్, సూచనలు సహా కొత్త నేటివ్ ఫోటోగాలరీ యాప్‌ను పరిచయం చేసింది. ఈ అప్‌డేట్ యూజర్లకు కనక్ట్ అయి ఉండే కొత్త మార్గాలను అందిస్తోంది, కొత్తగా రూపొందించబడిన, పూర్తి అనుకూలమైన లాక్ స్క్రీన్‌పై షేర్డ్ విడ్జెట్స్ ద్వారా స్నేహితులు, కుటుంబంతో పరస్పరం భాగస్వామానికి అవకాశం ఇస్తుంది. మెరుగుపరచబడిన ఉత్పాదక విడ్జెట్స్ అయిన కొత్త కౌంట్ డౌన్ విడ్జెట్స్ వంటి వాటి పైన యూజర్లు ట్రాక్‌లో ఉండటానికి అనుమతిస్తుంది.

భారత టాప్ 200 పారిశ్రామికవేత్తల జాబితా విడుదల

హైదరాబాద్: ఐడిఎఫ్‌సి ఫస్ట్ ప్రైవేట్ బ్యాంకింగ్, హురున్ ఇండియా 'ఐడిఎఫ్‌సి ఫస్ట్ ప్రైవేట్ అండ్ హురున్ ఇండియాస్ టాప్ 200 సెల్ఫ్ మేడ్ ఎంట్రప్రెన్యూర్స్ ఆఫ్ ది మిలీనియా 2024' రెండవ ఎడిషన్‌ను విడుదల చేశాయి, ఇది 2000 సంవత్సరం తరువాత ప్రారంభమైన భారతదేశంలోని 200 అత్యంత విలువైన కంపెనీల జాబితా నుంచి ఎంపికయ్యాయి. లిస్టెడ్ కంపెనీలకు మార్కెట్ క్యాపిటలైజేషన్, నాన్-లిస్టెడ్ కంపెనీలకు వాల్యుయేషన్‌గా నిర్వచించబడిన ఈ కంపెనీలు, వాటి విలువ ప్రకారం ర్యాంక్ చేయబడ్డాయి. ఈ జాబితాకు చేరుకోవడానికి కటాఫ్ తేదీ 25 సెప్టెంబర్ 2024. ఈ జాబితా భారతదేశంలో ప్రధాన కార్యాలయం ఉన్న కంపెనీలను మాత్రమే సూచిస్తుంది. ఈ జాబితాలోని అన్ని కంపెనీల సంచిత విలువ రూ. 36 లక్షల కోట్లు. 'ఇండియాస్ టాప్ 200 సెల్ఫ్ మేడ్ ఎంట్రప్రెన్యూర్స్ ఆఫ్ ది మిలీనియా 2024' దేశవ్యాప్తంగా 46 నగరాలకు చెందిన వ్యక్తులను కలిగి ఉంది. దాదాపు 98 మంది పారిశ్రామికవేత్తలతో బెంగళూరు అగ్రస్థానంలో ఉంది, 73 మందితో ముంబై, 51 మందితో న్యూఢిల్లీ తర్వాతి స్థానంలో ఉన్నాయి.

కాలిఫోర్నియా బాదంపప్పులతో క్రిస్మస్ వేడుకలు

ముంబయి: క్రిస్మస్ అనేది స్నేహితులు, ప్రియమైనవారితో సంతోషకరమైన జ్ఞాపకాలను సృష్టించే సమయం. ఈ సంవత్సరం, రుచిలో రాజీ పడకుండా ఆరోగ్యకరమైన ఎంపికలు చేయడం ద్వారా పండుగ స్ఫూర్తిని వేడుక జరుపుకోవాలని, ముఖ్యంగా కాలిఫోర్నియా ఆల్మండ్స్ ఆరోగ్యకరమైన వేడుకలను సమున్నతం చేస్తాయని ఆహారనిపుణులు చెపుతున్నారు. అత్యంత ప్రజాదరణ పొందిన కాలిఫోర్నియా బాదం పప్పులు మాంసకృత్తులు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, మెగ్నీషియం, జింక్, ఫాస్ఫరస్‌తో సహా 15 ముఖ్యమైన పోషకాలతో కూడిన పోషకాహార పవర్‌హౌస్‌గా నిలుస్తాయి. ప్రతిరోజూ కొన్ని కాలిఫోర్నియా బాదంపప్పులను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెరను నిర్వహించడంలో సహాయపడుతుందని సైంటిఫిక్ జర్నల్స్ ప్రచురించిన 200 పైగా అధ్యయనాలు చెపుతున్నాయి. బాలీవుడ్ నటి సోహా అలీ ఖాన్, న్యూట్రిషన్ అండ్ వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి, ఫిట్‌నెస్ మాస్టర్, పిలేట్స్ ఇన్‌స్ట్రక్టర్ యాస్మిన్ కరాచీవాలా, న్యూ ఢిల్లీలోని మాక్స్ హెల్త్‌కేర్‌లోని రీజినల్ హెడ్ - డైటెటిక్స్ రితికా సమద్దర్ తదితరులు ఈ వాదనను బలపరుస్తున్నారు.

సరికొత్త ప్యాకేజింగ్‌లో సిడ్స్ ఫార్మ్ అసెప్టిక్ ఏ2 గేదె పాలు

హైదరాబాద్: తెలంగాణలోని ప్రముఖ డి2సి డెయిరీ బ్రాండ్ అయిన సిడ్స్ ఫార్మ్ , ఇటీవల తమ ఏ2 బఫెలో మిల్క్‌ను కొత్త 1-లీటర్ అసెప్టిక్ ప్యాకేజింగ్ ఎస్కెయులో విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది రూ.120కి లభించనుంది. స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన మరియు కల్తీ లేని పాలు, పాల ఉత్పత్తులను అందించడం ద్వారా ప్రసిద్ది చెందిన, సిడ్స్ ఫార్మ్ అధిక-నాణ్యత గల పాల ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఈ అనుకూలమైన ప్యాకేజింగ్ ఎంపికతో ఆవిష్కరణలను కొనసాగిస్తోంది. కొత్త అసెప్టిక్ ప్యాక్ మొదట్లో హైదరాబాద్, బెంగళూరులో అందుబాటులో ఉంటుంది. ముంబై, కొచ్చి, నాసిక్, అహ్మదాబాద్, సూరత్, రాజ్‌కోట్, వడోదర, హుబ్బల్లి వంటి నగరాల్లోని ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో కూడా అందుబాటులో ఉంటుంది. కొత్త ఉత్పత్తి ప్రారంభంపై సిడ్స్ ఫార్మ్ వ్యవస్థాపకుడు డాక్టర్ కిశోర్ ఇందుకూరి హర్షం వ్యక్తం చేశారు.

కోటక్ బిజ్ ల్యాబ్స్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ ప్రారంభం

ముంబై: కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ ప్రారంభ ఆదాయ దశ స్టార్టప్‌లకు సాధికారత కల్పించే లక్ష్యంతో తన సీఎస్ఆర్ ప్రయత్నాల క్రింద ఓ నూతన కార్యక్రమం అయిన కోటక్ బిజ్ ల్యాబ్స్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. స్టార్టప్‌లు వృద్ధి సవాళ్లను అధిగమించడానికి, వాటి వ్యాపారాలను సమర్థవంతంగా పెంచుకోవడంలో సహాయపడటానికి ఈ ప్రోగ్రామ్ రూపొందింది. ఐఐఎంఏ వెంచర్స్, ఎన్ఎస్ఆర్‌సీఈఎల్, టి-హబ్ టాప్ ఇంక్యుబేటర్‌ల సహకారంతో, మెంటర్ షిప్, మార్కెట్ యాక్సెస్, అడ్వైజరీ సపోర్ట్‌తో సహా తగిన యాక్సిలరేషన్ కార్యక్రమాలను కోటక్ బిజ్ ల్యాబ్స్ అందిస్తుంది. భారతీయ స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ శక్తివంతమైనది. అయితే, మార్కెట్ విస్తరణ, కస్టమర్ సముపార్జన, కార్యాచరణను ఉన్నతస్థాయికి తీసుకెళ్లడం, వ్యూహాత్మక భాగస్వామ్యాలు వంటి ముఖ్యమైన సవాళ్లను ఎదుర్కొంటుంది.

క్వాలీజీల్ 3వ అత్యాధునిక సమర్థత కేంద్రం ప్రారంభం

హైదరాబాద్: క్వాలిటీ ఇంజనీరింగ్, డిజిటల్ పరివర్తన సేవలలో అంతర్జాతీయంగా అగ్రగామి అయిన క్వాలీజీల్, హైదరాబాద్‌లో తమ కొత్త సమర్థత కేంద్రంను ప్రారంభించినట్లు వెల్లడించింది. ఈ జోడింపుతో, క్వాలీజీల్ ఇప్పుడు భారతదేశంలో మూడు సామర్థ్య కేంద్రాలను హైదరాబాద్ కేంద్రంగా నిర్వహిస్తోన్నట్లయింది. 2021లో తమ కార్యకలాపాలన ప్రారంభించినప్పటి నుండి దాని అద్భుతమైన వృద్ధికి ఇది నిదర్శనంగా నిలుస్తుంది. ఈ వ్యూహాత్మక విస్తరణ, శ్రేష్ఠత పట్ల సంస్థ అంకితభావం, ఆవిష్కరణ కోసం దాని ప్రయత్నం, డిజిటల్ పరివర్తనలో గ్లోబల్ లీడర్‌గా ఎదగాలనే దాని నిబద్ధతను వెల్లడిస్తుంది. 3,500పైగా ఉద్యోగాలను సృష్టించడం, రాబోయే నాలుగేళ్లలో 130 మిలియన్ డాలర్ల వార్షిక ఆదాయాన్ని సాధించడం, క్వాలిటీ ఇంజినీరింగ్‌లో అగ్రగామిగా నిలవడం వంటి క్వాలీజీల్ విస్తృత స్థాయి లక్ష్యాలకు అనుగుణంగా ఈ కేంద్రం ఉంటుంది. ఏఐ, ఆటోమేషన్ శక్తితో అత్యాధునిక పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి క్వాలీజీల్ కోసం సరైన కేంద్రంగా హైదరాబాద్ నిలుస్తుంది.

గురువారం
19-12-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 88
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అమెరికా రికార్డు బద్దలు కొట్టిన చైనా

బీజింగ్: అంతరిక్ష పరిశోధనల్లో అమెరికాను చైనా అధిగమించింది. తాజాగా చైనా వ్యోమగాములు కై షూఝె, సాంగ్ లింగ్‌డాంగ్ 9 గంటలపాటు సుదీర్ఘంగా స్పేస్ వాక్ చేసి చరిత్ర సృష్టించారు. వారు షెంఝూ-19 అనే అంతరిక్ష నౌకా బృందంలో సభ్యులు. వారు చైనాలో తయారు చేసిన ఫెయిటియాన్ రెండోతరం స్పేస్ సూట్లు ధరించారు. ఈ విషయాన్ని చైనా మ్యాన్‌డు స్పేస్ ఏజెన్సీ (సీఎంఎస్‌ఏ) వెల్లడించింది. చైనాకు చెందిన తియాంగాంగ్ స్పేస్ సెంటర్ రోబోటిక్ కెమెరా దీనిని చిత్రీకరించి బీజింగ్ ఏరోస్పేస్ కంట్రోల్ సెంటర్‌కు పంపింది. సాంగ్ లింగ్‌డాంగ్ యుద్ధవిమాన మాజీ పైలట్. చైనాలో 1990 తర్వాత పుట్టిన వారిలో స్పేస్ వాక్ చేసిన తొలి వ్యక్తిగా నిలిచారు.

'జమిలి'పై జేపీసీ

ఠాకూర్, ప్రియాంకకు చోటు

న్యూదిల్లీ: జమిలి ఎన్నికల బిల్లుల పరిశీలన కోసం జేపీసీని కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో బీజేపీ తరపున అనురాగ్ ఠాకూర్, కాంగ్రెస్ తరపున ప్రియాంకా గాంధీ తదితరులకు చోటు కల్పించినట్లు సమాచారం. ఇందులో 21 మంది లోక్‌సభ సభ్యులు, 10 మంది రాజ్యసభ సభ్యులు ఉండనున్నారు. ఈ బిల్లును పరిశీలించే జేపీసీ నామినీ జాబితాలో కాంగ్రెస్ తరపున ఆ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ పేరు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆమెతో పాటు కాంగ్రెస్ నుంచి మనీశ్ తివారీ,

- మిగతా 5 లో

ఉమర్ ఖలీద్‌కు తాత్కాలిక బెయిల్

న్యూదిల్లీ: జేఎన్‌యూ మాజీ విద్యార్థి నేత ఉమర్ ఖలీద్‌కి బుధవారం మధ్యంతర బెయిల్ లభించింది. తన సోదరి వివాహానికి హాజరయ్యేందుకు ఏడు రోజుల పాటు దిల్లీలోని కర్కర్డుమా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. జడ్జి సమీర్ బాజ్‌పాయ్ ఖలీద్ మధ్యంతర బెయిల్ దరఖాస్తును విచారించారు. తాత్కాలిక బెయిల్ మంజూరునకు రూ.20వేలకు వ్యక్తిగత పూచీకత్తుతోపాటు అంతేమొత్తానికి రెండు ష్యూరిటీలు సమర్పించాల్సిందిగా ఆదేశించారు. సోషల్ మీడియా వేదికలను

- మిగతా 5 లో

హోంగార్డులకు హైకోర్టులో ఊరట

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: హోంగార్డులకు హైకోర్టులో ఊరట లభించింది. కానిస్టేబుళ్ల భర్తీలో హోంగార్డులను ప్రత్యేక కేటగిరీగా పరిగణించాలని తెలిపింది. ఈ మేరకు రాష్ట్రస్థాయి పోలీస్ నియామక బోర్డును ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆరు వారాల్లో ప్రత్యేక మెరిట్ జాబితాను తయారు చేయాలని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో హోం గార్డులు హైకోర్టును ఆశ్రయించారు. పరిటాల రవి హత్య కేసులో నిందితులకు హైకోర్టు ఎట్టకేలకు బెయిల్ మంజూరు చేసింది.

ఇదీ లోకం!



పెనుగొండను వరించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

న్యూదిల్లీ: ప్రముఖ రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కింది. 'దీపిక' అభ్యుదయ వ్యాస సంపుటికిగాను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ఆయనను వరించింది. పెనుగొండ లక్ష్మీనారాయణ గుంటూరులో న్యాయవాదిగా పని చేస్తున్నారు. 1972 నుంచి అభ్యుదయ రచయితల సంఘం కార్యకర్తగా జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో అనేక బాధ్యతలు నిర్వహించి... 2023లో జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితీవేత్తగా గుర్తింపు పొందారు. 1972లో సమిధ అనే కవితతో తన సాహితీ ప్రస్థానాన్ని ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 21 భాషలకుగాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను బుధవారం సాహిత్య అకాడమీ ప్రకటించింది. వీటిలో ఎనిమిది కవితలు, మూడు నవలలు, రెండు లఘు కథలు, మూడు వ్యాస సంపుటిలు, మూడు సాహిత్య విమర్శకు సంబంధించిన పుస్తకాలు ఉండగా... నాటక, పరిశోధన అంశాలకు సంబంధించి ఒక్కో పుస్తకం ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపికయ్యాయి. బెంగాలీ, డోగ్రి, ఉర్దూ భాషలకు తర్వాత దశలో అవార్డులు ప్రకటించనున్నారు. మొత్తం 21 భారతీయ భాషల్లో సాహిత్య రంగంలో సుప్రసిద్ధ వ్యక్తులు జ్యూరీ మెంబర్లుగా వ్యవహరించి... కొన్ని పుస్తకాలను ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుకు సిఫారసు చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ అధ్యక్షతన సమావేశమైన సాహిత్య అకాడమీ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఈ పురస్కారానికి ఎంపికైన పుస్తకాల పేర్లను ప్రకటించింది. విజేతలకు వచ్చే ఏడాది మార్చి 8న దిల్లీలో పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. అవార్డు కింద రూ.లక్ష నగదుతో పాటు శాలువాతో సన్మానిస్తారు. తెలుగు భాషకు సంబంధించి ప్రొఫెసర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, కె.శ్రీనివాస్, జేఎస్ మూర్తి (విహారి) జ్యూరీలుగా వ్యవహరించారు. తెలుగు నుంచి మొత్తం 14 పుస్తకాలను జ్యూరీ సిఫారసు

- మిగతా 5 లో

అంబేద్కర్‌ను అవమానిస్తే

దేశం సహించదు

- అమిత్‌షా క్షమాపణ చెప్పాలి
- రాహుల్, ఖర్గే డిమాండ్
- పార్లమెంటులో ఆవరణలో 'ఇండియా' ఎంపీల నిరసన

న్యూదిల్లీ: రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్రహోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై విపక్షాలు భగ్గుమన్నాయి. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. ఆయన వ్యాఖ్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టంచేశాయి. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా విపక్షాలు అటు పార్లమెంటు ఉభయసభల్లోనూ, ఇటు పార్లమెంటు ఆవరణలోనూ ఆందోళనకు దిగాయి. మోదీ ప్రభుత్వ వైఖరిని తూర్పారబట్టాయి. పార్లమెంటు వెలుపల జరిగిన ధర్నాలో విపక్ష ఎంపీలంతా పాల్గొన్నారు. మరోవైపు, అమిత్‌షా వ్యాఖ్యలను ప్రధాని మోదీ నిస్సిగ్గుగా సమర్థించుకున్నారు. షా వ్యాఖ్యల్లో తప్పేమీ లేదని చెప్పుకొచ్చారు. అదేసమయంలో అమిత్‌షాపై తృణమూల్ కాంగ్రెస్ రాజ్యసభలో సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చింది. ధర్నాలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానించడాన్ని దేశం సహించబోదని బీజేపీపై ధ్వజమెత్తారు. అమిత్‌షా రాజ్యసభలో చేసిన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకుని జాతికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌కు, ఆయన సిద్ధాంతాలకు బీజేపీ వ్యతిరేకమని రాహుల్ మండిపడ్డారు. అంబేద్కర్‌ను అవమానించేలా చేసిన వ్యాఖ్యలకు షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ రాహుల్‌తో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా ఇండియా ఐక్యసంఘటనకు చెందిన ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో నిరసనకు దిగారు. పార్లమెంటు మకరద్వార్ ఎదుట అంబేద్కర్ చిత్రపటాలు పట్టుకొని ఆందోళన చేశారు. 'జై భీమ్', 'సంఘ్ కా విధాన్ నహీ చలేగా', 'అమిత్ షా మాఫీ మాంగో' అంటూ నినదించారు. నిరసనల్లో కాంగ్రెస్ సహా డీఎంకే, ఆర్జేడీ, ఆప్ ఎంపీలు పాల్గొన్నారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ... 'వారు రాజ్యాంగానికి వ్యతిరేకం. రాజ్యాంగాన్ని మారుస్తామని ముందే చెప్పారు. వారు అంబేద్కర్‌కు, ఆయన సిద్ధాంతాలకు వ్యతిరేకం. వారి మొత్తం పని అంబేద్కర్ రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడమేనని దేశం మొత్తానికి తెలుసు' అని అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కూడా అంబేద్కర్ ఫొటో కూడిన పోస్టర్ పట్టుకొని నిరసనలో

- మిగతా 5 లో

అమిత్‌షాపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు
వివరాలు 5 లో ▸▸

అమిత్‌షాకు మోదీ సమర్థన

న్యూదిల్లీ: రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హోంమంత్రి అమిత్ షాను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెనకేసుకొచ్చారు. అంబేద్కర్‌ను అవమానించిన కాంగ్రెస్ చీకటి చరిత్రను అమిత్ షా బహిర్గతం చేశారని, దీంతో ఆ పార్టీ ఉలిక్కిపడిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఏళ్ల తరబడి దేశంలో

- మిగతా 5 లో

ఆర్యవైశ్యుల సంక్షేమమే ధ్యేయం

- వివిధ పథకాలకు రూపకల్పన
- శాసనమండలి ప్రశ్నోత్తరాల్లో భట్టి

విశాలాంధ్ర-హైదరాబాద్: ఆర్యవైశ్యుల సంక్షేమానికి పథకాలు రూపొందించాలని కార్పొరేషన్‌ను ఆదేశించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శాసనమండలిలో బుధవారం ప్రశ్నోత్తరాలను పురస్కరించుకుని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్... వైశ్యుల సంక్షేమం, అభివృద్ధి కి కార్పొరేషన్, నిధుల ఖర్చు వివరాలపై ప్రశ్నించగా భట్టి సమాధానం ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేశామని, సిబ్బంది జీతభత్యాలకు రూ.36 లక్షలు కేటాయించినట్లు వివరించారు. ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్యుల సంక్షేమం, స్వయం ఉపాధి కోసం కొన్ని పథకాలు డిజైన్ చేయాలని ఆదేశించామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను, సహచర మంత్రులు ఎప్పటికప్పుడు కేంద్ర మంత్రులను కలిసి చట్ట ప్రకారం తమకు రావాల్సిన నిధులు ఇవ్వాలని అడుగుతున్నాం... ఆ మేరకు తీసుకొస్తున్నామని వివరించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత... వివిధ పథకాల కింద రాష్ట్ర

- మిగతా 5 లో

రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా దిల్ రాజ్ బాధ్యతలు

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా వి.వెంకట రమణరెడ్డి అలియాస్ దిల్ రాజు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మాసాబ్ ట్యాంక్ ఎఫ్‌డీసీ కార్యాలయంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య పదవి చేపట్టారు. సమాచార పౌర సంబంధాల స్పెషల్ కమిషనర్ డాక్టర్ హరీష్ ... దిల్ రాజును పుష్పగుచ్ఛాలతో అభినందించారు. పలువురు సినీ రంగ ప్రముఖులు ఆయనను అభినందించారు. దిల్ రాజ్ మాట్లాడుతూ తెలంగాణలో ఫిలిం ఇండస్ట్రీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని

- మిగతా 5 లో

అదానీ, మోదీతో దేశ ప్రతిష్టకు భంగం

- లంచాలిచ్చారని అమెరికా విచారణ సంస్థల నివేదిక
- జేపీసీకి బీఆర్ఎస్ డిమాండ్ చేస్తే శాసనసభలో తీర్మానానికి సిద్ధం
- 'చలో రాజ్‌భవన్'లో సీఎం రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: గడిచిన 75 ఏళ్లుగా కాంగ్రెస్ ఎంతో కష్టపడి దేశ ప్రతిష్టను పెంచిందని... అదానీ, ప్రధాని మోదీ ప్రపంచం ముందు మన దేశ పరువును ఒక్క రోజులోనే తీశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఏఐసీసీ పిలుపుమేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో 'చలో రాజ్‌భవన్' కార్యక్రమం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ అమెరికా సంస్థలకు అదానీ లంచాలు ఇచ్చారని

- మిగతా 5 లో

ఆటో డ్రైవర్లకు రూ.12 వేలు ఇవ్వండి

యూనిఫామ్‌లో అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

5 లో

రైలు పట్టాలపై

రైతుల నిరసన

- పంజాబ్‌లో నిలిచిన రైలు సేవలు
- ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్

5 లో

భూహక్కుల పరిరక్షణకే

భూ భారతి

- ఆర్వోఆర్ 2020 ప్రక్షాళన
- పరిగణనలోకి ప్రతిపక్ష సభ్యుల సూచనలు, సలహాలు
- శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో సామాన్యుల భూహక్కుల పరిరక్షణే ధ్యేయంగా 2024 ఆర్వోఆర్-భూభారతి చట్టాన్ని రూపొందించామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శాసనసభలో మంత్రి 'భూభారతి' బిల్లును బుధవారం ప్రవేశపెట్టారు. మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 1971లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్వోఆర్ చట్టం 49 ఏళ్లపాటు ఉపయోగపడిందని, విభజన తర్వాత కూడా ప్రజోపయోగంగా ఉపయుక్తమయిందని తెలిపారు. అర్ధరాత్రి నాలుగు గోడల నడుమ రూపొందిన ధరణి చట్టం లక్షలాది సమస్యలను తెచ్చిపెట్టిందని చెప్పారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, నాటి ప్రతిపక్షనేత, నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నేటి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తమ పాదయాత్రల్లో... ధరణిని అరేబియా సముద్రంలో కలుపుతామని ఇచ్చిన హామీని ప్రజలు విశ్వసించారని మంత్రి పొంగులేటి తెలిపారు. వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకుగాను ఆర్వోఆర్ 2020ను పూర్తిగా ప్రక్షాళన చేసి భూభారతిని రూపొందించామని చెప్పారు. ప్రజాప్రతినిధులు,కవులు , మేధావులు, విశ్రాంత అధికారుల సలహాలు సూచనలు స్వీకరించి కొత్త చట్టానికి రూపకల్పన చేశామని వివరించారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఏడు పేజీలు, వినోద్‌రావు ఐదు పేజీల సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకున్నామని మంత్రి తెలిపారు. 33 జిల్లాలలో

- మిగతా 5 లో

ముంబైలో ఫెర్రీ ప్రమాదం

13 మంది మృతి

ముంబై: ముంబై తీరంలో జరిగిన పడవ ప్రమాదంలో 13 మంది మృతి చెందినట్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వెల్లడించారు. 101 మందిని కాపాడినట్లు తెలిపారు. చనిపోయిన వారిలో 10 మంది పర్యటకులు కాగా... ముగ్గురు నేవీ సిబ్బంది ఉన్నట్లు ప్రకటించారు. పర్యాటకులతో వెళ్తున్న పడవను నేవీకి చెందిన స్పీడ్‌బోటు ఢీకొట్టడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. 'గేట్ వే ఆఫ్ ఇండియా' నుంచి ఎలిఫెంటా గుహలకు 'నీల్‌కమల్' అనే ఫెర్రీ... దాదాపు 100 మందికి పైగా పర్యాటకులతో బయలుదేరింది. ఈ క్రమంలో చక్కర్లు కొడుతూ వేగంగా వచ్చిన నేవీకి చెందిన ఓ స్పీడ్ బోటు దాన్ని బలంగా ఢీకొట్టిం ది. దాంతో ఫెర్రీ సముద్రంలో మునిగిపోయింది. ఘటన సమయంలో ఫెర్రీతోపాటు నేవీ బోటులో ఎంత మంది ఉన్నారనే విషయంపై స్పష్టత లేదు. ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే రెస్క్యూ బృందాలు భారీ ఆపరేషన్ చేపట్టాయి. 11 నేవీ పడవలతో సహా తీర ప్రాంత దళాలకు చెందిన మూడు పడవలు, నాలుగు హెలికాప్టర్లు ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. పోర్టు అధికారులు, కోస్ట్‌గార్డ్, మత్స్యకారుల సహాయక చర్యల్లో పాల్గొని 101 మందిని కాపాడాయి.

ఏపీలో భారీ వర్షాలు...

- నేడు, రేపూ అవకాశం !
- అక్కడక్కడా పడిన జల్లులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రాన్ని వర్షాలు వీడటం లేదు.బంగాళాఖాతంలో వరుసగా ఏర్పడుతున్న వాయుగుండాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. పదేపదే వర్షాలతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. రైతుల పంటకు తీరని నష్టం కలిగింది. అక్టోబరులో దానా, నవంబర్‌లో ఫెంగల్ తుపానుల ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజల ఇబ్బందుల్ని ఎదుర్కొన్నారు. దీంతోపాటు వాతావరణంలో మార్పుల కారణంగా ఏపీలో అడపాదడపా వర్షాలు పడుతూనే ఉన్నాయి. తాజాగా రాష్ట్రంలో మరోసారి భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం మరో రెండు రోజుల్లో మరింత బలపడే అవకాశముందని, ఈ కారణంగా ఏపీలోని పలు జిల్లాల్లో భారీ నుంచి, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని, ఇది రాష్ట్రానికి ముప్పుగా మారనుందని తెలిపింది. రాష్ట్రం తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు, వర్షాలు పడనున్నాయి. అల్పపీడనం కారణంగా దక్షిణ కోస్తా తీరంలో గంటకు గరిష్టంగా 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో సముద్రంలో భారీగా అలలు ఎగిసిపడుతున్నాయి. అలల ధాటికి సముద్రం కోతకు గురవుతుంది. కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు..కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో మోస్తరు నుంచి అతిభారీ వర్షాలు కురవనున్నాయి.

సంపాదకీయం

అంబేద్కర్ కోసం మొసలి కన్నీళ్లు

దళితులను ఈసడించడమే పనిగా పెట్టుకున్న సంఘ్ పరివార్ దళితులకే కాదు, సామాజిక న్యాయం కోరుకునే వారందరికీ స్ఫూర్తి ప్రదాత డా. అంబేద్కర్ ను అవమానించడం చాలా సులువైన వ్యవహారం. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం రాజ్యసభలో మాట్లాడుతూ "అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్" అనడం ఫాషన్ అయిపోయింది. ఇన్నిసార్లు భగవంతుడి పేరు తలిస్తే ఏడు జన్మల దాకా స్వర్గ ప్రాప్తి కలిగేది" అన్నారు. అమిత్ షా చేసిన ఈ వ్యాఖ్యలు బుధవారం పార్లమెంటు ఆవరణలో కాంగ్రెస్ తో ఇతర ప్రతిపక్ష పార్టీల తీవ్ర నిరసనలకు దారి తీశాయి. అమిత్ షా క్షమాపణ చెప్పాలి అని కోరాయి. అమిత్ షా అంబేద్కర్ మీద చేసిన వ్యాఖ్యలు బీజేపీ, ఆర్.ఎస్.ఎస్.కు త్రివర్ణ పతాకం మీద, అశోకచక్రం మీద విశ్వాసం లేదని నిరూపించాయి. సంఘ్ పరివార్ అంబేద్కర్ ప్రధాన పాత్ర పోషించి రూపొందించిన భారత రాజ్యాంగంమీద ఇసుమంత గౌరవం కూడా లేదని అనేకసార్లు రుజువైంది. భారత రాజ్యాంగంలో భారతీయత బొత్తిగా లేదని అరిచి గీ పెట్టింది. ఆర్.ఎస్.ఎస్. కార్యాలయం మీద 50 ఏళ్లపాటు త్రివర్ణ పతాకం ఎగురవేయడానికి నిరాకరించింది. గాంధీ హత్య తరవాత అప్పుడు కేంద్ర హోం మంత్రిగా ఉన్న సర్దార్ పటేల్ ఆర్.ఎస్.ఎస్. ను నిషేధించారు. తర్వాత అనేక వాగ్దానాలు చేస్తేనే గాని ఆర్.ఎస్.ఎస్. మీద నిషేధం తొలగలేదు. భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని ఆర్.ఎస్.ఎస్. హామీ ఇవ్వవలసి వచ్చింది. ఆ కుదురు నుంచి వచ్చిన అమిత్ షా నోటికొచ్చినట్టు అంబేద్కర్ అని అయిదుసార్లు అని ప్రతిపక్షాల మీద విరుచుకు పడ్డారు. అమిత్ షా ప్రతిపక్షాలను దుయ్యబట్టడానికే ఈ మాట ప్రస్తావించి ఉండవచ్చు. కానీ ఈ క్రమంలో అంబేద్కర్ నూ తీవ్రంగా అవమానించారు. ఈ మాట అన్న తరవాత ప్రతిపక్షాలు పార్లమెంటు ఆవరణలోనే నిరసన తెలియజేసినా అమిత్ షా ధోరణి ఏ మాత్రం మారలేదు. కాంగ్రెస్ అంబేద్కర్ వ్యతిరేక పార్టీ అని దుమ్మెత్తి పోశారు. రాజ్యాంగ రచన ముసాయిదా కమిటీకి అంబేద్కర్ ఎలా అధ్యక్షుడయ్యారో, అప్పుడు రాజ్యాంగ నిర్ణాయక సభకోసం జరిగిన ఎన్నికలలో అంబేద్కర్ బెంగాల్ నుంచి గెలిచినా ఆయన నియోజకవర్గం పాకిస్థాన్‌లో భాగం అయిపోయినందువల్ల ఆయన మళ్లీ ఎన్నిక కావడానికి కాంగ్రెస్ ఎలా తోడ్పడిందో లాంటి అంశాలు అమిత్ షాకు తెలిసే అవకాశం లేదు. తెలుసుకోవాలన్న జిజ్ఞాసా లేదు. అసత్యాలు అర్ధ సత్యాల మీద ఆధారపడి గావుకేకలు పెట్టి ప్రత్యర్థులని నిర్వీణుల్ని చేయడం మాత్రమే అమిత్ షా లాంటి వారికి తెలిసిన విద్య. అంబేద్కర్ ను కాంగ్రెస్ గౌరవించలేదని మోదీ మొదలైన వారు అస్తమానం వాదిస్తూ ఉంటారు. కాంగ్రెస్ అంబేద్కర్‌ను గౌరవించలేదని మాట వరసకు అనుకుందాం. మరి మోదీ ప్రధానిగా ఉన్న ఈ పదకొండేళ్ల కాలంలో అంబేద్కర్‌ను గౌరవించడానికి చేసిన మహత్తరమైన కార్యక్రమం ఏమిటో! విదేశీ ప్రముఖులు వచ్చినప్పుడు వారిని ఉయ్యాలలూగించడం తెలిసిన మోదీకి అంబేద్కర్ గురించి విదేశాధినేతలకు తెలియజెప్పాలన్న ఆలోచన ఆయనకు ఎన్నడూ రాలేదు ఎందుకని? మొట్టమొదటి నెహ్రూ మంత్రివర్గం నుంచి అంబేద్కర్ రాజీనామా చేయడానికి నెహ్రూతో ఉన్న విభేదాలే కారణం అని సంఘ్‌పరివార్ పెద్దలు పెద్ద గొంతేసుకుని దుష్ప్రచారం చేస్తున్నారు. ఆయన రాజీనామాకు కారణం ఏమిటో తెలుసుకునే ఓపిక కూడా వారికి లేదు. అంబేద్కర్ ఎన్నడూ కాంగ్రెస్ వాది కాదు. అయినా రాజ్యాంగ నిర్ణాయక సభలో ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించడంలో కీలక పాత్ర నెహ్రూదే అన్న తెలివిడి లేకపోతే ఎలా? రాజ్యాంగ నిర్ణాయక సభ ఏర్పడడానికి జరిగిన ఎన్నికలలో అంబేద్కర్ బెంగాల్ నుంచి గెలిచారు. కానీ ఆయన నియోజకవర్గం దేశ విభజనలో పాకిస్థాన్‌లో భాగం అయిపోయింది. అప్పుడు జెస్సోర్, ఖుల్నా నుంచి నామినేట్ అయిన జోగేంద్రనాథ్ మండల్ అంబేద్కర్ కోసం తన స్థానానికి రాజీనామా చేశారు. అప్పుడు కాంగ్రెస్ దగ్గరుండి అంబేద్కర్ ను గెలిపించింది. ఆ తరవాత అంబేద్కర్ బొంబాయి ప్రెసిడెన్సీ నుంచి గెలిచారు. అంబేద్కర్ మీద నెహ్రూకు కోపమే ఉంటే రాజ్యాంగ సభలో ఆయనను ఉండేట్టు చూసి, ముసాయిదా కమిటీ అధ్యక్ష స్థానం అప్పగించే వారే కాదు. ఆ రోజుల్లో నెహ్రూ తనకు పలుకుబడిని వినియోగించి ఉంటే ఇవేవీ సాధ్యమయ్యేవే కాదు. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత ఏర్పడ్డ తొలి మంత్రివర్గంలో నెహ్రూ అంబేద్కర్ కు స్థానం కల్పించారు.

అంబేద్కర్ మీద టన్నుల కొద్దీ అభిమానం ఒలకబోస్తున్న బీజేపీ ఆయన చెప్పినవాటిని పాటించడానికి చేసిందేమీ లేదు. ఎస్.సి., బి.సి.లకు వ్యతిరేకమైన చర్యలే తీసుకుంటారు. ఆచరణలో మోదీ ప్రభుత్వం అంబేద్కర్ కు బద్ధ విరోధులుగా ప్రవర్తిస్తుంది. ఇండియా గెలిస్తే రిజర్వేషన్లు లాగేస్తారని లోకసభ ఎన్నికలలో ప్రచారం చేసింది మోదీ నాయకత్వంలోని సంఘ్ పరివార్ మూకలేగా. అంబేద్కర్ నామస్మరణ చేస్తూనే రాజ్యాంగాన్ని సమూలంగా మార్చేస్తామని చెప్పడం అంబేద్కర్ కు అపచారం తలపెట్టడం కాదా? "నాకు దేశమే లేదు" అన్న మహనీయుడు అంబేద్కర్. అంబేద్కర్ స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వామి కాకపోవచ్చు. కానీ ఆయన సమాంతరంగా సామాజిక న్యాయం కోసం పోరాడారు. ఎస్.సి., ఎస్.టి.లకు అమలవుతున్న రిజర్వేషన్లు ఆయన పుణ్యమే. జమ్మూ-కశ్మీర్ కు రాష్ట్రప్రతిపత్తి లేకుండా చేసిన బీజేపీ బాహాటంగా రాజ్యాంగాన్ని ఛిద్రం చేసింది. అంబేద్కర్ కు ఇంతకన్న పెద్ద ద్రోహం ఏమీ ఉండదు. విగ్రహాలు నిర్మించడం అంబేద్కర్ ను గౌరవించడం కానే కాదు. హత్రస్ సంఘటన జరిగినప్పుడు సంఘ్ పరివార్ వ్యవహరించిన తీరు ఏహ్యమైనదే కాదు ఒక రకంగా అంబేద్కర్‌ను అగౌరవపరిచేదే. తృణమూల్ కాంగ్రెస్ అమిత్ షాకు వ్యతిరేకంగా హక్కుల నోటీసు ఇచ్చింది. ఆమ్ ఆద్మీ పార్టీ అమిత్ షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. అమిత్ షా అయిదుసార్లు అంబేద్కర్ పేరెత్తి ప్రతిపక్షాల మీద విరుచుకు పడడం యథాలాపంగా చేసిన పనికాదు. ఇది ఆయనలో గూడుకట్టుకున్న దళిత, వెనుకబడిన తరగతుల వారి మీద ఉన్న కొంచెపు చూపుకు నిదర్శనం. జాతీయోద్యమంలో ఎలాంటి పాత్ర లేని బీజేపీ సర్దార్ పటేల్, సుభాష్ చంద్ర బోస్ కీర్తిని తమ ఖాతాలో వేసుకోవడానికి ప్రయత్నించింది. అంబేద్కర్‌ను అదే సంకుచిత ప్రయోజనాలకు వినియోగించుకుంటోంది. అమిత్ షాను వెనకేసుకు రావడానికి మోదీ తన అబద్ధాల ఖాతాలో మరిన్నిచేర్చారు. అంబేద్కర్ నామస్మరణవల్ల సాధించేదేమీ ఉండదు. అంబేద్కర్ ను సమర్థించే వారి మీద విమర్శనాస్త్రాలు సంధించి అంబేద్కర్‌ను సంరక్షిస్తున్నట్టు నటించడం బీజేపీ ఛద్మ వేషాలకు పరాకాష్ఠ. నిజానికి అంబేద్కర్ మీద బీజేపీ లేని అభిమానం ఒలక బోయడం ఫాషన్ అయిపోయిన రోజులివి.

నిర్వీర్యమవుతున్న గ్రామీణ ఉపాధి పథకం

బొల్లిముంత సాంబశివరావు

గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రారంభమై 18 సంవత్సరాలు పూర్తి అయినా, గ్రామీణ పేదలకు పథకంలో పేర్కొన్న విధంగా పనులు కల్పించడంలో విఫలమైంది. గ్రామీణ పేదలకు సంవత్సరానికి 100 రోజులు పని కల్పించాల్సిన ఈ పథకం దినదిన గండంగా మారింది. 2005 ఆగస్టు 23న గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పార్లమెంట్ ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా నార్పల మండలం బండమదపల్లి గ్రామంలో 2006 ఫిబ్రవరి 2 ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఈ పథకాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 742 జిల్లాలు, 7,204 మండలాలు, 2,69,121 గ్రామ పంచాయతీల్లో ఈ పథకం అమల్లో ఉంది. ఆర్భాటంగా ప్రారంభించిన ఈ పథకం ఇప్పుడే నిర్వీర్యమౌతున్నది. 2020-21 లో లక్షా 9 వేల కోట్లు కేటాయిస్తే, 2022-2023లో 73వేల కోట్లకు నిధుల కేటాయింపు తగ్గింది. 2024-25 బడ్జెట్ లో 60వేల కోట్లు మాత్రమే కేటాయించారు. 2021లో వేతన కూలి 255 రూపాయలు ఉంటే, నేడు 305 రూపాయలు గా ఉంది. పెరిగిన వేతనం ప్రకారం తాజా బడ్జెట్ లో లక్షా 30వేల కోట్లు కేటాయించాలి. బడ్జెట్ కేటాయింపులు తగ్గటంతో ఉపాధి పని దినాలు కూడా తగ్గాయి. 2020-21లో ఉపాధి పథకం కింద పని చేసే కుటుంబాలు 7కోట్ల 55లక్షల ఉంటే, 2023లో 4కోట్ల 68 లక్షలకు తగ్గింది. అంటే 2కోట్ల 87 లక్షల కుటుంబాలు ఉపాధి పనులకు దూరమయ్యారు. 2020-21లో సగటు కుటుంబానికి 52 రోజులు పని కల్పిస్తే, నేడు 47 రోజులకు



పడిపోయింది. వంద రోజులు పనిచేసిన కుటుంబాలు 71,97,090 ఉంటే నేడు 44,97,113గా ఉన్నాయి. దేశ వ్యాప్తంగా ఒక్క పని దినం కూడా నమోదు కాని పంచాయితీలు 13,467 ఉన్నాయంటే ఉపాధి హామీ పథకం అమలు ఎంత దారుణంగా ఉందో తెలుస్తుంది. ఉపాధి హామీ పథకం పనులకు ఇచ్చే వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయి. వేతనాల పెంపుదల నామ మాత్రమే. గత సంవత్సరంతో పోలిస్తే గోవాలో 10.56శాతం, కర్ణాటకలో 10.40శాతం వేతనం పెరగగా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ లో 3శాతం మాత్రమే పెరిగాయి. తెలుగు రాష్ట్రాల్లో 10.29శాతం పెరుగుదల ఉంది. 2023-24లో సగటు దినసరి వేతనం 261 రూపాయలు కాగా పెంచిన కూలితో 289 రూపాయలుగా ఉంది. వ్యవసాయ పనులకు 4నుండి 5 వందల రూపాయల దాకా రోజు కూలి ఉంది. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పోలిస్తే, ఉపాధి కూలీలకు పెరిగిన వేతనం నామ మాత్రమే. ఉపాధి హామీ పథకం గురించి నియమించిన పార్లమెంటరీ స్థాయి కమిటీ, వ్యవసాయ కూలీల వేతనాలకు దీటుగా ఉపాధి కూలీల వేతనాలు ఉండాలని ప్రభుత్వానికి సూచించింది. పురుషులతో సమానంగా స్త్రీలకు వేతనం ఇవ్వాలని చెప్పింది. వ్యవసాయ కూలీల కనీస వేతనం 375 రూపాయలుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దేశ వ్యాప్తంగా ఉపాధి వేతనాలు ఒకే విధంగా చెల్లించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. వివిధ రాష్ట్రాల్లో ఉపాధి వేతనాలు 2024 నుంచి 318 రూపాయల మధ్య ఉన్నాయని తెలిపింది. కూలీలకు ఇవ్వాల్సిన వేల కోట్ల రూపాయలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బకాయిలు పెడుతున్నాయి. 2023 జనవరి నాటికి కేంద్ర ప్రభుత్వం కూలీలకు 13 వేల కోట్ల రూపాయలు బకాయి పడిందని పార్లమెంటరీ ప్యానల్ తెలియచేసింది. 2024 ఏప్రిల్ నాటికి 20,751 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని బకాయిలపై ప్యానల్ ప్రశ్నలు వేసింది. కూలీల వేతనాలు పెంచటానికి ఒక యంత్రాంగాన్ని రూపొందించాలని గ్రామీణాభివృద్ధి శాఖ (డిఓఆర్‌డి) ని కోరింది. ఏపీలో మూడు నెలలుగా వేతనాలు ఇవ్వని ఫలితంగా కూలీలకు 2,300కోట్ల రూపాయల బకాయిలు ఉండగా, తెలంగాణాలో 200 కోట్లు కూలీలకు చెల్లించాల్సిన బకాయిలు ఉన్నాయి.

స్వరాజ్ అభియాన్ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజా ప్రయోజనాల వాజ్యంపై న్యాయస్థానం స్పందిస్తూ, తీరుబడిగా వేతనాలు ఇస్తామంటే ఎలా కుదురుతుంది? దేశ జనాభాలో 70 శాతం ప్రజలు, శ్రామిక శక్తి గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. వ్యవసాయమే దేశానికి కీలకంగా ఉంది. పాలకుల విధానాల వల్ల ఉపాధి కోసం పట్టణాలకు వెళ్లిన శ్రామికులు కోవిడ్ కాలంలో ఉపాధిని కోల్పోయి తిరిగి గ్రామాలకు వచ్చారు. వారిని గ్రామీణ ప్రజలు ఆదరించారు. వ్యవసాయ పనులతో పాటు అదనంగా గ్రామీణ ఉపాధి హామీ పనులు కల్పించినప్పుడే వారికి ఉపాధి లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వం అదనంగా పనులు కల్పించకపోగా ఉన్న పనులను కూడా తగ్గించటంతో గ్రామీణ ప్రజలకు ఉపాధి లేమి తీవ్రమై, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంటున్నాయి. గ్రామీణ పేదల ఉపాధి లేమికి, వలసలకు, సేద్యపు భూమికి విడదీయరాని సంబంధం ఉంది. సేద్యపు భూమి కొద్ది మంది భూ కామందుల చేతుల్లో బందీగా ఉంది. వారిని బంధనాల నుండి భూమిని విముక్తి చేసి పేదలకు భూ పంపిణీ జరిగినప్పుడే ఉపాధి సమస్య పరిష్కారంతోపాటు వలసల నివారణ జరుగుతుంది. ప్రజా వ్యతిరేక ప్రభుత్వం భూములు పంచదు. ప్రజలే పోరాడి సాధించుకోవాలి. అందుకోసం పోరాడుతూనే, గ్రామీణ ఉపాధి హామీ పనులు 200 రోజులకు పెంచాలని, రోజు కూలి 500 రూపాయలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలి.

సెల్ : 9885983526

జమిలితో నియంతృత్వం

డా.జ్ఞాన్ పాఠక్

"ఒకే దేశం- ఒకే ఎన్నిక" నిర్వహణకు డిసెంబరు 17న లోక్‌సభలో జమిలిఎన్నికల బిల్లులను ప్రవేశపెట్టారు. ఈ బిల్లులు ఆమోదిస్తే ఒకేసారి లోక్‌సభకు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అసెంబ్లీ ఎన్నికలను నిర్వహిస్తారు. అయితే దీనివల్ల ఫెడరల్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది. చాలా అధికంగా కేంద్రం పాలన దేశమంతటా ఉంటుంది. తిరిగి ఫెడరల్ వ్యవస్థను బాగుచేసేందుకు కూడా అవకాశంలేని పరిస్థితి ఏర్పడుతుంది. రాష్ట్రాల స్వయంప్రతిపత్తి దిగజారిపోతుంది. చివరకి దేశంలో ప్రజాస్వామ్యం ధ్వంసమయ్యే ప్రమాదం ఉంది. లోక్‌సభలో ఈ బిల్లులు ప్రవేశపెట్టినప్పుడు వీటి మూలంగా చెప్పలేనికష్టాలు ఎదురవుతాయని చర్చల్లో పాల్గొన్న ప్రతిపక్షనాయకుడు హెచ్చరించారు. ఇదే సమయంలో హోంమంత్రి అమిత్ షా సవివరంగా ఈ బిల్లులను చర్చిద్దామని సూచించారు. ఈ బిల్లులను పార్లమెంటు సంయుక్త కమిటీకి పంపాలని ప్రధాని మోదీ అభిప్రాయపడుతున్నారని అమిత్ షా అన్నారు. అన్నిస్థాయిల్లోనూ లోతుగా చర్చిస్తామని అన్నారు. సంయుక్త కమిటీ సవివరంగా చర్చిస్తుందని అన్నారు. ఆ తరువాత మళ్లీ ఈ బిల్లులపై పార్లమెంటు చర్చిస్తుందని చెప్పారు. సంయుక్త పార్లమెంటరీ కమిటీ అందించిన నివేదికను కేంద్ర మంత్రివర్గం ఆమోదిస్తుందన్నారు. సంయుక్త పార్లమెంటరీ కమిటీలో 31మంది లోక్‌సభ, రాజ్యసభల నుంచి సభ్యులుగా ఉంటారని 90రోజుల్లోపు కమిటీ తన నివేదికను అందిస్తుందన్నారు.

సభలో ప్రవేశపెట్టిన బిల్లులను చట్టరూపంలో తీసుకువస్తారు. ఈ

చట్టాన్ని 129వ రాజ్యాంగ సవరణ 2024 అంటారు. అలాగే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాలు(సవరణ) 2024 అని పిలుస్తాము. లోక్‌సభలో జరిగిన ఈ పరిణామాలన్నీ భవిష్యత్తులో తీవ్రమైన కష్టాలను తీసుకువస్తాయి. ప్రారంభదశలో చర్చల తరువాత పాలక, ప్రతిపక్షాల సభ్యుల సంఖ్య ఎంపిక జరిగింది. పాలకపక్షానికి 269 మంది సభ్యులుండగా ప్రతిపక్షానికి 198 మంది సభ్యులున్నట్లుగా ఈవిఎంలు తెలిపాయి. మొదటిసారి లెక్కింపులో ఈ ఓట్లు చాలా భిన్నంగా ఉన్నాయి. లోక్‌సభలో బిల్లులు ఆమోదం పొందాలంటే మూడింటరెండువంతుల మెజారిటీ అవసరం. ఈ బిల్లుల పట్ల బీజేపీలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. బిల్లులకు ఆమోదం తెలపడానికి ఇష్టంలేని బీజేపీ సభ్యులు చాలామంది(20) ఉన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నికకు అవసరమైన విప్ జారీ చేసినప్పటికీ 20 మంది సభ్యులు సభకు హాజరుకాలేదు. ఒకేదేశం ఒకే ఎన్నికపై సవాళ్లు, అడ్డంకులు ఎదురుకావచ్చు. ఈ చట్టాలు నియంతృత్వ చర్యగా ఉంటాయని ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. ఈ బిల్లులను ప్రవేశపెట్టిన న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ అన్నారు. రాష్ట్రాలు తగిన అధికారాలను కలిగి ఉన్నప్పటికీ అవి చట్టాలను అడ్డుకోలేవని అన్నారు. ప్రతిపక్షాలు చెబుతున్నట్లుగా బిల్లుల మౌలిక స్వరూపసిద్ధాంతం మీద దాడిచేయలేరని మంత్రి అన్నారు. అయితే ప్రతిపక్షాలు ఈ బిల్లులు రాజకీయ స్వభావం కలిగిఉన్నాయని విమర్శించారు. సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలించకుండా వీటి వల్ల ముప్పు ఉంటుందని భావించలేమని మంత్రి చెప్పారు.

కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారి బిల్లులను వ్యతిరేకిస్తూ ఇది రాజ్యాంగ మౌలిక స్వరూపసిద్ధాంతం మీద దాడి చేస్తున్నాయన్నారు. సమాజ్‌వాది పార్టీ ఎంపీ ధర్మేంద్రయాదవ్ మాట్లాడుతూ, బీజేపీ ఈ బిల్లులను ప్రవేశపెట్టడం దేశంలో 'నియంతృత్వం' తీసుకువచ్చే ప్రయత్నమేనని విమర్శించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ ఈ బిల్లులు రాజ్యాంగ మౌలిక సూత్రంపై దాడి చేస్తున్నాయన్నారు. రాష్ట్ర అసెంబ్లీలు, ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి లేదా పార్లమెంటుకు లోబడి ఉండేవికాదని అన్నారు. ఈ బిల్లులు ఫెడరల్ వ్యవస్థను దెబ్బతీయడమే కాకుండా ప్రజాస్వామ్యం తీవ్ర ఇబ్బందుల్లో పడిపోతుందన్నారు. ఐదేళ్ల రాష్ట్రపాలన పూర్తికాకుండానే పడిపోయినట్లయితే మధ్యంతర ఎన్నికలు జరపవలసి ఉంటుంది. ఎన్నికలు, ప్రభుత్వాల ఏర్పాటు పరిపాలనకు సంబంధించి ఈ బిల్లులు రాష్ట్ర ఫెడరల్ స్వయంప్రతిపత్తిని దెబ్బతీసినట్లే అవుతుందని కళ్యాణ్ బెనర్జీ అన్నారు. రాష్ట్ర ఫెడరల్ స్వయంప్రతిపత్తిలో జోక్యం చేసుకోకపోయినట్లయితే ఈ బిల్లులు ఇంకేం చేస్తాయని ప్రశ్నించారు.

ఐదేళ్ల పూర్తికాకుండానే రాష్ట్ర ప్రభుత్వాలు పడిపోయినట్లయితే ఈ బిల్లు రాజ్యాంగంలోని 83 ఆర్టికల్‌ను సవరించి లోక్‌సభ పాలనాకాలం ఐదేళ్ల కాలాన్ని నిర్ధారించాలని లేకపోతే, సభను రద్దుచేయవలసి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రాల ఫెడరల్ స్వయంప్రతిపత్తికి, ప్రజాస్వామ్యానికి ఇంకా ఇతర అనేక రిస్క్‌లు ఉంటాయి. ఇప్పుడు ప్రతిపాదించిన ఒకే దేశం ఒకే ఎన్నిక సంపన్నులకు, జాతీయ, రాజకీయ పార్టీలకు అనుకూలంగా ఉంటాయి. పేదలకు ప్రాంతీయపార్టీలకు అన్ని అవకాశాలను తస్కరించివేస్తాయి. ప్రాంతీయ అభివృద్ధికి, ప్రజాస్వామ్యానికి అనేక ఇబ్బందులు తలెత్తుతాయి. అత్యధికంగా కేంద్రీకృతమే గాక రాజకీయ అసమానత ఏర్పడుతుంది. రాష్ట్ర చట్ట సభల అధికారాలు దిగజారిపోతాయి. ప్రాంతీయ, జాతీయ ప్రజలు ఆకాంక్షలు భిన్నంగా ఉంటాయి. ఓటర్లు గందరగోళానికి గురవుతారు. ఒకేసారి ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా, పారదర్శకంగా ఉండవు. కేంద్ర ప్రభుత్వానికి అన్నిఅధికారాలు ఉంటాయి. అప్పుడు కేంద్రం ఇష్టానుసారంగా వ్యవహరించే అవకాశం ఉంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలకు అదనపు ఆర్థిక పరిపాలన భారం పడుతుంది. అందువల్ల ఒకే దేశం...ఒకే ఎన్నిక ఆలోచనను విరమించుకోవాలని ప్రతిపక్షాలు కోరాయి.

ఒకే దేశం ఒకే ఎన్నిక సంపన్నులకు, జాతీయ, రాజకీయ పార్టీలకు అనుకూలంగా ఉంటాయి. పేదలకు ప్రాంతీయపార్టీలకు అన్ని అవకాశాలను తస్కరించివేస్తాయి. ప్రాంతీయ అభివృద్ధికి, ప్రజాస్వామ్యానికి అనేక ఇబ్బందులు తలెత్తుతాయి. అత్యధికంగా కేంద్రీకృతమే గాక రాజకీయ అసమానత ఏర్పడుతుంది. రాష్ట్ర చట్ట సభల అధికారాలు దిగజారిపోతాయి. ప్రాంతీయ, జాతీయ ప్రజలు ఆకాంక్షలు భిన్నంగా ఉంటాయి. ఓటర్లు గందరగోళానికి గురవుతారు. ఒకేసారి ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా, పారదర్శకంగా ఉండవు.

ప్రశ్నార్థకమైన సీమ ఎత్తిపోతల పథకం

డా. ముచ్చుకోట సురేష్ బాబు

శ్రీశైలం నుంచి రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు సరఫరా చేస్తున్న కృష్ణా జలాల కంటే ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలో కలుస్తున్న జలాలే అధికం. ఈ నీటిని ఒడిసిపట్టి దుర్భిక్ష ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో కీ.శే వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో పీహెచ్‌పీ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కులకు పెంచారు. శ్రీశైలంలో నీటి మట్టం 881 అడుగుల మేర ఉన్నప్పుడే పీహెచ్‌పీ ద్వారా ప్రస్తుతం ఉన్న డిజైన్ మేరకు 44 వేల క్యూసెక్కులను తరలించవచ్చు. అయితే ఆ మేరకు శ్రీశైలం నీటి మట్టం ఏడాదికి సగటున 15 నుంచి 20 రోజులు కూడా ఉండటం లేదు. ఈ నేపథ్యంలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, శ్రీశైలం కుడి గట్టు కాలువ సామర్థ్యాన్ని 80 వేల క్యూసెక్కులకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దుర్భిక్ష ప్రాంతాలకు వరదాయిని 'శ్రీశైలం' జలాశయంలో నీటి మట్టం 854 అడుగుల్లో ఉంటేనే రాయలసీమ, నెల్లూరు ప్రాజెక్టులకు కనీసం ఏడు వేల క్యూసెక్కులైనా నీళ్లందుతాయి. కానీ 800 అడుగుల నుంచి తెలంగాణ సర్కార్ నీటిని తరలిస్తుండటం వల్ల జలాశయంలో నీటి మట్టం ఉండేట్లు చేయడం కష్టమవుతోంది. కృష్ణా బోర్డు కేటాయింపులు ఉన్నా సరే నీళ్లందని పరిస్థితి నెలకొంది.

ఈ నేపథ్యంలో మన వాటా నీటిని వినియోగించుకుని సాగు, తాగునీటి కష్టాలను అధిగమించేందుకు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపడితే, అది దుర్భిక్ష ప్రాంతాలకు కల్పతరువు. కృష్ణా జలాలపై రాయలసీమకున్న హక్కులను, శ్రీశైలం జలాశయంలో కేటాయింపులను సద్వినియోగం చేసుకునేందుకు ఉద్దేశించిన రాయలసీమ ఎత్తిపోతల పథకం ప్రశ్నార్థకంగా మారింది. తెలంగాణ నుంచి అభ్యంతరాలు అలాగే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కేసులతో అర్థాంతరంగా నిలిచిపోయింది. కృష్ణా బోర్డు పరిధిలోకి వచ్చిన 36 ప్రాజెక్టుల్లో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ కూడా ఉంది. శ్రీశైలం 800 అడుగులు నుంచి పోతిరెడ్డిపాడు దిగువ భాగంలోకి కాల్వద్వారా రోజు మూడు టిఎంసిల నీటిని తరలించేందుకు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని డిజైన్ చేశారు.

శ్రీశైలం కుడిగట్టు కాలువతో పాటు తెలుగు గంగ, గాలేరు నగరికి కృష్ణా జలాల్లో కేటాయింపుల మేరకు 102 టిఎంసిల నీరు వరద సమయంలో 30 రోజుల్లో తరలించేందుకు వీలుగా పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని ప్రభుత్వం పెంపుదల చేసింది. గత రెండు దశాబ్దాలుగా రాయలసీమలోని ప్రాజెక్టులు

అసంపూర్తిగా ఉన్నాయి. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులలో కొన్ని పూర్తయినా, వాటికి నీళ్లివ్వాలన్నా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంచటమే మార్గమని నిపుణులు చెబుతున్నారు. తెలంగాణ అభ్యంతరంతోపాటు గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న ప్రాజెక్టు ముందుకు కదలాలంటే అటవీ పర్యావరణ అనుమతులు తప్పనిసరి, బోర్డు పరిధిలో పోతిరెడ్డిపాడు ఉన్నంత మాత్రాన అనుమతులు ఉన్నట్లు కాదు. పునర్విభజన చట్టంలోని 11 వ షెడ్యూలులో ప్రస్తావించిన ప్రాజెక్టులన్నీ బోర్డు పరిధిలోకి వచ్చాయి. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడుకు నీటిని తరలించే ప్రాజెక్టుకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం సవరించిన డిపిఆర్ ప్రస్తుతం అపెక్స్ కౌన్సిల్ పరిశీలనలో ఉంది. పర్యావరణ అనుమతులువస్తే తప్ప అపెక్స్ కౌన్సిల్ అనుమతించే అవకాశం లేదు. రాయలసీమ జిల్లాలకు కృష్ణా నీరు రావాలంటే ఇదొక్కటే మార్గం. రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా శ్రీశైలంలో 881 అడుగులు ఉన్నప్పుడు 44 వేల క్యూసెక్కులు, 854 అడుగులు ఉన్నప్పుడు 6 వేల క్యూసెక్కులు తీసుకెళ్లే అవకాశం ఉంటుంది. ఎప్పుడో తప్ప ఆ స్థాయిలో శ్రీశైలం నీటి మట్టం ఉండదు. శ్రీశైలం ప్రాజెక్ట్ నీటి మట్టం 841 అడుగులకు తగ్గిపోతే పోతిరెడ్డిపాడు నుంచి నీటిని తరలించడం సాధ్యం కాదు. అందువల్లనే 800 అడుగుల నుంచే నీటిని తరలించేలా ఎత్తిపోతల పథకాన్ని డిజైన్ చేశారు. పోతిరెడ్డిపాడు నుంచి వినియోగించుకుంటున్న నీటి కన్నా శ్రీశైలం నుంచి కృష్ణలోకి పరవళ్లు తొక్కుతూ ప్రకాశం బ్యారేజి మీదుగా సముద్రంలోకి కలుస్తున్న నీరు శాతం కనిష్ఠంగా రెండు రెట్లు, గరిష్ఠంగా 20 రెట్లు అధికంగా ఉంటుంది.

వరద జలాలతో పాటు రెండు రాష్ట్రాల కేటాయింపుల మేరకు వాడుకోలేకపోతున్న నీళ్లు కూడా ఉన్నాయి. ప్రభుత్వం తెలంగాణ అభ్యంతరాలను సాంకేతికంగా నివృత్తి చేసి రాయలసీమ ఎత్తిపోతలను సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అత్యంత కరువు పీడిత అనంతపురం జిల్లాకు కాస్త దప్పిక తీర్చడానికి వీలుగా బచావత్ ట్రిబ్యునల్ తుంగభద్ర జలాశయం నుంచి కె.సి.కెనాల్‌కు కేటాయించిన 10 టిఎంసిలను పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పిఎబిఆర్)కు కేటాయించి, ఆ మేరకు కె.సి.కెనాల్‌కు శ్రీశైలం జలాశయం నుంచి 10 టీఎంసీల నీటిని సర్దుబాటు చేయాలన్న చిరకాల కోరికను మన్నించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అఖిల పక్ష సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఆ మేరకు 2005 ఆగస్టు 14న ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. కృష్ణా నదిలో వరద ప్రవాహం 30 రోజులకు మించి ఉండటం లేదని, చెన్నై నగరానికి సరఫరా చేయాల్సిన 15, యస్.ఆర్.బి.సి.కి 19, కె.సి.కెనాల్‌కు 10, మొత్తం 44 టియంసిల నికరజలాలతో పాటు తెలుగు గంగకు 29, గాలేరు - నగరి సుజల ప్రవంతి పథకానికి 38 కలిపి 67 టిఎంసిల మిగులు జలాలు, అలాగే తాగునీటి అవసరాలకు స్థూలంగా 112 టిఎంసిలను 30 రోజుల్లో సరఫరా చేయాలంటే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను 44,000 క్యూసెక్కుల సామర్థ్యానికి విస్తరించడానికి 2005 లో జరిగిన అఖిలపక్ష సమావేశం ఆమోద ముద్ర వేసింది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి పూర్తి స్థాయిలో నీటిని తరలించాలంటే శ్రీశైలం జలాశయంలో 854 అడుగుల నీటి మట్టం ఉంటే తప్ప సాధ్యం కాదు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1996 జూన్ 15న జారీ చేసిన జి.ఓ.నెం.69 అవరోధంగా ఉన్నాయన్న భావన బలంగా ఉన్నది. దాని ప్రకారం కనీస నీటి మట్టం 834 అడుగులుగా నిర్ధారించడం జరిగింది. అంత కంటే దిగువకు నీటి మట్టం పడిపోతే కేవలం తాగు నీటి అవసరాలకే నీటిని విడుదల చేయాలి. కానీ, ఆ నిబంధన తరచూ ఉల్లంఘనలకు గురవుతున్నది. 834 అడుగుల నీటి మట్టం లేకపోతే హంద్రీ - నీవా సుజల ప్రవంతికి మల్యాల దగ్గర నిర్మించిన ఎత్తిపోతల నుంచి నీటి సరఫరా సాధ్యం కాదు. అందుకే కె.సి.కెనాల్, హంద్రీ - నీవాకు నీటిని తరలించడానికి ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని 2008లోనే నిర్మించ తలపెట్టారు. ఈ పథకం ద్వారా 810 అడుగుల నీటి మట్టం దగ్గర నుంచే నీటిని తీసుకెళ్లవచ్చు. అప్రోచ్ కెనాల్ నిర్మాణం కూడా పూర్తైతే 798 అడుగుల నీటి మట్టం నుంచి కూడా నీటిని తీసుకెళ్ళవచ్చని చెబుతున్నారు. అందులో ఉన్న ప్రమాదాన్ని కూడా గుర్తెరిగి మాట్లాడితే బాగుంటుంది. ఆ నీటి మట్టం దగ్గర అసలు నీటి లభ్యత ఎంత? శ్రీశైలం జలాశయంలో ఒండ్రుమట్టి చేరిపోతూ నీటి నిల్వ సామర్థ్యం కూడా తరిగిపోతున్న నేపథ్యంలో ఇది సాధ్యమేనా! రాయలసీమకు నీళ్ళిచ్చి మాకు ఇవ్వలేదన్న అపోహ నాగార్జునసాగర్ కుడి కాలువ ఆయకట్టుదారులలో, వచ్చిన నీళ్లన్నింటినీ రాయలసీమకు మళ్ళించుకు పోతున్నారన్న దుష్ప్రచారం నిరంతరం విద్వేషాలు రెచ్చగొట్టే దుష్టశక్తులకు అవకాశం కల్పించడానికి ఉపయోగపడుతుంది. అంతే కానీ, ఆచరణలో రాయలసీమకు నేడున్న పరిస్థితుల్లో పై నుంచి శ్రీశైలం జలాశయంలోకి ప్రవాహం పెరిగితే తప్ప సాధ్యం కాదని అందరికీ విదితమే. శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వ పెరిగితే ముచ్చుమర్రి నుంచి నీటిని తరలించడానికి వీలవుతుంది. మిగిలి ఉన్న నిర్మాణ పనులను కూడా సత్వరం పూర్తిచేసి, వినియోగంలోకి వస్తే ప్రజలు హర్షిస్తారు. సుంకేసుల ఆనకట్టపైభాగాన తుంగభద్ర నదిపైన 15-20 టిఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల రిజర్వాయరు నిర్మిస్తే ప్రయోజనం ఉంటుంది. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షుడు

ఉక్రెయిన్‌పై విరుచుకుపడిన రష్యా

అణ్వస్త్ర విభాగాధిపతి హత్యకు ప్రతీకారం

మాస్కో: రష్యా అణ్వస్త్ర విభాగాధిపతి లెఫ్టినెంట్ జనరల్ ఇగోర్ కిరిల్లోవ్‌ను ఉక్రెయిన్ బాంబుదాడితో హతమార్చడంపై రష్యా తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. దీనికి ప్రతీకారంగా కీవ్‌పై రష్యా విరుచుకుపడింది. చాలా ప్రాంతాల్లోని ఉక్రెయిన్ దళాలను పడగొట్టి ఆ ప్రాంతాలను తమ అధీనంలోకి తీసుకుంటున్నట్లు ఉక్రెయిన్ కమాండర్ ఒలెక్సాండర్ సిర్స్కీ ప్రాంతీయ, ప్రభుత్వ అధికారులకు తెలిపారు. 'కుర్స్క్ ప్రాంతంలో మాస్కో తీవ్రమైన దాడులు చేస్తోంది. ఈ పోరాటంలో ఉత్తరకొరియా దళాలు ప్రాణాలు కోల్పోతున్నప్పటికీ రష్యా వారినే ఎక్కువగా వినియోగిస్తుంది. మరోవైపు రష్యా బలగాలు అత్యంత వేగంగా తూర్పు దొనెట్స్క్ ప్రాంతంలో దాడులు చేస్తున్నాయి' అని సిర్స్కీ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధంలో పాల్గొని ఉ.కొరియా సైనికులు వందల సంఖ్యలో చనిపోతున్నారని, గాయపడుతున్నారని అమెరికా సైనిక అధికారులు గతంలోనే వెల్లడించారు. మరోవైపు రష్యా జరిపిన 42 దాడులను తమ బలగాలు తిప్పికొట్టినట్లు కీవ్ సైన్యం ప్రకటించింది. రష్యాలోని కుర్స్క్ ప్రాంతంలోకి ఉక్రెయిన్ బలగాలు ఆగస్టులో చొరబడ్డాయి. అయితే, దాని నియంత్రణలోని 40 శాతం భూభాగం ఇప్పటికే కోల్పోయింది. ఇదిలాఉండగా ఉక్రెయిన్ ఉక్కు పరిశ్రమ కోసం కోకింగ్ బొగ్గును ఉత్పత్తి చేసే కొలీరీ ప్రదేశమైన పోక్రోవ్స్క్‌తో పాటు హన్నివ్కా అనే గ్రామాన్ని సైతం తమ బలగాలు స్వాధీనం చేసుకున్నాయని రష్యా రక్షణ మంత్రిత్వశాఖ పేర్కొంది. కీవ్ ఇండిపెండెంట్ పత్రిక లెఫ్టినెంట్ జనరల్ ఇగోర్ కిరిల్లోవ్‌పై ఓ సంచలన కథనం ప్రచురించింది. నిషేధిత రసాయన ఆయుధాలను కీవ్‌పై ప్రయోగించేందుకు ఆయనే అనుమతి ఇచ్చినట్లు ఆరోపించింది. ఆరోపించిన 24 గంటల్లో ఆయనపై బాంబు దాడి జరిగింది. మాస్కోలో కిరిల్లోవ్ నివసించే అపార్టుమెంట్ బ్లాక్ సమీపంలో నిలిపిన ఎలక్ట్రిక్ స్కూటర్‌లో పేలుడు పదార్థాలు అమర్చినట్లు అనుమానిస్తున్నారు. ఆ పేలుడులో ఇగోర్‌తో పాటు ఆయన సహాయకుడు కూడా ప్రాణాలు కోల్పోయారు. కిరిల్లోవ్‌ను తామే హతమార్చినట్లు ఉక్రెయిన్ ప్రకటించింది.

కొరియా సైనికుల ముఖాలు కాల్చేస్తోన్న రష్యా: జెలెన్ స్కీ

కీవ్: రష్యా తరపున తమపై యుద్ధం చేస్తూ చనిపోయిన ఉత్తర కొరియా సైనికుల ముఖాలు గుర్తుపట్టకుండా కాల్చేస్తున్నారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్ర ఆరోపణలు చేశారు. కుర్స్క్ రీజియన్‌లో పాతిపెట్టడానికి ముందు పుతిన్ సేనలు ఈ దుశ్చర్యకు పాల్పడుతున్నాయని తెలిపారు. ఈమేరకు ఎక్స్ వేదికగా వీడియో పోస్టు చేశారు. ఆ దృశ్యాల్లో యుద్ధంలో చనిపోయిన కొరియా సైనికులను కాల్చినట్లు కనిపించింది. 'సంవత్సరాల పాటు జరుగుతోన్న యుద్ధంలో రష్యాకు విరక్తి రాకపోగా... ఇలాంటి దారుణాలు చూస్తున్నాం. ఉక్రెయిన్‌పైకి ఉత్తర కొరియా సైనికులను పంపించడమే కాకుండా, వారి మరణాలను కూడా దాచడానికి రష్యా ప్రయత్నిస్తోంది. ఎలాంటి కారణం లేకుండా ఉ.కొరియా సైనికులు పుతిన్ తరపున పోరాడుతున్నారు. కానీ వారికి రష్యా అవమానాన్నే మిగులుస్తోంది. ఇలాంటి పిచ్చితనాన్ని ఆపాలి. రష్యాను జవాబుదారీ చేయడం, శాంతి ప్రక్రియ ద్వారానే ఇది ఆగుతుంది' అని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. 2022 ప్రారంభం నుంచి రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నడుస్తోంది. ముగింపుఛాయలు ఎక్కడా కనిపించడం లేదు. ఈ తరుణంలో బాంబు పేలుడులో రష్యా అణ్వస్త్ర విభాగాధిపతి లెఫ్టినెంట్ జనరల్ ఇగోర్ కిరిల్లోవ్ మృతి చెందారు.

ఉల్ఫా ఉగ్రవాదులకు బంగ్లా ఊరట

ఢాకా: షేక్ హసీనా ప్రధానమంత్రిగా దిగి పోయిన దగ్గరి నుంచి భారత్-బంగ్లాదేశ్ సంబం ధాలు క్షీణిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ వ్యతిరేక నిర్ణయం ఒకటి వెలువడింది. ఉగ్రవాద సంస్థ ఉల్ఫాకు ఆయుధాల అక్రమ రవాణా కేసు లో దోషులకు బంగ్లాదేశ్‌లోని హైకోర్టు ఊరటని చ్చింది. ఆయుధాలు అక్రమరవాణాకు యత్నించి న కేసులో ఉల్ఫా నేత పరేశ్ బారువాకు గతంలో విధించిన మరణశిక్షను జీవితఖైదుగా మార్చింది. ఈ కేసులో మాజీ సహాయ మంత్రి, మరో ఐదు గురిని నిర్దోషులుగా ప్రకటించింది. అసోంలో సాయుధ వేర్పాటువాద సంస్థగా పేరొందిన ఉల్ఫాకు 2004లో మొత్తం 10 ట్రక్కుల నిండా ఆయుధాలను అక్రమంగా తరలిస్తుండగా బంగ్లా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బారువా గైర్హాజరీలో జరిగిన విచారణలో అతడికి ఉరిశిక్ష పడింది. పరారీలో ఉన్న అతడు... చైనా-మైన్మార్ సరిహద్దు ప్రాంతం నుంచి తన కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. కొన్నినెలల క్రితం బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో వందల మంది ప్రాణాలు కోల్పోయారు. దాంతో హసీనా తన పదవికి రాజీనామా చేయాల్సివచ్చింది. ఆందోళనలు తీవ్రంగా ఉండటంతో ఆమె దేశం విడిచి, భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందుతున్నారు. ఆమె రాజీనామాతో బంగ్లాలో అవామీలీగ్ ప్రభుత్వం పడిపోయింది. ప్రస్తుతం మహమ్మద్ యూనస్ సారథ్యంలో తాత్కాలిక ప్రభుత్వం కొనసాగుతోంది. ప్రస్తుతం అక్కడ హిందువులు, మైనార్టీలపై దాడులు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఓ ర్యాలీలో ఇస్కాన్ ప్రచారకర్త చిన్మయ్ కృష్ణదాస్ బంగ్లాదేశ్ జెండాను అగౌరవపరిచారనే ఆరోపణలతో పోలీసులు అరెస్టు చేయడం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. బంగ్లా వ్యతిరేక ప్రచారం జరుగుతుందంటూ భారత్‌కు చెందిన టీవీ ఛానళ్లను నిషేధించాలంటూ అక్కడి హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. చిరకాల మిత్రదేశాల మధ్య ఈ వరుస పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

భూహక్కుల పరిరక్షణకే 'భూ భారతి'

(మూడోపేజీ తరువాయి)

ప్రత్యేక చర్చావేదికలు నిర్వహించి అందరి అభిప్రాయాలు తీసుకున్నామని చెప్పారు. 18 రాష్ట్రాలలో ఆర్వోఆర్‌లను అధ్యయనం చేసి, ఉత్తమ విధానాలను భూభారతిలో పొందుపరిచామని మంత్రి పేర్కొన్నారు.

గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి కారణంగా ఎంతో మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కేసముద్రం మండలం నారాయణపురంలో కె.రవి అనే ఎంపీటీసీ సభ్యుడు భూ సమస్యలను బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలందరి దృష్టికి తీసుకువెళ్లారని, పరిష్కారం కాలేదని చెప్పారు. సర్వేనెంబర్లు 149,150, 154,156, 168ల్లోని 1,398 ఎకరాల భూమి తరతరాలుగా అక్కడి గిరిజనుల సాగుబడిలో ఉన్నాయని తెలిపారు. ఆర్వోఆర్ చట్టం వచ్చాక వారి హక్కులకు భంగం వాటిల్లేలా సదరు భూములు అటవీ భూములని తేల్చిచెప్పారని, దీంతో గిరిజనులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని మంత్రి వివరించారు. నాలుగు నెలల పాటు రిజిస్ట్రేషన్‌లు ఆపివేశారని, భూములు అమ్ముకొని పెళ్లిళ్లు, చదువుల కోసం ఖర్చుచేద్దామను కొనే సామాన్య రైతులకు తీవ్ర అసౌకర్యం కలిగిందని చెప్పారు. భూభారతి బిల్లుకు 23 సార్లు అభిప్రాయాలు తీసుకున్నామని, అందువల్లే బిల్లు ప్రవేశపెట్టడంలో జాప్యం జరిగిందని మంత్రి పొంగులేటి చెప్పారు. భూమి చుట్టూ మనిషి జీవితం ముడిపడి ఉంటుందని, తరతరాలుగా విడదీయరాని అనుబంధం ఉందన్నారు. గ్రామాల్లో భూమే ప్రధాన జీవనాధారంగా అభివర్ణించారు. గత ప్రభుత్వం వీటిని విస్మరించిందని మండిపడ్డారు. ధరణి పోర్టల్‌తో మూడేళ్లలోనే లక్షలాది కొత్త సమస్యలు తలెత్తాయన్నారు. రెవెన్యూ అధికారుల స్థాయిలో పరిష్కారం కావాల్సినవి కోర్టుల దాకా వెళ్లాల్సి వచ్చిందని, మానవ సంబంధాలను సైతం దెబ్బతీసిందన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు ధరణి కష్టాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి భూ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. తెలంగాణ భూభారతి డ్రాఫ్టు బిల్లును అసెంబ్లీలో ఆగస్టు 2న ప్రవేశపెట్టామన్నారు. ప్రజల నుంచి చట్టం రావాలనే ఉద్దేశంతో అదే రోజున సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో కూడా ముసాయిదా బిల్లును అందుబాటులో ఉంచామని చెప్పారు. ప్రజాస్వామ్యబద్ధంగా సభలో భూ-భారతి బిల్లును ప్రవేశపెడుతున్నామన్నారు.

ప్రధానాంశాలు: గత చట్టం (2020)లో తప్పులను అధ్యయనం చేసి భూ-భారతి ద్వారా సరిదిద్దడం.పార్టు-బీ లో ఉన్న 18 లక్షల ఎకరాలకు పరిష్కారం. గ్రామీణ ప్రాంతాల్లోని ఆబాదీ/గ్రామకంఠం సమస్యలకు పరిష్కారం. భవిష్యత్తులో భూ వివాదాలకు తావు లేకుండా ఎంజాయ్‌మెంట్ సర్వే ద్వారా శాశ్వత పరిష్కారం. రిజిస్ట్రేషన్ దస్తావేజుల ద్వారా వచ్చే మ్యుటేషన్‌లో ఏవైనా తప్పులు జరిగితే అప్పీల్ చేసుకునే వ్యవస్థని ఏర్పాటు చేస్తున్నాం. భూ వివాదాల గ్రీవెన్స్, అప్పీళ్ల కోసం లాండ్ ట్రిబ్యునల్స్ ఏర్పాటు. అవసరాన్ని, ప్రాంతాన్ని బట్టి సంఖ్యపై ప్రభుత్వ నిర్ణయం. ప్రభుత్వ ఆస్తుల్ని, రికార్డుల్ని ఉద్దేశపూర్వకంగా ఎవరైనా తారుమారు చేస్తే సీసీఎల్ఏ ద్వారా రివిజన్ చేసుకునే అవకాశం. ఉద్దేశపూర్వకంగా తారుమారు చేసే అధికారులపై చర్యలు. రెవెన్యూ రికార్డులు టాంపరింగ్ జరగకుండా కంప్యూటర్ రికార్డులతో పాటు నిర్ణీత కాల వ్యవధిలో మాన్యువల్ కాపీని కూడా రెవెన్యూ కార్యాలయాలలో భద్రపరుస్తాం.

ప్రత్యేకతలు: 33 మాడ్యూళ్లు ... ఆరు మాడ్యూళ్లకు కుదింపు. పహాణీలో 32 కాలమ్‌లు ... 11 కాలమ్‌లు చేస్తున్నాం. ఎవరైనా ఎక్కడి నుంచైనా చూసుకునేలా డిస్‌ప్లే చేస్తున్నాం. ఆసాములకు వారి మొబైల్ నెంబర్లకే అప్‌డేట్స్ సౌకర్యాన్ని కల్పిస్తున్నాం. అన్యాక్రాంతమైన భూముల వివరాలను బహిర్గతం చేస్తాం. ప్రభుత్వ భూముల్ని ఆక్రమిస్తే స్వాధీనం చేసుకుని పేదలకు పంచుతాం. భూ-భారతి చట్టం కనీసం వందేళ్లు వర్ధిల్లుతుందని నమ్ముతున్నాం.

ఆర్యవైశ్యుల సంక్షేమమే ధ్యేయం

(మూడోపేజీ తరువాయి)

ప్రభుత్వానికి కేంద్రం కేటాయించిన నిధుల వివరాలపై ప్రశ్నించగా భట్టి సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వం పదేళ్లలో సాధించిన దాని కంటే తమ ప్రభుత్వం కేంద్రం నుంచి అధికంగా నిధులు తీసుకొచ్చిందని వివరించారు. కేంద్రం... రాష్ట్రానికి నేరుగా నిధులు కేటాయించదు, నిర్దేశించుకున్న ప్రత్యేక పథకాల ద్వారా నిధులు కేటాయిస్తుందని చెప్పారు. తమ ప్రభుత్వం ప్రతి విషయంలోనూ పారదర్శకంగా ఉంటుంది, తాము ఏ వివరాలను దాచుకునే వాళ్లం కాదని అన్నారు. కేంద్రం జీఎస్టీ బిల్లును తీసుకురాగా గత ప్రభుత్వం మద్దతునిచ్చిందని... ఆ తర్వాత వారు బీజేపీతో వైరం పెట్టుకున్నారని స్పష్టం చేశారు.

ఆటో డ్రైవర్లకు రూ.12 వేలు ఇవ్వండి

విశాలాంధ్ర-హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ... ఎన్నికల సందర్భంగా ఎనిమిది లక్షల మంది ఆటో డ్రైవర్లకు ఎన్నో హామీలు ఇచ్చిందని, ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి ఆటో డ్రైవర్ల యూనిఫామ్‌లో నిరసన తెలుపుతూ అసెంబ్లీకి చేరుకున్నారు. కేటీఆర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటివరకు 93 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లోనే వారి జాబితా అందజేశామన్నారు. ఏడాదికి రూ.12 వేలు ఇస్తామన్న హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఆటోడ్రైవర్ల కు సంఘీభావంగా తాము ఆటోల్లో అసెంబ్లీ కి వెళుతున్నామని వారి యూనిఫామ్‌లు ధరించి వచ్చామన్నారు.

కొత్త నాటకానికి చిట్టినాయుడు శ్రీకారం: కేటీఆర్

అదానీకి అన్ని రకాలుగా తోడు నీడగా ఉంటూ ఆయన కోసం కష్టపడుతున్న రేవంత్ నేడు అదానీకి వ్యతిరేక ర్యాలీ చేయాలనుకుంటున్నాడని దుయ్యబట్టారు. జైపూర్‌లో సరిగ్గా అతిథి మర్యాదలు జరగలేదనో లేదా ఢిల్లీలో అపాయింట్‌మెంట్ దక్కలేదనో దీన్ని చేపట్టారన్నారు. కొత్త నాటకానికి శ్రీకారం చుట్టిన మన చిట్టినాయుడు భాయ్,

భాయ్ అని వందల, వేల కోట్లు పంచుకున్నారని ఆరోపించారు. ప్రజలు అంత తెలివి తక్కువ వాళ్లనుకుంటున్నావా అంటూ ప్రశ్నించారు. వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు బయలుదేరినట్టుందని ఎద్దేవా చేశారు.

ఫార్ములా-ఈ రేస్‌పై శాసనసభలో చర్చ పెట్టండి

ఫార్ములా-ఈ రేస్‌పై ప్రభుత్వం కొన్ని నెలలుగా నిరాధార ఆరోపణలు చేస్తుందని, ఈ విషయంపై క్యాబినెట్ సమావేశంలో గంటన్నర సేపు చర్చ కూడా జరిగినట్టు వార్తా కథనాలు వచ్చాయని, ఇదే అంశంపై కేసులు నమోదు చేస్తామని, గవర్నర్ ఆమోదం వచ్చిందని రకరకాల లీకులు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మీడియాకు ఇస్తున్నారని అంటే కేటీఆర్... సీఎం రేవంత్ రెడ్డికి రాసిన బహిరంగ లేఖలో పేర్కొన్నారు. నాలుగు గోడల మధ్య చర్చ కన్నా శాసన సభలో నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరిగితే నిజానిజాలు ఏమిటో అందరికీ తెలుస్తాయన్నారు. రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి జరగాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం ఫార్ములా-ఈ రేస్ నిర్వాహకులతో ఒక ఒప్పందం చేసుకుందని వివరించారు. 2023లో విజయవంతమైందని గుర్తు చేశారు. ఆర్థిక వ్యవస్థకు రూ.700 కోట్లు లబ్ధి చేకూరిందనే విషయాన్ని నీల్సన్ సంస్థ నివేదిక స్పష్టం చేసిందన్నారు. ఫార్ములా-ఈ రేస్ ఒప్పందం అంతా పారదర్శకంగా జరిగిందని, నిర్వాహకులకు చెల్లింపులు కూడా పారదర్శకంగానే జరిగాయని ఇదివరకే నేను వివరంగా చెప్పామన్నారు. ప్రజలకు నిజాలేమిటో తెలుసుకునే హక్కు ఉందని, శాసనసభలో ఈ అంశంపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు.

అదానీ, మోదీతో దేశ ప్రతిష్టకు భంగం

(మొదటిపేజీ తరువాయి)

ఆ దేశ విచారణ సంస్థలు నివేదిక ఇచ్చాయని పేర్కొన్నారు. దేశ పరువు ప్రతిష్టను మంటకలిపిన అదానీపై విచారణ చేపట్టాలని రాహుల్ గాంధీ పార్లమెంట్ లో డిమాండ్ చేశారన్నారు. లోక్ సభలో రాహుల్ నిలదీసినా ప్రధాని నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని దుయ్యబట్టారు. ఈ అంశంపై మాట్లాడేందుకు ప్రధాని ఎందుకు ముందుకు రావడం లేదో చెప్పాలన్నారు. అందుకే దేశ వ్యాప్తంగా రాజ్ భవన్ ముట్టడికి కాంగ్రెస్ పిలుపునిచ్చిందన్నారు. టీపీసీసీ అధ్వర్యంలో రాజ్ భవన్ ముట్టడి చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వమే ధర్నాకు కూర్చోవడం కొందరికి నచ్చకపోవచ్చు, కొందరికి కడుపులో నొప్పి ఉండొచ్చు కానీ అదానీపై కేసీఆర్, బీఆర్ఎస్ వైఖరి ఏమిటో చెప్పాలన్నారు. వారి వైఖరి చెప్పకుండా కాంగ్రెస్‌ను అవహేళన చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీజేపీతో బీఆర్ఎస్ చీకటి ఒప్పందంలో భాగంగానే అదానీపై వారు స్పందించడం లేదని మండిపడ్డారు. అరెస్టుల నుంచి తప్పించుకునేం దుకు బీఆర్ఎస్... బీజేపీకి లొంగిపోయిందని, అందుకే అదానీపై మాట్లాడటంలేదన్నారు. పార్లమెంట్ లో బీఆర్ఎస్ విధానం ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. 'మీరు ప్రజల వైపా... అదానీ వైపా' చెప్పాలన్నారు. అదానీపై మాట్లాడితే వీళ్లను జైల్లో పెడతారనే భయంతోనే మాట్లాడటం లేదని, మమ్మల్ని విమర్శించడం కాదు, అదానీపై, జేపీసీ (జాయింట్ పార్లమెంటరీ కమిటీ)పై మీ వైఖరేంటో చెప్పండి... మీ ఎంపీలతో లేఖ రాయించండన్నారు. మోదీ, కేసీఆర్ వేర్వేరు కాదు... నాణానికి బొమ్మ, బొరుసులాంటి వారని ఆరోపించారు. బీఆర్ఎస్ ... జేపీసీపై డిమాండ్ చేస్తే శాసన సభలో తీర్మానం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. దేశాన్ని దోచుకున్న అదానీపై జేపీసీ వేయడానికి ప్రధాని ఎందుకు సిద్ధంగా లేరు... అదానితో లాలూచీ ఏంటని నిలదీశారు. జేపీసీ వేయకపోతే అవసరమైతే రాష్ట్రపతి భవన్ వద్ద కూడా ధర్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తన స్నేహితుడిని కాపాడేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని, కానీ అదానీని కాపాడలేరన్నారు. రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పాల్గొన్నారు.

దేశ ప్రజల కోసమే నిరసనదీక్ష: భట్టి

దేశ సంపద, ఆర్థిక సంస్థలను మోసగిస్తున్న అదానీపై జేపీసీ వేసి చట్టపరమైన విచారణ చేపట్టాలని రాహుల్ గాంధీ పార్లమెంటులో కోరినా పట్టించుకోకపోవడంతో దేశ ప్రజల కోసం నిరసన దీక్ష చేపట్టినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. దేశ, రాష్ట్ర సంపద, వనరులను బీజేపీ నాయకత్వానికి దగ్గరగా ఉండే కొద్ది మంది క్రోనీ కాపిటల్స్‌కు దోచి పెట్టేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. మోదీ సహకారంతో అదానీ చేస్తున్న దోపిడీ తీరును వివరించేందుకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమం చేపట్టిందని పేర్కొన్నారు. అదానీ... దేశాన్ని ఏ విధంగా దోపిడీ చేస్తున్నారు, ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంస్థలను ఏ విధంగా మోసగిస్తున్నారు, ప్రపంచ సంస్థలు, హిడెన్‌బర్గ్ వంటి సంస్థలు బహిర్గతం చేశాయని వివరించారు. గవర్నర్‌కు వినతి పత్రం సమర్పించామని, నిరసనలకు ప్రజలు మద్దతివ్వాలని డిప్యూటీ సీఎం కోరారు.

ఉమర్ ఖలీద్‌కు తాత్కాలిక బెయిల్

(మూడోపేజీ తరువాయి))

వినియోగించరాదని, కేసుకు సంబంధించి ఎవరినీ సంప్రదించరాదని షరతులు విధించారు. చివరిసారిగా 2022లో ఖలీద్ వారంరోజుల మధ్యంతబెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చారు. 2020 ఢిల్లీ అల్లర్ల కేసులో ఖలీద్ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. డిసెంబర్ 28 నుండి జనవరి 3 వరకు ఆయనకు కోర్టు మధ్యంతర బెయిల్ ఆమోదించింది. 2020 ఫిబ్రవరిలో ఢిల్లీలో చెలరేగిన మతపరమైన అల్లర్ల వెనుక పెద్ద కుట్ర ఉందని ఆరోపిస్తూ ఉపా చట్టం కింద ఉమర్ ఖలీద్‌ను ఢిల్లీ స్పెషల్ సెల్ అదే ఏడాది సెప్టెంబర్‌లో అరెస్ట్ చేసింది. ఖలీద్‌తో పాటు సామాజిక కార్యకర్త షర్జీల్ ఇమామ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం వారి రెగ్యులర్ బెయిల్ పిటిషన్లను ఢిల్లీ కోర్టు విచారిస్తోంది. ఖలీద్ బెయిల్ ఇచ్చేందుకు ట్రయల్ కోర్టు తిరస్కరించడంతో ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు.

'జమిలి'పై జేపీసీ

(మూడోపేజీ తరువాయి)

రణ్‌దీప్ సూర్జేవాలా, సుఖ్‌దేవ్ భగత్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఈ కమిటీలో సభ్యులుగా కల్యాణ్ బెనర్జీ, సాకేత్ గోఖలే పేర్లను తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు అనువుగా 128వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. 90 నిమిషాల చర్చ అనంతరం ఓటింగ్ జరగ్గా బిల్లుకు అనుకూలంగా 269 మంది... వ్యతిరేకంగా 198 మంది ఓటేశారు. దీంతో బిల్లును ప్రవేశపెట్టడానికి స్పీకర్ ఓం బిర్లా ఆమోదముద్ర వేశారు. అయితే ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమంటూ ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇది భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉన్నందున జేపీసీకి పంపాలని డిమాండ్ చేశాయి. దీంతో ఈ బిల్లును జేపీసీకి పంపారు.

రైలు పట్టాలపై రైతుల నిరసన

చండీగఢ్: పంటల కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత కల్పించడం సహా వివిధ డిమాండ్లను ఆమోదించాలంటూ బుధవారం పంజాబ్ రైతులు మూడు గంటలపాటు రైల్‌రోకో చేపట్టి రాకపోకలను అడ్డుకున్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు రైతులు తమ మూడు గంటల 'రైల్ రోకో' నిరసనలో భాగంగా అనేక చోట్ల రైలు పట్టాలపై బైఠాయించి నిరసన తెలిపారు. రైల్ రోకోకు సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా పిలుపునిచ్చాయి.

కిసాన్ మజ్దూర్ మోర్చా నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్ మాట్లాడుతూ మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు రైతులు చాలా చోట్ల రైలు పట్టాలపై బైఠాయించినట్లు తెలిపారు. గురుదాస్‌పూర్‌లోని మోగా, ఫరీద్‌కోట్, కడియన్ , బటాలాతో సహా వివిధ ప్రదేశాలలో రైతులు రైల్‌రోకో నిరసన చేపట్టారు. జలంధర్ లో ఫిలింనగర్, హోషియార్‌పూర్‌లోని తాండా, దాసుయా, మహిల్‌పూర్, ఫిరోజ్‌పూర్‌లోని మఖూ, తల్వాండీ భాయ్, లుథియానాలో సాహ్నేవాల్, పాటియాలాలో శంభుబీ మొహాలిబీ సంగ్రూర్‌లో సునమ్, లెహ్రా, భటిండాలోని రాంపుర, అమృత్‌సర్‌లోని దేవిదాస్‌పురాలో రైతులు ఆందోళన చేశారు. దీంతో జమ్మూ నుంచి సీల్దా వెళ్లే హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, అమృత్‌సర్ నుంచి ముంబై వెళ్లే దాదర్ ఎక్స్‌ప్రెస్, న్యూఢిల్లీ నుంచి అమృత్‌సర్ వెళ్లే షాన్-ఏ-పంజాబ్ ఎక్స్‌ప్రెస్ లుధియానా రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫాంలలో నిలిచిపోయాయి. న్యూఢిల్లీ నుంచి అమృత్‌సర్‌కు వస్తున్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్ ఖన్నా రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయింది. రైల్‌రోకోలో పాల్గొన్న ఓ రైతు మాట్లాడుతూ... ప్రభుత్వం ఎంఎస్‌పీకి చట్టబద్ధ హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతులు చేపట్టిన 'ఢిల్లీ చలో' మార్చ్‌ను భద్రతాబలగాలు అడ్డుకున్న తర్వాత సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చాకు చెందిన రైతులు ఫిబ్రవరి 13 నుండి పంజాబ్ -హర్యానా మధ్య శంభు, ఖనౌరీ సరిహద్దు పాయింట్ల వద్ద శిబిరాల్లో నిరసన కొనసాగిస్తున్నారు. గత మూడు వారాలుగా, పంజాబ్ రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఖనౌరీ సరిహద్దు పాయింట్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. పంటలకు ఎంఎస్‌పీ లభించేలా చట్టపరమైన హామీతో సహా ఆందోళన చేస్తున్న రైతుల డిమాండ్‌లను ఆమోదించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. 101 మంది రైతులతో కూడిన 'జాతా' (సమూహం) డిసెంబరు 6, డిసెంబర్ 8, 14న కాలినడకన ఢిల్లీలోకి ప్రవేశించడానికి చేసిన ప్రయత్నాలను హర్యానా పోలీసులు, కేంద్ర బలగాలు అడ్డుకున్న సంగతి విదితమే.

పంటలకు ఎంఎస్‌పీపై చట్టపరమైన హామీతో పాటు, రుణమాఫీ, రైతులు, రైతు కూలీలకు పెన్షన్, పోలీసు కేసుల ఉపసంహరణ, 2021 లఖింపూర్ ఖేరీ హింసాకాండ బాధితులకు న్యాయం చేయడం, 2013 భూసేకరణ చట్టం పునరుద్ధరణ తదితర డిమాండ్లను తక్షణం ఆమోదించాలని రైతు సంఘాల నాయకులు కేంద్రంలోని మోదీ సర్కారును డిమాండ్ చేస్తున్నారు.

పెనుగొండను వరించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

(మూడోపేజీ తరువాయి)

చేయగా...పెనుగొండ లక్ష్మీనారాయణ రచించిన 'దీపిక' అభ్యుదయ సాహిత్య వ్యాస సంపుటి అవార్డుకు ఎంపికైంది.

శుభాకాంక్షల వెల్లువ

పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించడం పట్ల ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) హర్షం ప్రకటించింది. పెనుగొండకు తమ తరపున, అరసం తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు అరసం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, వల్లూరు శివప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అరసం జాతీయ నాయకుడు వేల్పుల నారాయణ, తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్‌ఛాన్సలర్ ఎస్వీ సత్యనారాయణ, అరసం తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఆర్వీ రామారావ్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పల్లేరు వీరాస్వామి, డాక్టర్ రాపోలు సుదర్శన్, అరసం ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ వేర్వేరు ప్రకటనల్లో అభినందనలు తెలిపారు.

దిల్ రాజ్ బాధ్యతలు

(మూడోపేజీ తరువాయి)

తెలిపారు. చిత్ర పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీ కి చెందిన షూటింగ్స్ తెలంగాణా లో మరింత ఎక్కువగా జరిగే విధంగా ప్రయత్నిస్తానని అన్నారు. ఎగ్జిబిటర్ల సమస్యల పరిష్కారంతో పాటు, సినీ నిర్మాతలకు షూటింగ్ ల అనుమతులను సింగల్ విండో ద్వారా లభించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

సినీ పరిశ్రమకు అండగా ఉంటా: మంత్రి కోమటిరెడ్డి

దిల్ రాజు పదవీ బాధ్యతల స్వీకారానికి హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... సినీ పరిశ్రమకు అండగా ఉంటానని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ సినీ ఇండస్ట్రీని తీర్చిదిద్దుతానన్నారు.

అంబేద్కర్‌ను అవమానిస్తే దేశం సహించదు

(మూడోపేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఆ తర్వాత దీనిని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'అంబేద్కర్ జీ పేరు తీసుకొని హక్కులు పొందుతారు. అంబేద్కర్ జీ పేరు తీసుకోవడం మానవ గౌరవానికి ప్రతీక. అంబేద్కర్ జీ పేరు కోట్లాది మంది దళితులు, అణగారిన ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక' అని ప్రియాంక వ్యాఖ్యానించారు.

భారత రాజ్యాంగాన్ని అవమానపర్చారు: ఖర్గే

అమిత్ షా అంబేద్కర్, భారత రాజ్యాంగాన్ని అవమానించారని మల్లికార్జున ఖర్గే విమర్శించారు. బాబా సాహెబ్ అంబేద్కర్‌ను, ఆయన రచించిన రాజ్యాంగాన్ని గౌరవించకూడదని మనుస్మృతి, ఆర్ఎస్ఎస్ భావజాలం అమిత్‌షాకు నేర్పుతోందన్నారు. అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, వెంటనే ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు. 'అంబేద్కర్ గురించి హోం మంత్రి మాట్లాడుతున్నప్పుడు మేమంతా ఆపేందుకు ప్రయత్నించాం. అంబేద్కర్ పేరును 100 సార్లు జపించే బదులు భగవంతుడి నామాన్ని ఇన్నిసార్లు స్మరించి ఉంటే ఏడుసార్లు స్వర్గానికి వెళ్లి ఉండేవారమని అమిత్ షా అన్నారు. ఆ సమయంలో నేను మాట్లాడేందుకు చేయి ఎత్తాను. కానీ మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. రాజ్యాంగంపై చర్చ జరుగుతున్నందున అందరం సహకరించాలని నిర్ణయించుకుని మౌనంగా కూర్చున్నాం. అంబేద్కర్‌ను దూషిస్తే దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగుతాయి. అంబేద్కర్‌ను అవమానిస్తే విపక్షాలు ఊరుకోవు' అని ఖర్గే పేర్కొన్నారు.

అమిత్‌షాకు మోదీ సమర్థన

(మూడోపేజీ తరువాయి)

అధికారంలో ఉన్నప్పటికీ ఎస్సీ, ఎస్టీల సాధికారత కోసం ఏమీ చేయలేదని ఆరోపించారు. ప్రధాని మోదీ బుధవారం 'ఎక్స్' వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రజలకు నిజమేంటో తెలుసు. అంబేద్కర్‌ను లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ రెండుసార్లు ఓడిపోయేలా చేసింది. నెహ్రూ ఆయనకు వ్యతిరేకంగా ఎన్నికల్లో ప్రచారం చేశారు. బాబా సాహెబ్‌కు భారతరత్న ఇచ్చేందుకు కాంగ్రెస్ నిరాకరించింది. అంబేద్కర్ చిత్రపటాన్ని పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో పెట్టడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించింది' అని మోదీ పేర్కొన్నారు. అంబేద్కర్ వారసత్వాన్ని తుడిచిపెట్టడానికి, ఎస్సీ, ఎస్టీలను కించపరచడానికి రాజవంశం నేతృత్వంలోని ఒక పార్టీ డర్టీ ట్రిక్స్ ఎలా చేస్తుందో దేశ ప్రజలు పదేపదే చూస్తున్నారని మోదీ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు వ్యాప్తి చేసే అబద్ధాలు వారి పరిపాలనలోని అకృత్యాలను దాచగలవని భావిస్తున్నారని, అందుకే ప్రజలు వారిని తీవ్రంగా తప్పుపడుతున్నారని చెప్పుకొచ్చారు. దశాబ్ద కాలంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేసిందని తెలిపారు. 25 కోట్ల మందిని పేదరికం నుంచి విముక్తి చేయడంతోపాటు ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని బలోపేతం చేశామని, స్వచ్ఛ భారత్, పీఎం ఆవాస్ యోజన, జల్ జీవన్ మిషన్, ఉజ్వల యోజన వంటి కార్యక్రమాలను పదేళ్లలో చేపట్టామని మోదీ పేర్కొన్నారు.

అమిత్‌షాపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు

న్యూఢిల్లీ: దళితుల ఆరాధ్యదైవం డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగుతోంది. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వారసత్వాన్ని, పార్లమెంటు గౌరవాన్ని దిగజార్చారంటూ అమిత్‌షాపై తృణమూల్ కాంగ్రెస్ సభా హక్కుల నోటీసు ఇచ్చింది. 187వ నిబంధన కింద టీఎంసీ ఎంపీ డెరిక్ ఒబ్రెయిన్ రాజ్యసభలో ఈ నోటీసు ఇచ్చారు. భారత రాజ్యాంగం 75 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా రాజ్యసభలో మంగళవారం జరిగిన ప్రత్యేక చర్చలో అమిత్‌షా మాట్లాడుతూ అంబేద్కర్ పేరు పదేపదే ప్రస్తావించడం విపక్షనేతలకు సరదాగా మారిందని అన్నారు. ఇన్నిసార్లు భగవంతుడి పేరు వల్లెవేస్తే వాళ్లకు స్వర్గంలో చోటు దొరుకుందని వ్యాఖ్యానించారు. 'అంబేద్కర్ పేరు వందసార్లు వల్లెవేయండి. కానీ ఆయన విషయంలో మీ సెంటిమెంట్లు ఏమిటో నేను చెప్పదలచుకున్నాను. జవహర్‌లాల్ నెహ్రూ సారథ్యంలోని ప్రభుత్వంతో విభేదించడం వల్లే తొలి మంత్రివర్గం నుంచి అంబేద్కర్ రాజీనామా చేశారు' అని అన్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ఆటో కార్మికులపై బీఆర్ఎస్ మొసలి కన్నీరు

ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచాం

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ ఆటో కార్మికుల పైన మొసలి కన్నీరు కారుస్తుందని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం శాసనమండలిలో మంత్రి పొన్నం మాట్లాడుతూ ఆటో కార్మికులపై మీకు చిత్తశుద్ధి ఉంటే మీ ప్రభుత్వం ఉన్న 10 సంవత్సరాల్లో వారి సంక్షేమం కోసం తీసుకున్న చర్యలు ఏంటో చెప్పాలన్నారు. మెట్రో వస్తే ఇతర వాటిపై ప్రభావం పడిందని మహిళలకు ఉచిత ప్రయాణం ఇస్తే ఆటోలపై ప్రభావం పడిందని ఆరోపణ తప్పన్నారు. బస్సు ప్రయాణీకుల ఇంటికి వెళ్లడం లేదని, గతంలో లాగానే ఇపుడు కూడా బస్సు స్టాండ్ నుండి పోతుందని పేర్కొన్నారు. ప్రజలు ఇంటి దగ్గర నుండి బస్సు స్టాండ్‌కి వెళ్ళడానికి ఆటోలను వాడుతున్నారన్నారు. ఎన్నికలలో ఆటో కార్మికులకు 12 వేలు సంవత్సరానికి ఇస్తామని అన్నామని, కానీ మీ నిర్వాకం వల్ల ఆర్థిక సంక్షోభం వల్ల ఈ సంవత్సరం ఇవ్వలేకపోయామని విమర్శించారు. అయితే భవిష్యత్‌లో ఆటో కార్మికులను ఆదుకునే బాధ్యత మా ప్రభుత్వానికి ఉందని, ఆటో కార్మికులు వేసుకునే డ్రెస్‌లు వేసుకోవడం నిన్న బేడీలు వేసుకొని వేషాలు వేయడం రాజకీయ డ్రామా అంటూ వ్యాఖ్యానించారు. మీకు ఏమైనా చిత్తశుద్ధి ఉంటే ఏనాడయినా రవాణా శాఖ మంత్రికి ఆటో కార్మికుల సమస్యలపై రీప్రజెంటేషన్ చేసారా అని నిలదీశారు. రాజకీయాల కోసం నిరసనలు చెప్పడం కోసం ప్రజాస్వామికంగా ఆటో కార్మికులను తీసుకుని రండి ఆటో కార్మికుల సమస్యలపై చర్చిద్దామని సూచించారు.

ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంచాం...

తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరోగ్యశ్రీని 5-10 లక్షలకు పెంచుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అలాగే ఆరోగ్యశ్రీలో అనేక చికిత్సలు చేర్చామన్నారు. శాసన మండలిలో హోంశాఖపై ఎమ్మెల్సీలు యాదవ రెడ్డి, తీన్మార్ మల్లన్న, జీవన్ రెడ్డిలు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానాలు ఇచ్చారు. హోంశాఖలో ఇతర పోలీసులకు అమలు చేస్తున్న మాదిరి హోంగార్డులకు కూడా వర్తించేలా చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదాలపై హోంశాఖ వారి సాలరీల నుండి క్రెడిట్ చేసి ఆర్టీసీ మాదిరి ప్రమాదాలు జరిగినప్పుడు అందిస్తామన్నారు.

హోంశాఖలో ఎవరైనా ప్రమాదాల్లో మరణిస్తే కోటి రూపాయలకు పైగా భీమా వచ్చేలా చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఈ భీమా పథకం ఆర్టీసీలో అమలు చేస్తున్నామని, అక్కడ ఎవరైనా ప్రమాదంలో మరణిస్తే కోటి రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. పోలీసుల ఆరోగ్య పరమైన అంశం తెలంగాణ ప్రభుత్వం బాధ్యత ఉందన్నారు. అలాగే వారికి ప్రైవేట్ హాస్పటల్‌లో ఎవరైనా చికిత్స నిరాకరిస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. సిద్దిపేట పోలీసులు గజ్వేల్‌లో జరిగిన ప్రమాదంలో మరణించిన దానిపై కూడా ఇప్పటికే కేసు నమోదైందని, వారికి రావాల్సినవి అన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు.

ఆర్టిజన్ల ధర్నాకు కూనంనేని మద్దతు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్న ఆర్టిజన్ల ధర్నాకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు బుధవారం మద్దతు తెలియజేవారు. వారి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తానని, సమస్య పరిష్కారం అయ్యేంత వరకు వారితో పాటు కలిసి పోరాటంలో భాగస్వామ్యం అవుతానని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడు కార్మికుల పక్షమేనని కార్మికులకు, కర్షకులకు పేదవానికి కష్టం కలిగినప్పుడు ఎప్పుడు ఎర్రజెండా వారి తరుపున పోరాటాలు నిర్వహిస్తుందని తెలియజేస్తూ ఆర్టిజన్ల పోరాటం విజయవంతం కావాలని కోరారు.

పేదలకు ఇందిరమ్మ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో గత 20 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న పేదలకు. డబల్ బెడ్ రూమ్ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకి వినతిపత్రం, పేర్ల జాబితాను అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం డబల్ బెడ్‌రూమ్ ఇస్తానని నట్టేట ముంచారని, ఇప్పుడైనా ప్రజాపాలన సాగిస్తున్న మీరు తప్పకుండా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజి రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, రాష్ట్ర సమితి సభ్యులు రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.రామకృష్ణ. జిల్లా కౌన్సిల్ సభ్యులు కే చందు, మహిళా సమైక్య శేర్లింగంపల్లి కార్యదర్శి కే.లక్ష్మి, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు జట్టి శ్రీనివాస్, కే వెంకటస్వామి, కే శివకుమార్, వెంకటేష్, ఎస్ కొండలయ్య, బి.నారాయణ పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుండి తమ కాలనీలు తొలగించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : వక్ఫ్ బోర్డు సిఈఓ ఇటీవల వక్ఫ్ భూముల్లో రిజిస్ట్రేషన్ల నిలిపివేయాలని, వంద సర్వే నెంబర్లతో కూడిన నిషేధిత జాబితా విడుదల చేసిన నేపథ్యంలో ప్రజలు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి నిషేధిత జాబితాలో నుండి తమ కాలనీలు, బస్తీలకు చెందిన సర్వే నంబర్లను తొలగించాలని ఎంతో కష్టపడి పైసా పైసా కూడబెట్టుకుని ఇండ్లు కట్టుకున్నామని, తమకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. వక్ఫ్ బోర్డు ప్రకటించిన జాబితాలోని బస్తీల్లో సమావేశాలు ఏర్పాటు చేసి పేదల పక్షాన నిలబడతాన్నని ఎమ్మెల్యే మాటిచ్చారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో 382 ఎకరాల విస్తీర్ణంలో 100 సర్వే నెంబర్లను వక్ఫ్‌బోర్డుకు చెందినదిగా ప్రకటించగా, దీనిలో 70 కాలనీలు, బస్తీలు, దాదాపు 30 ఏళ్ల క్రితమే ఏర్పడ్డాయి, 1,967 కుటుంబాలు, దాదాపు ఒక లక్ష జనాభా ఉన్నారని, ఇప్పుడు రిజిస్ట్రేషన్ల నిలిపివేస్తే పేద ప్రజల అవసరానికి ఆడపిల్లల పెళ్లిళ్ల సమయానికో పై చదువుల కోసమో ఇండ్లను అమ్ముకోవాలన్నా, కొనుక్కోవాలన్నా, రిజిస్ట్రేషన్లు జరగకపోతే ప్రజలకు ఇబ్బందికరంగా మారుతుందని, పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని వక్ఫ్ బోర్డు ప్రకటించిన నిషేధిత జాబితాలో నుండి పేద ప్రజల ఇండ్లను తొలగించాలని, అదేవిధంగా గౌతమ్ నగర్ డివిజన్ ప్రజల దాహార్తి తీర్చేందుకు 5ఎంఎల్ రిజర్వాయర్‌ను నిర్మించాలని, మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని చెరువుల పరిరక్షణ సుధరీకరణ కోరుతూ ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతిపత్రం అందజేశారు.

ఛలో రాజ్‌భవన్‌లో పాల్గొన్న నవీన్ యాదవ్

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : చలో రాజ్ భవన్ జూబ్లీహిల్స్ నియోజక వర్గం యూసఫ్ గూడా డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కంటెంట్ ఎమ్మెల్యే జూబ్లీహిల్స్ అభ్యర్థి వి.నవీన్ యాదవ్ చలో రాజ్‌భవన్ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలతో ధర్నా చేశారు.

అయ్యప్ప స్వామి పడిపూజలో శంబిపూర్ కృష్ణ

విశాలాంధ్ర- దుండిగల్: అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని నియోజకవర్గం బిఆర్ఎస్ నేత శంబిపూర్ క్రిష్ణ పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ తాండాలో బుధవారం కొర్ర శివనాయక్ ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శంబిపూర్ క్రిష్ణ మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో నిర్వహించే అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనటం ఎంత సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ కొర్ర శంకర్ నాయక్ సీనియర్ నాయకులు కొర్ర రవి నాయక్, 27వ వార్డు ప్రెసిడెంట్ అమర్ సింగ్, పీఏసీఎస్ డైరెక్టర్ మోహన్ నాయక్, నాయకులు హనుమంత్ నాయక్, ప్రవీణ్ నాయక్, కుమార్ నాయక్, సోను, స్థానిక నాయకులు, గురుస్వాములు, అయ్యప్ప స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా పనిచేయాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిల్లాలో విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా విద్యార్థులకు సరళమైన రీతిలో నాణ్యమైన విద్యా బోధన చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ ఈవో, డిప్యూటీ ఐఓఎస్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి క్లాస్ రూమ్‌లో 75 శాతం మంది పిల్లలకు చదవడం, రాయడం రావాలని, అభ్యాస మెరుగుదల కోసం ప్రత్యేక పఠన ప్రణాళికను అమలు చేయాలని అన్నారు. క్లాస్ రూమ్ పరిశీలనకు వెళ్ళినప్పుడు నిర్మాణాత్మకమైన విశ్లేషణ చేయాలని, పరిశీలన స్నేహపూర్వకంగా ఉపాధ్యాయులతో ఉండాలని సూచించారు. తరగతి గది పరిశీలనకు వెళ్ళినప్పుడు ఎఫ్‌ఎల్‌ఎన్ సందర్శనాలపై దృష్టి సారించాలని, తరగతి గది పరిశీలన, ఆప్ ని పూరించాలని, అకాడమిక్ గైడెన్స్ రిజిస్టర్ నువ్వు పరిశీలించారని, తక్కువ సందర్శ మండలాలను మెరుగుపరుచుకోవాలని అన్నారు. వర్క్ షీట్‌లను కచ్చితంగా పిల్లలతో చేయించాలని రివ్యూ చేసి కరెక్షన్లు చేయాలని, సోమవారంలోగా బ్యాక్ లైన్ టెస్ట్ చేయాలని అన్నారు. కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, మండల నోడల్ అధికారులు 100శాతం పాఠశాలలను సందర్శించాలి అన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై, పాఠశాలల్లో నల్ల కలెక్షన్, డ్యూయల్ డెస్క్, మధ్యాహ్న భోజనం సమీక్ష, పదవ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి ఆ రోహిణి, ఉమాదేవి, డిప్యూటీ ఈఓలు, డిప్యూటీ ఐఓఎస్‌లు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన్ ఉత్సవ్‌తో రాష్ట్రపతి భవన్ సందర్శకులకు

ఆహ్లాదాన్ని అందించేలా చర్యలు

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రతి సంవత్సరం లాగానే శీతాకాల విడిదికి హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతి తిరిగి వెళ్లిన అనంతరం రాష్ట్రపతి నిలయాన్ని సందర్శంచడానికి ప్రజలకు వీలు కల్పించడం జరుగుతుంది, కాని ఈసారి మాత్రం ఒక ప్రధాన ఉద్దేశంతో ఉద్యాన్ ఉత్సవ్ అనే కార్యక్రమంతో సందర్శకులకు ఎంతో ఆహ్లాదాన్ని అందించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు భారత వ్యవసాయ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ శ్యామ్యూల్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ విసి హాల్‌లో నిర్వహించిన సమావేశంలో మేడ్చల్-మల్కాజిగిరి జల్లా కలెక్టరు గౌతంతో కలిసి జాయింట్ సెక్రటరీ శ్యామ్యూల్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాష్ట్రపతి శీతాకాల విడిది ముగించుకొని వెళ్లిన అనంతరం కొన్ని రోజులు రాష్ట్రపతి నిలయాన్ని ప్రజలు సందర్శించేందుకు అనుమతి ఉంటుంది. ఈ సారి ఆ సందర్శన కార్యక్రమానికి ఉద్యాన ఉత్సవ్ అనే పేరుతో మరింత ఆహ్లాదకర వాతావరణంతో పాటు స్టాల్స్, చిన్న చిన్న కుటీరాలను ఏర్పాటు చేయడంమే కాకుండా ఒక పిక్నిక్ స్పాట్‌గా తయారు చేయడం జరుగుతుందని, అధిక సంఖ్యలు ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అగ్రికల్చర్ అథారిటీ ఇనిస్టట్యూట్, సాంస్కృతిక, టూరిజం శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రత్యేక భౌగోళిక వ్యవసాయం, సమీకరణ వ్యవసాయంపై అవగాహన కల్పించేలా కుటీరాలను, స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రజలలో అవగాహన పెంచాలన్నారు. నిర్దేశిత ప్రాంతాలలో నిర్దేశిత పంటలు, వ్యర్థాలతో ఉపయోగాల తయారీ గురించి ప్రజలకు, విద్యార్థులకు తెలిసేలా స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. తమ తమ ఇళ్లలో నర్సరీ, గార్డనింగ్ ఎలా చేసుకోవాలో తెలిపేలా చిన్న చిన్న మెళకువలతో స్టాల్స్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు తెలపాలన్నారు. పిక్నిక్ స్పాట్ లా ఉండేలా పిల్లలకు ప్లే ఏరియా ఉండేలా చూడాలన్నారు. ఇంతే కాకుండా చిరుతిండ్లు స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఉద్యాన ఉత్సవ్‌ను తిలకించేందుకు వసతి గృహాల విద్యార్థులను రాష్ట్రపతి నిలయానికి తీసుకువచ్చి ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించి ఒక తీపి గుర్తుగా ఉండిపోయేలా వారి జ్ఞాపకాలలో నిలపాలన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా ప్రచారం చేయాలన్నారు. అందుకు అనుగుణంగా అవసరమైన త్రాగునీరు, అంబులెన్స్, మొబైల్ టాయిలెట్లు, రవాణా, లైటింగ్ వంటి మౌళిక వసతులను సంబంధిత శాఖల అధికారులు ఏర్పాటు చేయాలన్నారు. సందర్శనకు వచ్చిన ప్రతి ఒక్కరు మంచి అనుభవంతో పాటు మంచి అనుభూతితో తిరిగి వెళ్లేలా ఏర్పాట్లు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అగ్రికల్చర్ సరవనన్ రాజ్, జాయింట్ సెక్రటరీ ఉదయ్ కుమార్, జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్, డిఈఒ విజయ కుమారి, హార్టికల్చర్ ఆఫీసర్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నమోదును పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్ - మల్కాజిగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదలకు తమ సొంత గృహాలు నిర్మించడంలో నిజమైన లబ్ధిదారులను గుర్తించి పారదర్శకంగా సర్వే చేసి మహిళలకు అందజేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతమ్ అన్నారు. బుధవారం మధురనగర్ కాలనీ నిజాంపేట్ మున్సిపాలిటీలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తతో కలిసి పర్యటించారు. ఇందిర ఇండ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు. స్వయంగా దరఖాసుదారుల ఇళ్లను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా వివరాలను సేకరించి ఆన్లైన్లో నమోదు చేయాలనీ సూచించారు. వారి వెంట అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, మహమ్మద్ సాబీర్ అలీ, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ మేనేజర్, పవన్ కుమార్, రెవెన్యూ ఆఫీసర్ రమేష్, హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఈ. భగవంతురావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

జలమండలిలో క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : జలమండలిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ వేడుకలకు ఎండీ అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ జలమండలి వినియోగదారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలో అత్యధిక మంది ఆచరించేది క్రైస్తవ్యం అన్నారు. ప్రపంచ జనాభాలో దాదాపు 30 శాతానికి పైగా యేసుక్రీస్తును విశ్వసిస్తారని తెలిపారు. కాలాన్ని సైతం యేసుక్రీస్తు పుట్టుక ఆధారంగా కొలుస్తారని చెప్పారు. ఎంతో మంది మిషనరీలు మన దేశంలో సేవ చేశారని పేర్కొన్నారు. అదంతా యేసు క్రీస్తు చేసిన మంచి బోధల వల్లే అని చెప్పారు. యేసుక్రీస్తు మానవత్వానికి మరోరూపం అని క్రిస్మస్ సందేశం అందించిన పాస్టర్ తెలిపారు. యేసు క్రీస్తును శాంతి ప్రదాతగా పేర్కొన్నారు. యేసు చేసిన బోధనల్లోని మంచిని ఇతరులకు చెప్పాలని అన్నారు. జీఎం ఏజే సుగంధిని ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, పర్సనల్ డైరెక్టర్ సుదర్శన్, జీఎంలు మాణిక్యం, వసంత, డీజీఎంలు నిరుపమ, సునీల్, అరుణ్ కుమార్, పాస్టర్ రెవరెండ్ రమేష్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓవర్సీస్ స్కాలర్షిప్‌లు అందిచడంలో అలసత్వం వీడాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఎస్‌సి, ఎస్‌టి, బీసీ బ్రాహ్మణ విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్షిప్‌లు అందజేయడంలో జరుగుతున్న జాప్యాన్ని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి శాసనసభలో ప్రస్తావించారు. వంద కోట్లు బడ్జెట్‌లో కేటాయించినా కేవలం మొదటి విడతగా ముప్పై కోట్లు మాత్రమే విడుదల చేసి, రెండవ, మూడవ విడతలు విడుదల చేయడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న అలసత్వాన్ని ప్రశ్నిస్తూ మల్కాజిగిరి నియోజకవర్గంలో పేద ఎస్సీ, ఎస్టి, బి.సి, బ్రాహ్మణ కుటుంబాలలోని యువకులు విదేశాలకు వెళ్లి ఉన్నతమైన ఉద్యోగాలు చేసి ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఆశతో ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం (స్కాలర్షిప్) అందుతుందన్న నమ్మకంతో విదేశాలకు వెళ్లి గోస పడుతున్నారని, చాలా మంది అర్చక వృత్తిని ఉపాధిగా చేసుకున్న పేద బ్రాహ్మణుల పిల్లలు ప్రభుత్వ స్కాలర్షిప్పులను నమ్ముకొని విదేశాలకు వెళ్లి అక్కడ సరైన ఉద్యోగాలు లభించక, తిరిగి స్వదేశానికి రాలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం అలసత్వాన్ని విడిచి పేద విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్షిప్పులను విడుదల చేయాలని, యువత ఆశయాలను నెరవేర్చడంలో అలసత్వం జరిగితే వారి జీవితాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని, ప్రభుత్వం చర్యలు తీసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని అసెంబ్లీలో స్పీకర్ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

మూసీ సుందరీకరణ ప్రాజెక్టు కీలక పత్రాలు బయటపెట్టిన కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు సంబంధించి సంచలన పత్రాలను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బయటపెట్టారు. ప్రభుత్వం దాచిపెడుతున్న కీలక విషయాలను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు డీపీఆర్ సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకుకు పంపిన ప్రతిపాదనల్లో ఉన్న విషయాలను ఆధారాలతో సహా బయటపెట్టారు. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి ఇంకా డీపీఆర్‌లు సిద్ధం కాలేదని మంత్రి శ్రీధర్‌బాబు శాసన మండలికి తెలియజేసిన విషయం తెలిసిందే. అయితే, డీపీఆర్‌లు ఉన్నాయని నిర్దిష్టమైన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని ఎమ్మెల్సీ కవిత సభలోనే తేల్చిచెప్పారు. ఈ మేరకు బుధవారం నాడు శాసన సభ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్సీ కవిత విలేకరుల సమావేశంలో ప్రపంచ బ్యాంకు కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను బహిర్గతం చేశారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై ప్రభుత్వం తప్పుడు సమాధానాలు చెబుతోందని విమర్శించారు. మూసీ పరివాహక ప్రాంతంలో పేద ప్రజల నుంచి భూములు లాక్కొని ప్రపంచ బ్యాంకుకు తాకట్టుపెట్టి రియల్ ఎస్టేట్ చేయాలని అనుకుంటున్నారని స్పష్టం చేశారు. "ప్రపంచ బ్యాంకుకు సెప్టెంబర్ 19న ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ప్రతిపాదనల్లో స్పష్టంగా మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అని స్పష్టం రాసుందన్నారు. కానీ మంత్రి శ్రీధర్ బాబు మాత్రం మూసీ ప్రాజెక్టు కాదు మరుగునీటి శుద్ధికి సంబంధించి ప్రపంచ బ్యాంకు రుణాన్ని కోరామని తప్పుడు విషయం చెప్పారని తెలిపారు. రియల్ ఎస్టేట్, ల్యాండ్ పూలింగ్ చేసి పెద్ద పెద్ద భవంతులు కడుతామని ప్రతిపాదనల్లో స్పష్టంగా పేర్కొందని, డీపీఆర్‌లు ఉన్నాయని ప్రపంచ బ్యాంకుకు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసిందని చెప్పారు. కానీ ప్రభుత్వం మాత్రం శాసన మండలిలో డీపీఆర్‌లు లేవని చెప్పిందను పేర్కొన్నారు. డీపీఆర్ తయారు కాలేదని డిసెంబరు 17న చెప్పిన ప్రభుత్వం డీపీఆర్ ఉందని ప్రపంచ బ్యాంకుకు సెప్టెంబరు 19న తెలియజేసిందని చెపుకొచ్చారు. మూసీ ప్రాజెక్టు విషయంపై అసెంబ్లీలో ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి, ప్రపంచ బ్యాంకుకు, అసెంబ్లీకి, పేద ప్రజలకు వేర్వేరు మాటలు చెబుతోందని విమర్శించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజల్లో భయానక పరిస్థితి నెలకొందని, 15 వేల ఇళ్లకు మార్కింగ్ చేయడం వల్ల తమ ఇళ్లను ఎప్పుడు కూల్చుతారో అన్న భయం వారిలో నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్వాసితులకు పునరావాసం ఎక్కడ కల్పిస్తారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.

భాదితులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్ పెట్ డివిజన్ హుడా కాలనీ కరుణాకర్, అల్విన్ కాలనీ డివిజన్ ఎన్టీఆర్ నగర్ ఎల్లమ్మబండ జనాబ్ సయ్యద్ ఇస్మాయిల్ చికిత్స పొందిన అనంతరం శేరిలింగపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కార్యాలయాన్ని సంప్రదించగా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించి, ఈరోజు వారికి మంజూరైన 1,20,000 చెక్కును నియోజకవర్గ నాయకులతో కలిసి భాదిత కుటుంబ సభ్యులకు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ అందచేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల సరిహద్దులు డిజిటలైజ్ చేయాలి

కమిషనర్ ఇలంబర్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాలనీ లేఅవుట్‌లలోని అన్ని పార్కులు, ఖాళీ స్థలాల సరిహద్దులను చీఫ్ సిటీ ప్లానర్, టౌన్ ప్లానింగ్ విభాగం సమన్వయంతో డిజిటలైజ్ చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్లు, చీఫ్ సిటీ ప్లానర్‌లతో కలిసి కమీషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలనీ లేఅవుట్‌లలోని అన్ని పార్కులు, ఖాళీ స్థలాల సరిహద్దులను డిజిటైజ్ చేసి జియో ఫెన్సింగ్ చేయాలని తెలిపారు. ప్రతి ట్రీ పార్కులకు, ఖాళీ స్థలాలకు ప్రత్యేక ఐ.డి ఇవ్వాలని తెలిపారు. 2000 చదరపు గజాల కంటే ఎక్కువ ఖాళీ ప్రదేశాలను పార్కులుగా అభివృద్ధి చేయాలన్నారు. పార్క్ ప్రాంగణంలో అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు చేపట్టాలని, ఏదైనా ఉల్లంఘనలు గుర్తించబడితే తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని సర్కిల్ మేనేజర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్లు తమ పరిధిలోని పార్కులను కనీసం నెలకు ఒకసారి సందర్శించి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ లతో సమావేశాలు నిర్వహించి పార్క్ తనిఖీ నివేదిక ఫార్మాట్ ద్వారా ప్రతి నెల 5వ తేదీలోపు అర్బన్ బయోడైవర్సిటీ అదనపు కమిషనర్‌కు నివేదిక సమవర్పించాలని తెలిపారు. పార్క్ నిర్వహణ గురించి వాకర్స్, స్టేక్ హెూల్డర్స్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ల సభ్యుల నుండి అభిప్రాయాన్ని తెలుసుకొని, సందర్శకుల నుండి వచ్చిన ఈ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా కాంట్రాక్టర్‌లకు చెల్లింపులను విడుదల చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. పార్క్ ప్రాంగణంలో ప్లాస్టిక్‌ను నిరోధించడానికి ఒక ప్రతిపాదనను సమర్పించాలి, దానిని నియంత్రించే పద్ధతులు చేపట్టాలన్నారు. ఇతర శాఖల ద్వారా చెట్ల నరికివేతను సకాలంలో తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైన సాధనాలు, ఇన్‌పుట్‌లను ఉపయోగించి కత్తిరింపు పద్ధతిపై స్పష్టమైన సూచనలను జారీ చేయడానికి అనుబంధ లైన్ డిపార్ట్‌మెంట్‌లతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించాలని తెలిపారు. సెక్యూరిటీ గార్డుల వారి సేవలను సమర్థవంతంగా వినియోగించు కోవలన్నారు. పార్కుల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా సెక్యూరిటీ వారు కృషి చేయాలన్నారు. అర్బన్ బయోడైవర్సిటీ విభాగం యొక్క టికెటింగ్, ధర, రాబడి మొదలైనవాటిని పటిష్టమైన పద్ధతులు అనుసరించాలని అన్నారు. రింగ్ ఫెన్సింగ్, ఫ్లో బ్యాక్ సిస్టమ్ కోసం మెకానిజం అభివృద్ధికి చర్యలు తీసుకుని తద్వారా పార్క్ అభివృద్ధి నిర్వహణ కోసం ఆదాయాన్ని వినియోగించుకోవాలన్నారు. హరిత నిధి కింద వచ్చిన సొమ్మును పార్కుల్లో పచ్చదనం పెంపొందించేందుకు అటవీ శాఖకు బదులుగా జీహెచ్ఎంసీ వద్ద ఉంచవచ్చా లేదా అనేది దానిపై ఈ సమావేశంలో చర్చించారు. పావురాలను బహిరంగ ప్రదేశాల్లో తినిపించడం వల్ల పట్టణ ప్రాంతాల్లో జీవవైవిధ్యం ఇబ్బంది కారంగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో, పశు వైద్య విభాగం సంప్రదించి బహిరంగ ప్రదేశాల్లో పావురాల దాణాను వేయకుండా మార్గాలను పరిశీలించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ సుభద్ర దేవి, శ్రీనివాసరావు, సునంద రాణి, చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, విజిలెన్స్ విభాగం అదనపు పోలీసు సూపరింటెండెంట్ శ్రీనివాస్, అదనపు కమిషనర్ ఎస్టేట్, సామ్రాట్ అశోక్ అదనపు కమిషనర్ లేక్స్ శివకుమార్ నాయుడు, జాయింట్ కమిషనర్ ఐటీ పద్మ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ ఆధ్వర్యంలో ఛలో రాజ్‌భవన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం నుంచి భారీ జన సమీకరణతో రాజ్ భవన్ వరకు ప్రదర్శనగా చలో రాజ్‌భవన్ వెళ్లారు. ఈ ప్రదర్శనలో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇంచార్జ్ దీపా దాస్ మున్షి, మంత్రులు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. అమెరికాలో గౌతమ్ ఆధానిపై వచ్చిన ఆర్థిక అవకతవకలు దేశ వ్యాపార, ఆర్థిక రంగాలలో పరువును దెబ్బతీసాయి. ఆధానిపై ఆర్థిక అవకతవకలు, నేరారోపణలు, అవినీతి, మోసం, మని లాండరింగ్, మార్కెట్ మనిపులేషన్ లాంటి అంశాలలో ఆయనపై ఆరోపణలు దేశ ప్రతిష్టను దెబ్బతీసాయి. అలాగే మణిపూర్ లో వరసగా జరిగిన అల్లర్లు, విధ్వంసాలపై మోడీ ఇప్పటి వరకు అక్కడకు వెళ్లకపోవడంలాంటి అంశాలపై ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు చేపడుతున్న ప్రదర్శనకు భారీగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తరలివచ్చారు.

విశాలాంధ్ర - మేడిపల్లిలో: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. అమెరికాలో గౌతమ్ ఆధానిపై ఆర్థిక అవకతవకలు, నేరారోపణలు, అవినీతి, మోసం, మని లాండరింగ్, మార్కెట్ మనిపులేషన్ లాంటి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో మణిపూర్‌లో జరిగిన అల్లర్లు, విధ్వంశాలపై మోడీ సర్కార్ స్పందించకపోవడంతో మోడీ వైఖరిని ఖండిస్తూ ఏఐసిసి పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నిర్వహించిన ఛలో రాజ్‌భవన్ కార్యక్రమం విజయవంత మైంది. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో నిర్వహించిన నిరసన ర్యాలీ నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం నుంచి రాజ్ భవన్ వరకు సాగింది. ఈ నిరసనకు మద్దతుగా రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, పీర్జాదిగూడ మహిళా అధ్యక్షురాలు శ్రీలత భద్రు నాయక్, ఉపాధ్యక్షులు మహ్మద్ మజర్, వెంకటేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిరాం గౌడ్, సీనియర్ నాయకులు, మహేష్, శ్యామ్, సాయి రెడ్డి, పఠాన్, మహేశ్వరప్ప, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు శారదా గౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రశ్నార్థకంగా విద్యార్థుల భవిష్యత్తు

ఎమ్మెల్యే వివేకానంద్

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద మండిపడ్డారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాల ప్రశ్నోత్తరాలలో భాగంగా "విద్యార్థులకు విదేశీ విద్య ఉపకార వేతనాలపై" అంశంపై ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రభుత్వాన్ని ప్రశ్నించగా ప్రభుత్వం నుంచి స్పష్టమైన సమాధానం లభించలేదు. ప్రశ్నోత్తరాలలో భాగంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టి, బీసీ, మైనారిటీ, బ్రాహ్మణ, అగ్రవర్ణాల కులాలకు చెందిన పేద, మధ్య తరగతి విద్యార్థులు తమ ఉన్నత విద్యకై, ఉజ్వల భవిష్యత్తుకై గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 20 లక్షల రూపాయలను విద్యార్థులకు అందజేస్తూ విదేశీ విద్యను ప్రోత్సహిస్తే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం విదేశీ విద్యను నిర్వీర్యం చేస్తూ పెండింగ్లో ఉన్న బకాయిలను విడుదల చేయక విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. మూడు లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశపెట్టే ప్రభుత్వం విదేశీ విద్యపై 100 కోట్లు వెచ్చించేందుకు ఎందుకు వెనకాడుతున్నారో ప్రభుత్వం తెలియజేయాలి. విదేశీ విద్యపై బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి పొంతనలేని సమాధానాలు లభిస్తున్నాయి. ఇక్కడ అంకెల గారడే తప్పా విదేశీ విద్య ఆచరణలో ప్రభుత్వానికి నిబద్ధతలేదనేది స్పష్టమవుతోంది. గత ప్రభుత్వ హయాంలోనే 2023 డిసెంబర్ వరకు 7801 మంది విద్యార్థుల కోసం దాదాపు 1131.56 కోట్ల రూపాయలు చెల్లించి మొదటి దఫా ఇన్‌స్టాల్‌మెంటును పూర్తిగా చెల్లించడం జరిగింది. ప్రభుత్వ మాత్రం రెండు, మూడో దఫా ఇన్స్టాల్మెంట్లలో బకాయిలను చెల్లించాల్సి ఉండగా గత పది సంవత్సరాల విదేశీ విద్య ఉపకార వేతనాల చెల్లింపు పై చర్చిస్తూ సభను, ప్రజలను గందరగోళానికి గురిచేస్తోంది. మేము గత ప్రభుత్వ హయాంలో 20 లక్షల రూపాయలు విదేశీ విద్య ఉపకార వేతనాలకు చెల్లిస్తే.. కాంగ్రెస్ పార్టీ 25 లక్షల రూపాయలు ఇస్తామంటూ మేనిఫెస్టోలో పెట్టి అధికారంలోకి వచ్చి, సంవత్సరం గడుస్తున్న పెండింగ్ బకాయిలను చెల్లించకపోవడం విచారకరమన్నారు. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్టు తయారయింది విదేశీ విద్య ఉపకార వేతనాల విద్యార్థుల తీరు అని అన్నారు. ఇకనైనా ప్రభుత్వం 10శా కమీషన్లు బంద్ చేసి విదేశీ విద్య ఉపకార వేతనాల బకాయిలను వెంటనే విడుదల చేయాలి.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలో ప్రజలకు మరింత మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు స్థానిక కార్పొరేటర్ సుభాష్ నాయక్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ముఖ్య అతిథులుగా మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుభాష్ నాయక్ మాట్లాడుతూ రెండో డివిజన్ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ సౌజన్యంతో పాలకవర్గ సభ్యుల సహకారంతో 2వ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని, అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా పంచవటి కాలనీ రోడ్ నెంబర్ 3లో సుమారు 24 లక్షల నిధులతో సిసి రోడ్ల నిర్మాణం, కమలానగర్ ఎంకెబిఆర్ రోడ్డులో సుమారు 25 లక్షలు నిధులతో సిసి రోడ్లు డ్రైనేజ్ పైప్ లైన్ నిర్మాణం, శ్రీ సాయి నగర్ కాలనీ ఈస్ట్‌లో సుమారు 7 లక్షల నిధులతో డ్రైనేజ్ పైప్ లైన్ నిర్మాణం, అదేవిధంగా సుమారు 40 లక్షల నిధులతో వరద నీటి డ్రైనేజీ క్యాప్చర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని, త్వరలోనే పనులను ప్రారంభిస్తామని సుభాష్ నాయక్ అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులకు, వివిధ కాలనీలా అధ్యక్ష కార్యదర్శులకు కాలనీవాసులకు కార్పొరేటర్ సుభాష్ నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘు, డి.ఈ సాయినాథ్ గౌడ్, కార్పొరేటర్లు భీమిరెడ్డి నవీన్ రెడ్డి, మద్ది యుగంధర్ రెడ్డి, ఏంపల్ల అనంతరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దర్గా దయాకర్ రెడ్డి, పప్పుల అంజిరెడ్డి, మాదుగుల చంద్రారెడ్డి, యాచారం మహేష్, కుర్ర శ్రీకాంత్, కోఆప్షన్ సభ్యులు జగదీశ్వర్ రెడ్డి, ఇర్ఫాన్, జలంధర్ రెడ్డి, మణిరాం నాయక్, శ్రీలత భద్రు నాయక్, శారదా, సుక్క జయేందర్, సునీల్, ప్రశాంత్, సౌత్ పంచవటి కాలనీ అధ్యక్షులు నరసింహారావు, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కాలనీ కార్యవర్గ సభ్యులు, ఈస్ట్ శ్రీ సాయినగర్ కాలనీ అధ్యక్షులు ఉపేందర్, ప్రధాన కార్యదర్శి నవీన్ రెడ్డి, కాలనీ కార్యవర్గ సభ్యులు, ఎస్వి కాలనీ అధ్యక్షులు రాధాకృష్ణ రావు, జనరల్ సెక్రెటరీ నరసయ్య కాలనీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ ఘాట్‌లో అసెంబ్లీని కట్టాలనే
ఎమ్మెల్యే కోమటిరెడ్డి వ్యాఖ్యలు అభ్యంతకరం

విశాలాంధ్ర - హైదరాబాద్ : శాసనసభ్యులు ఏమి మాట్లాడినా హుందాతనంతో మాట్లాడాలని, కాంగ్రెస్ పార్టీకి చెందిన శాసనసభ్యుడు మాట్లాడిన మాటలు అభ్యంతకరంగా ఉన్నాయని తెలంగాణ తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు తెలిపారు. ఎన్‌టిఆర్ తెలుగు వారి ఆరాధ్యదైవం అని, చిత్ర పరిశ్రమలో సామాన్య పౌరునిగా, రాజుగా, దైవంగా అనేక చిత్రాలలో నటించి ప్రపంచ ప్రఖ్యాతి పొందారని ఆయన తెలిపారు. తనను ఆదరించిన తెలుగు ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఎన్‌టిఆర్ హైదరాబాద్‌లో తెలుగుదేశం పార్టీని ప్రారంభించి చదువుకున్న యువకులకు ముఖ్యంగా వెనుకబడిన వర్గాలకు టికెట్లు ఇచ్చి రాజకీయ అవకాశాలను కల్పించారన్నారు. స్థానిక సంస్థలలో వెనుకబడిన వర్గాలకు, మహిళలకు రిజర్వేషన్‌లను కల్పించిన మహనీయుడని, మహిళలకు ఆస్తి హక్కు కల్పించిన నాయకుడని, ఆయన చేసిన ఈ విధానాలు దేశానికే ఆదర్శమవుతున్నాయన్నారు. మాల, మాదిగలకు ఆశ్రమ పాఠశాలలను మొట్ట మొదట ప్రారంభించిన నాయకుడు ఎన్‌టిఆర్ అని, పరిపాలన, రాజకీయ రంగాలలో పెను మార్పులు తెచ్చిన మహనీయుడు ఎన్‌టిఆర్ అని, అటువంటి మహెూన్నత నాయకుడి స్మృతికి చిహ్నామైన ఎన్‌టిఆర్ ఘాట్‌లో అసెంబ్లీని కట్టాలనే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడటం మంచి సాంప్రదాయం కాదని, కోట్ల మంది అభిమానులు కలిగిన నాయకునిపై రాజగోపాల్ రెడ్డి అలా మాట్లాడటం సరికాదని, గత ప్రభుత్వం ఉన్న సచివాలయాన్ని ఏమైనా చిన్నచిన్న రిపేర్లు చేసే బదులు మొత్తానికి మొత్తం కూల్చివేసి కట్టారన్నారు. ప్రజల డబ్బు ఎందుకు వృథా చేస్తారు, రాజగోపాల్ రెడ్డి మాటలు కాంగ్రెస్ విధానమా? లేక రాజగోపాల్ రెడ్డి విధానమా? రెచ్చగొట్టే మాటలు మాట్లాడటం మంచిది కాదన్నారు. పోరాటాల గడ్డ నల్లగొండ నుంచి శాసన సభ్యునిగా నందమూరి తారక రామారావుని ప్రజలు ఎన్నుకున్నారని, భూమి కోసం, భుక్తికోసం పోరాడిన నల్లగొండ ప్రజలు ఎన్‌టిఆర్‌కు ఓట్లు వేసి గెలిపించుకున్నారన్నారు. ఎన్‌టిఆర్ ఘాట్‌లో శాసనసభ భవనాన్ని నిర్మించాల్సిన పని ఏమి ఉన్నది, రాజగోపాల్ రెడ్డి మాట్లాడిన మాటలకు పరిణామాలు ఏ విధంగా ఉంటాయో ఆయన ఆలోచించుకోవాలన్నారు.

ప్రపంచవ్యాప్తంగా లయన్స్ క్లబ్ సేవలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: లయన్స్ ఇంటర్నేషనల్ ప్రపంచంలోనే అతిపెద్ద సర్వీస్ క్లబ్ ఆర్గనైజేషన్, ప్రపంచవ్యాప్తంగా 200 దేశాలు, భౌగోళిక ప్రాంతాలకు సేవలందిస్తున్న 49,000 క్లబ్‌లలో 1.4 మిలియన్లకు పైగా సభ్యులు ఉన్నారు. 1917లో మేము స్థాపించినప్పటి నుండి, అవసరం ఉన్న చోట లయన్స్ క్లబ్ ద్వారా సామాజిక సేవ మేము చేస్తూనే ఉన్నామని నోవాటెల్‌లో జరిగిన ఈ సమావేశంలో అంతర్జాతీయ అధ్యక్షుడు ఫాబ్రిసియో ఒలివేరా మొదటి ఉపాధ్యక్షుడు ఏపీ. సింగ్ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబు రావు, గట్టమనేని ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఎస్ మహేష్ గత ఇంటర్నేషనల్ డైరెక్టర్ సునీల్ కుమార్ ఆర్.పాల్గొని ప్రశంగించారు. మరో మూడు రోజుల పాటు, రోజుకు 1000 మందికి చేరేలాగా ఫుడ్, బెడ్ షీట్స్, కావాల్సిన సదుపాయాలు పార్సిల్స్ రూపంలో పేదల, గౌర్నమెంట్ హాస్పిల్‌లో ఉన్న పేషంట్స్‌కి స్వయంగా అంతర్జాతీయ అధ్యక్షుడు ఫాబ్రిసియో ఒలివేరా తన బృందం సేవలందించే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈనెల 21న హైదరాబాద్ ఎల్‌బి స్టేడియంలో నిర్వహించు క్రిస్మస్ పండుగ విందు వేడుకలను ఘనంగా నిర్వహించాలని వచ్చే అతిథులకు ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ కుక్కడన్ అధికారులను ఆదేశించారు. ఎల్‌బి స్టేడియంలో ఎస్ఎల్‌టిసి సభ్యులు, పోలీస్, జిహెచ్ఎంసి, రెవెన్యూ, ఆర్ అండ్ బి, సమాచారశాఖ, విద్యుత్ శాఖ, టిజిఆర్టిసి వైద్యశాఖ తదితర శాఖ అధికారులతో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈనెల 21న సాయంత్రం ఎల్బీ స్టేడియంలో జరిగే క్రిస్టమస్ పండుగ విందు కార్యక్రమం, వేడుకల నిర్వహణపై నియమించిన రాష్ట్ర స్థాయి కమిటీలు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని దిశానిర్దేశ్యం చేసారు. క్రిస్మస్ విందు కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు ముఖ్యతిధులుగా పాల్గొంటున్నందున ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. ఈ వేడుకల నిర్వాహణ జిహెచ్ఎంసి పరిధిలో 200 ప్రాంతాలలో అలాగే రూరల్ ప్రాంతాలలోని అసెంబ్లీ నియోజకవర్గాలలో 95 ప్రాంతాలలో వేడుకలు నిర్వహిస్తున్నామని, నిర్వహణ ఏర్పాట్లు పక్కాగా ఉండేలా చూడాలని సూచించారు. జిహెచ్ఎంసి పరిధిలో వేడుకల నిర్వహణకు రూ.లక్ష అలాగే అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో రూ. రెండు లక్షలు నిధులు మంజూరు చేయడం జరిగిందని అలాగే సికింద్రాబాద్ కాంటోన్మెంట్‌లో చేపట్టే వేడుకలకు రూ. 10 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. వేడుకలకు వచ్చేందుకు 100 బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ వేడుకలకు 30 నియోజక వర్గాలనుండి దాదాపు 10 వేల మంది క్రైస్తవులు పాల్గొంటారని వారికి కేటాయించిన గ్యాలరీలలో పంపించాలని అలాగే ప్రోటోకాల్ తప్పక పాటించాలని సూచించారు. అలాగే భోజనాలు ఫుడ్ సేఫ్టీ అధికారుల ద్వారా పరీక్షించాలని తెలిపారు. మైనార్టీ ఫైనాన్స్ ఎం డి క్రాంతి వెస్లీ, సమాచార శాఖ కమిషనర్ డాక్టర్ హరీష్, ఉద్యాన వన శాఖ సంచాలకులు యాస్మిన్ భాష, క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి సబిత, పోలీస్ అదనపు కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, సమాచార శాఖ అదనపు సంచాలకులు డిఎస్ జగన్ మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియాస్ అహ్మద్,ఆర్ డి ఓ రామకృష్ణ, తహసీల్దార్ ప్రేమ్ కుమార్, ఇతర శాఖల అధికారులు, ఆర్గనైజర్ సైదా తదితరులు పాల్గొన్నారు.

ఛలో రాజ్‌భవన్‌కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఏఐసీసీ పిలుపు మేరకు టిపిసిసి ఆధ్వర్యంలో చేపట్టిన చలో రాజ్ భవన్ కార్యక్రమానికి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బుధవారం తరలివెళ్ళడం జరిగింది. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ నరేంద్రమోడీ ఆదానీని వెనుకేసుకు రావడం సరికాదన్నారు. ఆదానీని ప్రపంచం గమనిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, నాయకులు వెంకటేష్ యాదవ్, జి.ఎస్.వి. సతీష్ కుమార్, బీ.కే.శ్రీనివాస్, బాబు, సత్యనారాయణ, ఇందిరా ప్రియదర్శిని, ఆశా, రాందాస్ సంతోష్, ఇస్తారీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఛలో రాజ్‌భవన్‌లో పాల్గొన్న జగదీశ్వర్‌గౌడ్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఏఐసీసీ పిలుపుమేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో రాజ్‌భవన్ కార్యక్రమంలో భాగంగా నెక్లెస్ రోడ్డులో ఉన్న ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నుండి రాజ్‌భవన్ వరకు చేపట్టిన ధర్నా కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి దుద్దిల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, కొండ సురేఖ, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ దీప దాస్ మున్షి, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, రాష్ట్ర నియోజకవర్గ నాయకులతో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమెరికాలో గౌతమ్ ఆధానిపై వచ్చిన ఆర్థిక అవకతవకలు దేశ వ్యాపార, ఆర్థిక రంగాలలో పరువును దెబ్బతీసాయి. ఆధానిపై ఆర్థిక అవకతవకలు, నేరారోపణలు, అవినీతి, మోసం, మని లాండరింగ్, మార్కెట్ మనిపులేషన్ లాంటి అంశాలలో ఆయనపై ఆరోపణలు దేశ ప్రతిష్టను దెబ్బతీసాయని అలాగే మణిపూర్‌లో వరసగా జరిగిన అల్లర్లు, విధ్వంసాలపై మోడీ ఇప్పటి వరకు అక్కడకు వెళ్లలేదంటూ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ర్యాలీలో నీలం మధు ముదిరాజ్ పాల్గొని బిజెపి ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనించాలని కోరారు.

అసెంబ్లీలో ప్రాంగణంలో మనవరాలితో ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర - హైదరాబాద్ : అసెంబ్లీ సమావేశాలు స్కూల్ విద్యార్థులకు చూపించడానికి ఓ పాఠశాల యాజమాన్యం బుధవారం అసెంబ్లీకి తీసుకువచ్చారు. పాఠశాల విద్యార్థులు వచ్చారని ఆ స్కూల్ విద్యార్థులలో తన మనుమరాలు ఉందని తెలుసుకొని కలవడానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వచ్చారు. తన మనమరాలను కలిసి మీ తాత ఎమ్మెల్యే అని మీ స్కూల్ మెంట్స్‌కు చెప్పావా అని అడగ్గా చెప్పలేదు తాత అని సమాధానం ఇచ్చింది తన మనవరాలు.

ఉచిత వైద్య శిబిరాలు పేదలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - ఆమనగల్లు : అందరూ బాగుండాలి... ఆరోగ్యంగా ఉండాలనే... సూక్తిని పాటిస్తూ కల్వకుర్తి నియోజకవర్గ నిరుపేదల కోసం గ్రామ గ్రామాన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలకు ప్రజల నుండి మంచి స్పందన లభిస్తుందని డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. బుధవారం కడ్తాల మండలంలోని ముద్విన్ గ్రామంలో మూడు రోజులపాటు కొనసాగుతున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని మాడుగుల పిఏసిఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, మాజీ జెడ్పిటిసి జరుపుల దశరథ్ నాయక్‌లతో కలిసి ఆయన సందర్శించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్ ఏర్పాటు చేసిన ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 330 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ వైద్య శిబిరాన్ని డాక్టర్ అఖిల్, డాక్టర్ అనిల్, భావని కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో రోగులను పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముద్విన్ మాజీ ఉపసర్పంచ్ వినోద్, బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ రాజు, పొట్టి శ్రీను, ఇ.అనిల్, జంగయ్య యాదవ్, జంగయ్య, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అర్థం వాసుదేవ్, నాయకులు అర్థం చంద్రయ్య, అర్థం యాదయ్య, వేముల రమేష్, అర్థం శ్రీను, అర్థం ప్రకాష్, బుచ్చిబాబు, ఆశ వర్కర్లు, గ్రామ పెద్దలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - కాప్రా : మల్లాపూర్ డివిజన్ అభివృద్ధి కోసం నిధులను మంజూరు చేయాలని డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి బుధవారం జిహెచ్ఎంసి, ఎల్‌బి నగర్ ఈస్ట్ జోన్, జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరిన కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి ముఖ్యంగా కెఎల్ రెడ్డి నగర్, ఎస్వీ నగర్, బ్రహ్మపురి కాలనీ, వెంకటరమణ కాలనీ, గ్రీన్ హిల్స్ కాలనీ, గోకుల్ నగర్ కాలనీల్లో సీసీ రోడ్ల కొరకు నిధులు మంజూరు చేయాలని, దత్తాత్రేయ నగర్, మేఫ్లవర్ పార్క్, కెఎల్ రెడ్డి నగర్, జనప్రియ టౌన్‌షిప్‌ల్లో స్థానిక కాలనీ వాసుల కోరిక మేరకు కాలనీ పార్కుల్లో ఓపెన్ జిమ్ కొరకు నిధులు మంజూరు చేయాలని జోనల్ కమిషనర్ ను కోరారు.

ఘనంగా నవగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మున్సిపాలిటీ మునుగనూరులో బుధవారం శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి దేవాలయం మల్లన్న గుట్ట ప్రాంగణంలో శ్రీ నవగ్రహ ప్రతిష్ఠ మహెూత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య హాజరై నవగ్రహ దేవతలను దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు వేముల స్వాతి, అమరేందర్ రెడ్డి, తాళ్లపల్లి సంగీత మోహన్ గుప్తా, ఆలయ పాలక కమిటీ సభ్యులు, కార్యక్రమ దాతలు మేకం లక్ష్మయ్య, ధనమ్మ దంపతులు వేముల భాస్కర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ కొనసాగించాలి

చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలి
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్ అసోసియేషన్ (ఏఐవైఎఫ్ అనుబంధం) అధ్వర్యంలో విజయవాడ దాసరి భవన్ వద్ద వలంటీర్లు చేపట్టిన 50 గంటల ఆత్మగౌరవ దీక్ష శిబిరాన్ని మూడవ రోజు బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరంలో వలంటీర్ల నుద్దేశించి రామకృష్ణ మాట్లాడుతూ వలంటీర్లు గొంతెమ్మ కోరికలు కోరడం లేదన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి , అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ ప్రకారమే వలంటీర్లను విధుల్లో కొనసాగిస్తూ... రూ.10వేలు గౌరవ వేతనం ఇవ్వాలని కోరుతున్నారని చెప్పారు. 45 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబు వలంటీర్లను కొనసాగించి తన చిత్తశుద్ధి చాటుకోవాలని స్పష్టం చేశారు. వలంటీర్ల గురించి రాష్ట్రంలో మంత్రులు తెలిసి తెలియనట్లుగా మాట్లాడటం బాధాకరం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటకు కట్టుబడాలని ఆయననే ప్రశ్నిస్తున్నట్లు చెప్పారు. వలంటీర్లు అందరూ వైసీపీకి సంబంధించిన కార్యకర్తలని తెలుగుదేశం పార్టీకి సంబంధించిన మంత్రులు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధుల్లా ఉంటూ ప్రభుత్వం చెప్పిన ప్రతి పని చేసిన వలంటీర్లను ఒక పార్టీకి ఆపాదించడం సరికాదన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో మంత్రులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నార న్నారు. వ్యవస్థ లేనిదే జీవో లేనిదే వరదల సమయంలో విపత్కర పరిస్థితులలో వలంటీర్లను ఏ విధంగా వినియోగించుకున్నారని ప్రశ్నించారు. నిన్న మొన్నటి వరకు సచివాలయాల్లో వలంటీర్ల ద్వారా హాజరు తీసుకున్నారని, ఇప్పుడు దాన్ని కూడా రద్దు చేయడం బాధాకరం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం న్యాయం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం వలంటీర్లు కూడా పనిచేశారని అది గమనంలో ఉంచుకోవాలని కోరారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని, బకాయి పడ్డ జీతాన్ని తక్షణమే చెల్లించాలని వలంటీర్లు చేస్తున్న పోరాటానికి సీపీఐ పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్లకు న్యాయం చేయకుంటే పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వలంటీర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏఐవైఎఫ్ విజయవాడ నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు, మమత, సరోజినిలతో పాటు వలంటీర్లకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. దీక్షా శిబిరాన్ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు, సీపీఐ కడప జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందగల సాయికుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణం, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల చైతన్య, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు సందర్శించి వలంటీర్లకు మద్దతు సంఘీభావం తెలుపుతూ ప్రసంగించారు.

సొమ్మసిల్లి పడిపోయిన వలంటీర్లు

50 గంటల ఆత్మగౌరవ నిరసన దీక్ష చేపట్టిన వలంటీర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మమత, ఉపాధ్యక్షురాలు సరోజిని సొమ్మసిల్లి పడిపోయారు. వారిని హనుమాన్ పేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు.ఈ దీక్షా కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కుమార్, శిరీష, వెంకటసుబ్బయ్య, రాజేష్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండకు రామకృష్ణ అభినందనలు

విశాలాంధ్ర-విజయవాడ: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షులు, ప్రముఖ రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించడం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. 2021లో ప్రచురితమైన అభ్యుదయ వ్యాస సంపుటి 'దీపిక' కు గాను పెనుగొండకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించిందన్నారు. లక్ష్మీనారాయణ దాదాపు 46 ఏళ్లుగా అరసంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో వివిధ బాధ్యతలు నిర్వహించి, 2023లో జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని వివరించారు. డిసెంబరు 17వ తేదీ మంగళవారం విజయవాడలో సీపీఐ శత వార్షికోత్సవ సాంస్కృతిక కార్యక్రమంలో ఆయనను కలవడం జరిగిందన్నారు. సీపీఐ శత వార్షికోత్సవ వేడుకల సందర్భంలో పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించడం అభినందనీయమని పేర్కొంటూ, పెనుగొండకు శుభాకాంక్షలు తెలిపారు.

పెనుగొండకు అవార్డుపై ప్రజానాట్యమండలి హర్షం

సాహిత్య రంగంలో అపారమైన అనుభవాన్ని గడించిన అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించడం పట్ల ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నల్లూరు వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి.చంద్ర నాయక్, చెన్నం పెంచలయ్య ఒక సంయుక్త ప్రకటనలో అభినందనలు తెలిపారు. సాహిత్యంలో అభ్యుదయాన్ని గొప్పగా చెప్పగలిగిన రచయితగా పేరుపొందిన పెనుగొండ రానున్న కాలంలో సాహిత్య రంగంలో మరిన్ని సేవలు అందించాలని అభిలషించారు.

లక్ష్మీనారాయణకు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రశంసలు

కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు పొందిన పెనుగొండ లక్ష్మీనారాయణకు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ తరపున సంస్థ మేనేజర్ టి.మనోహర్ నాయుడు అభినందనలు తెలిపారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ 20121లో ప్రచురించిన పెనుగొండ లక్ష్మీనారాయణ రచన అభ్యుదయ వ్యాస సంపుటి 'దీపిక' పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు 2024 సంవత్సరానికి ప్రకటించటం ఎంతో గర్వకారణం అన్నారు. లక్ష్మీనారాయణ ఆధునిక తెలుగు సాహిత్య పరిణామాలతో సన్నిహితంగా ప్రయాణించారని తెలిపారు. అభ్యుదయ సాహిత్యోద్యమంలో ఉద్ధండులతో కలిసి స్వయంగా పాల్గొన్నారని, ప్రజా సాహిత్యం పట్ల, ప్రజా సాహిత్య చరిత్ర పట్ల వాస్తవిక దృష్టి కలిగిన ఉన్నారని పేర్కొన్నారు. 'దీపిక' పేరుతో వెలువరించిన ఈ పుస్తకం వారి సాహితీ అనుభవానికి అద్దం పట్టిందన్నారు.

కుల ధృవీకరణ పత్రాలపై జగన్ బొమ్మ, నవరత్నాల లోగో తొలగించాం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలపై జగన్మోహన్ రెడ్డి బొమ్మలతో పాటు నవరత్నాల లోగోలను తొలగించామని ప్రభుత్వ న్యాయవాది హైకోర్టు ద్విసభ్య ధర్మాసనానికి తెలిపారు. మే, 2024న జగన్ తన బొమ్మతో పాటు, నవరత్నాల లోగోలను ఎస్సీ ఎస్టీల కుల ధృవీకరణ పత్రాలపై ముద్రించడాన్ని అమరావతి బహుజన ఐకాస అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయగా... ఈ కేసు ధర్మాసనం ముందు బుధవారం మరోమారు విచారణకు వచ్చింది. గతంలో హైకోర్టు సాంఘిక సంక్షేమ శాఖతో పాటు పలు ప్రభుత్వ శాఖలకు బొమ్మల ముద్రీకరణపై నోటీసులు కూడా ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీల కుల ధృవీకరణ పత్రాలు రాజ్యాంగ పరమైనవని, వీటి ముద్రణ విధానాలపై రాష్ట్రపతి మార్గదర్శకాలు ఉన్నాయని, ధృవీకరణ పత్రాలపై రాజకీయ లోగోలు, ఫోటోలు వాడటం రాజ్యాంగ వ్యతిరేక చర్యగా, దళితుల ఆత్మ గౌరవానికి భంగం కలిగించే నిర్ణయంగా పిటీషనర్ తరఫున న్యాయవాది పి.వి.జి. ఉమేష్ చంద్ర వాదించారు. జగన్ బొమ్మలను, నవరత్నాల లోగోను తొలగించామని, గతంలో ధృవీకరణ పత్రాల మంజూరులో పాటించిన విధానాలతోనే కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నామని ప్రభుత్వ న్యాయవాది హైకోర్టు సీజేకు తెలిపారు.

హామీలు అమలు చేయండి: జల్లి విల్సన్

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: ఎన్నికలకు ముందు కూటమి నేతలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చీరాల సీనియర్ సిటిజన్ కార్యాలయంలో బుధవారం సీపీఐ జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఆ పార్టీ పట్టణ కార్యదర్శి సైకం రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జల్లి విల్సన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా... వాగ్దానాల అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎంతో నమ్మకంతో ప్రజలు అత్యధిక మెజార్టీతో కూటమి నేతలను గెలిపించారని, వారి నమ్మకాలను వమ్ము చేయకుండా పాలన సాగించాలని కోరారు. కార్మిక కర్షక శ్రామిక వర్గాలు ఆర్థిక పురోభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. తుపానులకు సర్వం కోల్పోయి అన్నదాతలను ఆదుకోవాలన్నారు. జనవరి రెండో తేదీ నుంచి 10 వరకు తహసీల్దారు కార్యాలయాల వద్ద ఇళ్ల స్థలాల కోసం అర్జీలు ఇచ్చే కార్యక్రమం చేపట్టాలని పిలుపునిచ్చారు. అర్హులందరికీ గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ. ఐదు లక్షలు ఇవ్వాలని కోరారు. ప్రజలపై విద్యుత్ భారం పడకుండా నాడు చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలన్నారు.

30న చీరాలలో శతవసంతాల భారీ ర్యాలీ

సీపీఐ శత వసంతాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తెలిపారు. ఈ నెల 26న అద్దంకిలో ఉత్సావాలు ప్రారంభంకానున్నాయని, ముగింపును సందర్భంగా చీరాలలో 30వ తేదీన ర్యాలీ భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జల్లి విల్సన్, పార్టీ ముఖ్యులు హాజరు కానున్నారని వివరించారు. చీరాల నియోజకవర్గ కార్యదర్శి చిరమల ప్రకాష్ బాబు, అద్దంకి నియోజకవర్గ కార్యదర్శి తమ్మల పూర్ణచంద్రరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల శామ్యూల్, యాటగిరి శ్రీనివాసులు, కేఎల్‌డీ ప్రసాద్, మేడా వెంకట్రావు, షేక్ మహమ్మద్ ముస్తఫా పాల్గొన్నారు.

అమిత్‌షా అనుచిత వ్యాఖ్యల్ని ప్రతి ఒక్కరూ ఖండించాలి: రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కించపరుస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పార్లమెంటులో అమిత్ షా మాట్లాడుతూ "పదే పదే అంబేద్కర్ అని ఎందుకంటారు? అంబేద్కర్ బదులు ఏ హిందూ దేవుడినైనా తలచుకుంటే స్వర్గానికి వెళ్తారు" అని వ్యాఖ్యానించటం దుర్మార్గం అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చాలనే దురుద్దేశంతో మోదీ, అమిత్ షాల నేతృత్వంలో మత వాదాన్ని నెత్తికెత్తుకుని బీజేపీ పాలకులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో బీజేపీకి స్వంతంగా మెజార్టీ రాకపోవటంతో తటపటాయిస్తున్నారని, జమిలీ ఎన్నికల పేరుతో సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాల హక్కులను హరించి కేంద్ర ప్రభుత్వ పెత్తనాన్ని తీసుకువచ్చేందుకు మోదీ సర్కార్ ప్రయత్నించటాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కించపరిచిన అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లౌకిక, ప్రజాతంత్ర వాదులంతా ఈ వ్యాఖ్యలను ఖండించాలని కోరారు.

అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు హేయం: డీహెచ్‌పీఎస్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు హేయమని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కార్యనిర్వాహక కార్యదర్శి జేవీ ప్రభాకర్, కరవది సుబ్బారావు, బుట్టి రాయప్ప ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అమిత్ షా వ్యాఖ్యలను డీహెచ్‌పీఎస్ ఖండిస్తుందన్నారు. అమిత్ షా బేషరతుగా దేశ ప్రజానీకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులు బడుగు బలహీన వర్గాలు నేడు దేశంలో స్వేచ్ఛ వాయువులను పీలుస్తోంది కేవలం అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా ఇచ్చిన హక్కు అన్నారు. ఎన్నికలకు ముందు అంబేద్కర్ పేరు జపించి... అధికారంలోకి వచ్చిన బీజేపీ నేడు అంబేద్కర్ పేరు ఎత్తకూడదని చెప్పడం సిగ్గుచేటన్నారు. భారత రాజ్యాంగంపై, ప్రభుత్వ రంగ సంస్థలపై బీజేపీ ప్రభుత్వం దాడి చేస్తోందన్నారు. బీజేపీ నుండి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు.

విజయవాడ పుస్తక మహోత్సవ వేదిక మార్పు

విశాలాంధ్ర-విజయవాడ: జనవరి 2 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న 35వ విజయవాడ పుస్తక మహోత్సవం వేదిక విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియానికి మార్పు చేసినట్లు విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి టి.మనోహర్ నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కోరికను మన్నించిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మహాత్మాగాంధీ రోడ్డులోని మున్సిపల్ స్టేడియంలో నిర్వహించటానికి అనుమతించారని పేర్కొన్నారు. ఈ మార్పును ప్రజలు, సాహితీవేత్తలు, ప్రచురణకర్తలు గమనించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం

విశాలాంధ్ర-పుంగనూరు: కర్నాటక రాష్ట్రం ముల్‌బాగల్ తాలూకా గుడిపల్లి పంచాయతీ వద్ద బొలెరో వాహనం ఢీకొని ఐదుగురు దుర్మరణం చెందారు. అన్నమయ్య జిల్లాలోని రామసముద్రం మండలం కూరిజిల గ్రామానికి చెందిన వాహనం వీరిని ఢీకొట్టడంతో గుడిపల్లి పంచాయతీ నాగేపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలు అప్పయ్య (45), గాయత్రి (40), కోనంగుంట గ్రామానికి చెందిన భార్యాభర్తలు వెంకటరమణప్ప (43), అలివేలమ్మ (38), అదే గ్రామానికి చెందిన రాధప్ప (45) ప్రమాద స్థలిలోనే మరణించారు. పని నిమిత్తం వెంకటరమణప్ప, అలివేలమ్మ, రాధప్ప ఒక బైక్‌పై, అప్పయ్య, గాయత్రి మరొక బైక్ పైన ముల్‌బాగల్ వైపు వెళుతుండగా వడ్డిపల్లి నుంచి టమాటా బాక్సుల లోడుతో బొలెరో వాహనం ఎదురుగా వచ్చి అతివేగంతో రెండు బైకులను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీనిపై వడ్డిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ యూట్యూబ్ ఛానల్ హ్యాక్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ అధికారిక యూట్యూబ్ ఛానెల్ హ్యాకింగ్‌కు గురయింది. దుండగులు ఛానల్‌ను హ్యాక్ చేశారు. ఛానల్‌లో బుధవారం ఉదయం నుంచి అంతరాయం ఏర్పడింది. ఛానల్‌ను ఆన్ చేస్తే బ్రేక్ అయినట్లు వస్తోందని నేతలు పేర్కొన్నారు. హ్యాకర్లను గుర్తించేందుకు ఆ పార్టీ టెక్నికల్ వింగ్ రంగంలోకి దిగింది. దీనిపై యూట్యూబ్ యాజమాన్యానికి పార్టీ వర్గాలు ఫిర్యాదు చేశాయి. ఛానల్ పునరుద్ధరణ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

పశుసంవర్ధకం... అవినీతి జలగలు

- అధికార దుర్వినియోగంతో అక్రమ సంపాదన
- కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో పెట్ క్లినిక్‌లు, మందుల షాపులు
- బినామీ పేర్లతో వ్యాపారాల నిర్వహణ
- తెలిసినా పైస్థాయి అధికారుల మౌనం

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్: అంతరించిపోతున్న పశు సంపదను కాపాడడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు ప్రవేశపెట్టి ప్రోత్సహిస్తుంటే, వాటిని అమలు చేయాల్సిన పశు సంవర్ధక శాఖలోని కొందరు అధికారులు అక్రమ సంపాదన కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు తూట్లు పొడుస్తున్నారు. నెలకు రూ.లక్షల్లో జీతాలు తీసుకుంటున్న కొందరు స్వార్థపర అధికారులు బినామీ పేర్లుతో వ్యాపార సామ్రాజ్యాలను నిర్మిస్తున్నారు. కొందరు అసిస్టెంట్ డైరెక్టర్లు, డాక్టర్లు ... అక్రమ ద్వారాలు తెరిచి పెట్ క్లినిక్‌లు, మెడికల్ షాపులు నిర్వహిస్తూ రెండు చేతులా లక్షలు సంపాది స్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో యానిమల్ హజ్‌బెండరీ విభాగంలో పని చేస్తున్న ఓ అసిస్టెంట్ డైరెక్టర్ బినామీ పేర్లుతో విజయవాడ లబ్బీపేట, గుంటూరు లక్ష్మీపురంలో పెట్ క్లినిక్‌లు, మెడికల్ షాపులు నిర్వహిస్తుండటంతో పాటు గుంటూరులో ఆధునాతనమైన ఓ పంక్షన్ హాల్ నిర్వహిస్తున్నారు. విజయవాడ, కృష్ణా జిల్లాలో ఎనిమిది ప్రాంతాల్లో ఆ విభాగానికి చెందిన అసిస్టెంట్ డైరెక్టర్లు, డాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ షాపులు నిర్వహిస్తూ బహిరంగంగానే అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారాం. ఆదే విభాగానికి చెందిన ఓ అసిస్టెంట్ డైరెక్టర్, గుంటూరు జిల్లా మెడిసిన్ పర్చేజింగ్ కమిటీ సభ్యులుగా ఉంటూ కోట్లు సంపాదించి ఏకంగా ఎమ్మెల్యే టికెట్‌కు యత్నించే స్థాయికి ఎదిగారంటే అక్రమార్జన ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పైస్థాయి అధికారులకు ఇవన్నీ తెలిసి కూడా చర్యలకు ఉపక్రమించకపోవటం పలు అనుమానాలకు తావిస్తోంది. చిలకలూరిపేటలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి విజయవాడ లబ్బీపేటలో దశాబ్దానికిపైగా తన కుమారుని పేరుతో పెట్ మెడికల్ షాపు నిర్వహిస్తూ ఈనెల ఆరోతేదీన రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొని అనంతరం ఎదురుగా బినామీ పేరుతో నడుస్తున్న మెడికల్ షాపులో ఓనర్ సీటులో కూర్చున్నారంటే ఆయన అధికార దుర్వినియోగం ఏ స్థాయిలో ఉందో చెప్పకనే చెబుతోంది. విజయవాడ, గుంటూరు జిల్లాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కోట్లు గడించిన సదరు అధికారి ఎమ్మెల్యే సీటు కోసం కూడా ప్రయత్నం చేసినట్లు చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేయాలంటే నేడు రూ.100 కోట్లు పైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి. మరి ఇన్ని కోట్లు ఖర్చు చేసే స్తోమత ఓ ప్రభుత్వ అధికారికి ఉందంటే... ఎన్ని వందల కోట్లు ఉండి ఉంటాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. భాద్యత కలిగిన ప్రభుత్వ పదవిలో ఉన్న సదరు అధికారి, ఆయన పై అధికారులు ఈ అనుమానాలకు సమాధానం చెప్పాలని పలురు డిమాండ్ చేస్తున్నారు. అదేశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉంటూ విజయవాడ ఈఎస్ఐ ఆసుపత్రి వద్ద పెట్‌క్లినిక్... మరో అసిస్టెంట్ డైరెక్టర్ పటమట పంటకాలువ రోడ్డులో మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారు. కృష్ణాజిల్లా కానూరులో నాగార్జున ఆసుపత్రి వద్ద ఓ డాక్టర్ మెడికల్ షాపు, మరో వైద్యులు చల్లపల్లిలో మరో మెడికల్ షాపు, ఇంకో అధికారి విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో ఓ మెడికల్ షాపు, విజయవాడ భవానీపురంలో ఓ పశువుల డాక్టర్ ఒక మెడికల్ షాపు, మరి కొంత మంది పశువైద్యులుగా పనిచేస్తూనే సీతన్నపేటలో మెడికల్ షాపు, గుణదల కరెంట్ ఆఫీసు వద్ద మెడికల్ షాపు, విజయవాడ చిట్టినగర్ సొరంగం వద్ద ఓ మెడికల్ షాపును నిర్వహిస్తున్నారు. వీరంతా అధి కార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు విమర్శలు హల్‌చల్ చేస్తున్నాయి. ఇదిలా ఉండగా, అధికారాన్ని అడ్డుపెట్టుకుని రెండు చేతులా అక్రమ సంపాదనకు అలవాటుపడిన అధికారులపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

పశుసంవర్ధక శాఖలో పని చేస్తున్న కొందరు అసిస్టెంట్ డైరెక్టర్లు, పశువైద్యులు సొంతంగా పెట్ క్లినిక్‌లు, మెడికల్ షాపులు నిర్వహిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టు విచారణలో రుజువైతే చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు ఈ విషయాలు తన దృష్టికి రాలేదు. తక్షణమే విచారణకు ఆదేశిస్తా.

– పశుసంవర్ధక శాఖ స్టేట్ డైరెక్టర్ దామోదర్ నాయుడు

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.